



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

భూ–గగనతల దాడుల్లో గాజా సిటీ ధ్వంసం
'న్యూయార్క్ టైమ్స్'పై ట్రంప్ పరువునష్టం దావా
02

సంపుటి 08, సంచిక: 287 | బుధవారం | 17-09-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



నేడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట

## ముగింపు వారోత్సవాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ ఆధ్వర్యంలో 77వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు వారోత్సవ వేడుకలను బుధవారం(నేడు) ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనే ని సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముఖ్ధూంభవన్‌లో ఉదయం 10.30గంటలకు సిపిఐ జాతీయ నాయకులు జాతీయ పతాకంతో పాటు అరుణ పతాకాలను ఎగురవేస్తారన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ ఎం. కోదండరాం ప్రొఫెసర్ డాక్టర్ కే నాగేశ్వర్‌తో పాటు సిపిఐ అగ్ర నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల

# యూరియా రాలే

- ఈనెలలోనే సరఫరా చేయండి
- రాష్ట్రంలో కొత్తగా 16 కృషి కేంద్రాలను ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహన్, అనుప్రియ పటేల్‌లకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీలో రెండవ రోజు బిజీ బిజీగా గడిపారు. మంత్రి తుమ్మల మంగళవారం కేంద్ర కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి కొత్త కృషి విజ్ఞాన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఖరీఫ్ సీజన్‌లో ప్రణాళిక ప్రకారం ఇప్పటీ వరకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా రాలేదని, దానిని ఈనెలలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, వీరికి అధునిక సాంకేతిక కూడిన వ్యవసాయ మద్దతు అవసరమని ఇందుకు కృషి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ భౌగోళిక విస్తీర్ణం112.08 లక్షల హెక్టార్లు కాగా, ఇందులో 49.64 శాతం భూమి సాగుభూమిగా ఉందని, రాష్ట్రంలో 70.60 లక్షల రైతులు 67.14 లక్షల హెక్టార్ల భూమిలో సాగు చేస్తుండగా, సగటు సాగు భూముల పరిమాణం కేవలం 0.89 హెక్టార్లు మాత్రమే అని మంత్రి వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో తరువాయి 2లో

# జిఎస్‌టి సవరణతో ఏటా రూ.5వేల కోట్లు నష్టం

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆందోళన
- అయినా పేదలు, మధ్యతరగతి కుటుంబాల మేలుకోసం జిఎస్‌టి రేషనలైజేషన్ జరగాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది
- అడ్డదారులు తొక్కేవారి వల్ల రాష్ట్రాదాయానికి నష్టం చేకూరుతోందని వ్యాఖ్య
- వ్యాపారవర్గాలతో ముఖాముఖి



ప్రజాపక్షం/హైదరాబాద్

జిఎస్‌టి రేట్ల సవరణతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ 5వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పేద, మధ్యతరగతి రైతాంగ కుటుంబాల మేలు కోసం జిఎస్‌టి రేషనేలైజేషన్ జరగాలని సిఎం రేవంత్‌రెడ్డి, మొత్తం మంత్రివర్గం ఒక విధాన నిర్ణయం తీసుకుందన్నారు. ఐటిసి తరువాయి 2లో



రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ప్రోత్సాహకం అందించి మళ్లీ నడిచేలా చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గుండేటి రాహుల్, ఆయన కుటుంబసభ్యులు

అంధ విద్యార్థులకు వాయిద్య పరికరాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, విద్యార్థులు పాడిన పాటల సిడి ఆవిష్కరణ

03



## భారీగా అక్రమాస్తులు

ఎసిబికి చిక్కిన విద్యుత్‌శాఖ ఎడిఇ అంబేద్కర్ అరెస్టు, రిమాండ్

**హైదరాబాద్ :** అవినీతి నిరోధక శాఖ వలకు మంగళవారం భారీ తిమింగళం చిక్కింది. హైదరాబాద్‌లో విద్యుత్‌శాఖ ఎడిఇ అంబేద్కర్‌ను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎసిబి అరెస్టు చేసింది. వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లిలో ఇళ్లు, గచ్చిబౌలిలో 5 అంతస్తుల భవనం, హైదరాబాద్ లోని ప్రధాన ప్రాంతాల్లో 6 ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు, 2 కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు, వ్యవసాయ భూములను గుర్తించారు. తెలంగాణ విద్యుత్ శాఖలో ఎడిఇ అంబేద్కర్ బంధువు సతీష్ నివాసంలో ఇంట్లో ఎసిబి అధికారులు రూ.2 కోట్ల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎడిఇగా పనిచేస్తున్న అంబేద్కర్‌పై ఫిర్యాదులు రావడంతో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. అంబేద్కర్ కొండాపూర్‌లోని మేఘన లేక్ వ్యూ అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్తులో ఉంటున్నాడు. ఈయనపై అనేక అవినీతి ఆరోపణలున్నట్లు తరువాయి 2లో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని

## హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరణ

- మతతత్వవాదులు చరిత్రను వక్రీకరిస్తున్నారు
- 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం - పునః సమీక్ష' పై జరిగిన సెమినార్‌లో పలువురు వక్తలు విమర్శ
- కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తూ హైజాక్ చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం




ప్రజాపక్షం/హైదరాబాద్

నిరంకుశ నిజాంకు, భూస్వామ్యదారులకు వ్యతిరేకంగా జరిగిన మహోత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతతత్వవాదులు హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీని అంతం చేయడమే లక్ష్యంగా నాటి కేంద్ర ప్రభుత్వం ఆర్మీని ప్రయోగిస్తే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తూ హైజాక్ చేసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహంవ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ లోని న్యూ సెమినార్ హాల్ లో సెప్టెంబర్ 17 వక్రీకరణ సందర్భంగా 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పునః సమీక్ష' అనే అంశంపై అఖిలభారత విద్యార్థి సమాఖ్య( ఎఐఎస్‌ఎఫ్) ఉస్మానియా విశ్వవిద్యాలయం సమితి ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొఫెసర్ కందుకూరి రమేష్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, కాలమిస్ట్ డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, యాక్టివిస్ట్ అచ్యుత సునీత తదితరులు ముఖ్య వక్తలుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం తిరుగుబాటు ఆగదన్నారు. భూస్వామ్య రూపం మారిందని, సారం మాత్రం తరువాయి 12లో

కొత్త డిస్కం ఏర్పాటుకు

## పూర్తిస్థాయి ప్రణాళిక

వీలైనంత త్వరగా సిద్ధంచేయాలని అధికారులకు సిఎం ఆదేశం

సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై కీలక సూచనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఏర్పాటుకు పూర్తిస్థాయి ప్రణాళికను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం అనంతరం కొత్త డిస్కం ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలని సిఎం చెప్పారు. మూడవ డిస్కంకు సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పిపిఎ) అలొకేషన్, సిబ్బంది విభజన, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఇందన శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని మంగళవారం సాయంత్రం తన నివాసంలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇంధన శాఖ తరువాయి 12లో

మానవీయ కోణంలో

## ఆలోచించండి

- చిన్న సమస్యను సాకుగా చూపి జఠిలం చేయొద్దు
- పేదలకు భూ హక్కుల విషయంలో అధికారులకు మంత్రి పొంగులేటి సూచన
- గిరిజనులకు భూ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వ్యాఖ్య
- నాగార్జున సాగర్ నియోజకవర్గం పరిధిలోని భూ సమస్యలపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపైన పేదలకు హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. పేదలకు చెందిన భూ సమస్యలకు పరిష్కారాన్ని చూపాలన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పరిధిలోని భూ సమస్యలపైన హైదరాబాద్‌లోని డాక్టర్ బి. ఆర్,అంబేద్కర్ సచివాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె. జానారెడ్డి, నాగార్జున సాగర్ ఎంఎల్‌ఎ కె. జయవీర్ రెడ్డి, దేవరకొండ ఎంఎల్‌ఎ బాలూ నాయిక్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి ఎస్.లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఐలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 40, 50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వివిధ తరువాయి 12లో




హిమాలయ రాష్ట్రాల్లో

# కుంభవృష్టి

ఉత్తరాఖండ్, హిమాచల్‌లో భారీ వర్షాలు

ఉత్తరాఖండ్‌లో ముగ్గురు మృతి, హిమాచల్‌లో ఐదుగురు గల్లంతు



**డెహ్రాడూన్/సిమ్లా/ముంబయి :** గత రెండు నెలలుగా వరుస ప్రకృతి వైపరీత్యాలతో హిమాలయ రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లు అతలాకుతలమవుతున్నాయి. తాజాగా సోమవారం రాత్రిపూట కురిసిన భారీ వర్షాలు మరోసారి ముంచెత్తాయి. హిమాచల్ ప్రదేశ్‌లో మంగళవారం కురిసిన వర్షాలకు భారీ కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు తరువాయి 2లో

## గాజాలో 'సామూహిక హత్యాకాండ'

- అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘన
- ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ నివేదిక
- నివేదిక నిపుణులు హమాస్ తొత్తులు : కట్జ్ విమర్శ



**న్యూయార్క్:** గాజాలో ఇజ్రాయెల్ దారుణమారణకాండ సృష్టించిందని, పాలస్తీనా ప్రజలకు నిలువనీడ లేకుండా, ఎక్కడా సురక్షిత ప్రదేశం లేకుండా చేసి 'సామూహిక హత్యాకాండ' కు నిర్వచించిన నిబంధనలన్నింటినీ అధిగమించిందని ఐక్యరాజ్యసమితి విచారణా కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదిక రూపొందించిన కమిషన్‌కు అధ్యక్షత వహించిన నవీ పిళ్ళై ఈ విషయం ప్రకటించారు. ఈ యుద్ధంలో 7.50 లక్షలమంది పాలస్తీనియన్లు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులయ్యారనీ, ఆ ప్రాంతమంతా ఇజ్రాయెల్ వశమైందని చెప్పారు. వెస్ట్‌బ్యాంక్, జెరూసలెం, గాజాలలో దాడుల సందర్భంగా యావత్ పాలస్తినా జాతినీ నిర్మూలించాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకుందని నవీ పిళ్ళై తన నివేదికలో స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ దేశ నాయకులు చేస్తున్న వివిధ రకాల ప్రకటనలు, వారి ప్రవర్తన, దాడుల తీరు తెన్నులే గాజాలో సామూహిక విధ్వంసకాండకు, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనకు, మానవతా విధ్వంసానికి సజీవసాక్ష్యాలుగా విచారణా కమిషన్ తన నివేదికలో చూపించింది. నాజీ జర్మనీలో హిట్లర్ 60 లక్షలమంది యూదులను గ్యాస్ ఛాంబర్స్‌లోపెట్టి, తరువాయి 2లో

## పేదల పక్షాన అవిశ్రాంత పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

జాతీయ స్థాయికి ఎదిగిన మహానాయకుడు సురవరం
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
03




20వ కాంగ్రెస్ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ ప్రపంచవ్యాప్త దుష్ప్రచారం : మదురో

**కారకస్:** కరీబియన్ ప్రాంతంలో డోనాల్డ్ ట్రంప్ సృష్టించిన వెనిజులా వ్యతిరేక దురాక్రమణ ఉద్రిక్తతలు దాదాపు ఇరవై రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. మాదకద్రవ్యాలను ఎగుమతిచేసే దేశంగా వెనిజులాపై ముద్రవేసిన ట్రంప్ ఆ దేశం చుట్టుపక్కల అనేక యుద్ధనౌకలను, విమానాలను మోహరించారు. అంతర్జాతీయ జలాలలో రెండోసారి కూడా మరో పడవపై దాడిచేసి మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని, సముద్రమార్గంలో అమెరికాకు మాదక ద్రవ్యాలను రవాణాచేస్తున్న ముగ్గురు ఉగ్రవాదులను తమ సైన్యం హతమార్చిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈనెల రెండో తేదీన కూడా ఇదేవిధమైన దాడులు చేసి మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. అమెరికా తప్పుడు ప్రచారంతో వెనిజులా దురాక్రమణ చర్యలకు పాల్పడుతోందని ఆ దేశ అధ్యక్షుడు నికొలస్ మదురో విమర్శించారు. కొద్దోగొప్పో ఇప్పటివరకూ అమెరికాతో వెనిజులాకు ఉన్న కమ్యూనికేషన్స్ బంధం పూర్తిగా తెగిపోయిందని ఆయన ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా వెనిజులాకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

# భూ–గగనతల దాడుల్లో గాజా సిటీ దగ్ధం

### ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ ప్రకటన
### 52 మంది మృతి





**గాజా :** గడచిన పదిరోజులుగా గాజా సిటీలో పాలస్తీనా ప్రజలను ఖాళీచేసి వెళ్ళిపోవాలని హెచ్చరికలు చేస్తూ, పథకం ప్రకారం హై రైజ్ భవంతులను క్షిపణులతో కూల్చివేస్తున్న ఇజ్రాయెల్ సైనిక దళాలు మంగళవారం తాజాగా పూర్తిస్థాయిలో భూతల,గగనతల యుద్ధాన్ని విస్తరించడం ప్రారంభించింది. గాజాసిటీ మంటలలో దగ్ధమైపోతోందని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి అవిఛా అద్రాయీ, రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. బందీలను వెంటనే విడుదల చేయాలని, హమాస్ ఆయుధాలు వదిలిపెట్టాలని, లేకపోతే గాజాను సర్వనాశనం చేస్తామని రక్షణమంత్రి కట్జ్ హెచ్చరిక చేశారు. గాజాసిటీలో హమాస్ శాశ్వత ప్రాతిపదికపై సమకూర్చుకున్న అన్ని మౌలిక సదుపాయాలను సంపూర్ణంగా ధ్వంసం చేయడం ప్రారంభించడంతో తెల్లవారు.జాము నుండీ బాంబుపేలుళ్ళు, వైమానిక దాడులతో గాజా సిటీ దద్దరిల్లిపోతోంది. ఉదయం నుండి జరిగిన దాడుల్లో 52 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఐడిఎఫ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. గాజా సిటీ నుండి ఇప్పటికే 3,00,000 మందికిపైగా పాలస్తీనియన్లు దక్షిణ ప్రాంతానికి, ఖాన్ యూనుస్‌లకు సామాన్లు సర్దుకుని వెళ్ళిపోయారు. గాజాసిటీలో ఐడిఎఫ్ హమాస్‌తో బాహాబాహీకి దిగింది. గాజాసిటీలో ఇంకా 48 మంది బందీలు హమాస్ వద్ద చెరలో ఉండగా, చివరకు 18 మంది మాత్రమే సజీవులు ఉండి ఉంటారని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో వారి ప్రాణాలను కూడా ఐడిఎఫ్ పణంగా పెట్టి యుద్ధాన్ని విస్తరించిందని బందీల బంధువులు, గల్లంతైనవారి కుటుంబాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

గడచిన మూడునెలలుగా టెల్‌అవీవ్‌లో, జెరూసలెంలో ఇజ్రాయెల్ ప్రజలు, బాధిత కుటుంబాలు వేలాదిమంది నిత్యం పగలూ, రాత్రి అనే తేడాలేకుండా వీధుల్లోకి వచ్చి నెతన్యాహూకు తమ నిరసన తెలియజేస్తున్నప్పటికీ ఆ దేశాధినేత పట్టించుకోవడంలేదు. దీంతో నెతన్యాహూ ఒక్కడే బందీల విడుదలకు అతిపెద్ద ఆటంకంగా మారాడని ఇజ్రాయెల్ ప్రజలు బాహాటంగా వీధుల్లో నినాదాలు చేస్తున్న తరుణంలో ఐడిఎఫ్ భూ–గగనతల మార్గాలలో గాజాసిటీలో ఏకకాల యుద్ధాన్ని విస్తరించింది. ఇప్పటికే 40 శాతం గాజా ఇజ్రాయెల్ అధీనంలోకి వచ్చింది. 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌లో జరుగుతున్న సంగీత ఉత్సవంపై హమాస్ ఉగ్రవాదులు సామూహికంగా దాడిచేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపి 1200 మందిని బలి తీసుకున్నారు. మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. వీరిలో విడుదలైనవారు విడుదలకాగా మరికొంతమంది యుద్ధంలోనూ, నిర్బంధ సమయంలో ఆకలి,చిత్రహింసలకారణంగానూ మరణించగా ఇంకా 48 మంది బందీలు ఉండిపోయారు. వీరిలో కేవలం 18 మంది మాత్రమే సజీవులుగా ఉన్నారన్నది ప్రస్తుత అంచనా. 24 నెలల యుద్ధంలో 1,64,610 మంది గాయపడగా, ఆహార కేంద్రాలవద్ద సహాయం కోసం ఎదురుచూస్తున్న మరో 20000 మందిపైగా పాలస్తీనియన్లు గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ ఐడిఎఫ్ కాల్పుల్లో మరణించారు. 150 మంది బాలలు సహా వందలమంది ఆకలి దప్పులతో, అంటువ్యాధులతో మరణించారు.



## 17 కోట్ల మంది అమెరికన్ టిక్‌టాక్ యూజర్లు హ్యాపీ

### శుక్రవారం ట్రంప్– జిన్‌పింగ్ హలో..హలో

**వాషింగ్టన్ :** టిక్‌టాక్ వినియోగంపై ఏర్పడిన వాణిజ్య వివాదం పరిష్కరించుకోవడానికి అమెరికా–చైనా ప్రతినిధులమధ్య మాడ్రిడ్‌లో జరిగిన చర్చలు దాదాపు ఫలవంతమయ్యాయి. ఈ చర్చలను పూర్తిస్థాయిలో ఫలవంతం చేయడానికి రాబోయే శుక్రవారం(సెప్టెంబరు 19) అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య తుది విడతగా టెలిఫోన్ ద్వారా సంభాషణలు జరుగుతాయి. అమెరికాలో 170 మిలియన్లమంది టిక్‌టాక్ యూజర్లు (17 కోట్లమంది యూజర్లు) ఉన్నారు. ఈ ఒప్పందం నేపథ్యంలో అమెరికాలో ఉన్న టిక్‌టాక్ యూజర్లు అందరూ ఇప్పుడు ఎంతో సంతోషంతో ఉన్నారు. నిర్ణీత ప్రకారం టిక్‌టాక్‌ను అమెరికాలోని స్వదేశీ కంపెనీకి విక్రయించాలని లేదా దేశంలో టిక్‌టాక్‌ను నిషేధిస్తామని ట్రంప్ షరతు విధించారు. దీనిపై విధించిన నిషేధాన్ని ఇప్పటికే పలుసార్లు పొడిగిస్తూ వచ్చారు. టిక్‌టాక్‌పై నిషేధానికి విధించిన తుదిగడువు బుధవారం (సెప్టెంబరు 17వతేదీ)తో ముగియనున్న తరుణంలో రెండు రోజులు ముందుగా రెండు దేశాలమధ్యా ఈ ఒప్పందం దాదాపు ఖరారైంది. టిక్‌టాక్ ద్వారా అమెరికాలో కోట్లమంది వినియోగదారుల సమాచారాన్ని చైనా తన స్వప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తోందన్నది అమెరికా ఆరోపణ. గత ఏడాది ఏప్రిల్‌లో అమెరికా బైడెన్ ప్రభుత్వం ఒక తీర్మానం చేస్తూ, టిక్‌టాక్ యజమాని బైట్‌డాన్స్ తన కంపెనీని అమెరికాలో వేరే ప్రైవేటు పెట్టుబడిదారుడికి విక్రయించాలని, లేకపోతే నిషేధాన్ని ఎదుర్కోవాలని స్పష్టం చేసింది. దీనిని ఆ దేశ న్యాయస్థానం కూడా సమర్థించింది.

## ‘న్యూయార్క్ టైమ్స్’పై ట్రంప్ పరువునష్టం దావా

**వాషింగ్టన్ :** ‘న్యూయార్క్ టైమ్స్’ దినపత్రికపై 15 బిలియన్ డాలర్ల మేరకు పరువునష్టం దావా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం తెల్లారకముందే ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఈ ప్రకటన చేశారు. ట్రంప్ తరచుగా బసచేసే మార్ ఎ లాగో నివాసం ఉన్న ఫ్లోరిడా కోర్టులో ఈ పరువునష్టం దావా వేస్తున్నారు. ‘‘మనదేశ చరిత్రలో ఉన్న అతి చెత్త పత్రిక, దిగజారుడు పత్రిక న్యూయార్క్ టైమ్స్’’ అని ఆయన పేర్కొన్నారు. రాడికల్ లెఫ్ట్ డెమోక్రటిక్ పార్టీకి న్యూయార్క్ టైమ్స్ ఒక సొంత బాకా పత్రికలా మారిందని విమర్శించారు. పత్రికపై దావా వేయడాన్ని ఎంతో గౌరవంగా తాను భావిస్తున్నానన్నారు.‘న్యూయార్క్ టైమ్స్ పత్రిక తన దృష్టిలో ఎప్పటికీ అక్రమ దుష్ప్రచారాలకు ఉపయోగపడే అతిపెద్ద సర్క్యులేషన్ ఉన్న పత్రికగా మిగిలిపోతుందని విమర్శించారు. దశాబ్దాల క్రితంనాటి అసత్య ప్రచార పద్ధతులనే తనలాంటి ప్రియమైన అధ్యక్షుడి విషయంలో కూడా అనుసరిస్తోందని, తనపైన, తన కుటుంబంపైన, తన వ్యాపారాలపైన, ‘‘మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) ఉద్యమంపైనా, మొత్తంగా మన దేశంమీద న్యూయార్క్ టైమ్స్ పత్రిక అసత్య ప్రచారాలు చేస్తోందని ట్రంప్ విమర్శించారు. తనపై స్వేచ్ఛగా బురద జల్లడానికి, తన ప్రతిష్ఠను దిగజార్చడానికి ఈ పత్రిక అవకాశం ఇస్తోందన్నారు.



## మలావీలో ఎన్నికలు.. 30న ఫలితాలు

**లినోంగ్వే:** ఆగ్నేయ ఆఫ్రికాలో జింబాబ్వే, టాంజానియా సరిహద్దుల్లోని దేశం మలావీలో మంగళవారం సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2.16 కోట్లమంది జనాభాగల ఈ చిన్న దేశంలో 72 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. కొత్త అధ్యక్షుణ్ణి, పార్లమెంటు సభ్యులను ఎన్నుకుంటారు. పోటీలో పదవి గెలుచుకోవాలంటే 50 శాతం ఓట్లు సంపాదించుకోవాలి. లేకపోతే ఎక్కువ ఓట్లు పొందిన మొదటి ఇద్దరు అభ్యర్థుల మధ్యా రన్నాఫ్ ఎన్నికలు రెండో విడత జరుగుతాయి.ఎన్నికల తుది ఫలితాలు సెప్టెంబరు 30వ తేదీన వెలువడతాయి. 299 పార్లమెంటు నియోజకవర్గాలు, మరో 509 కౌన్సిల్ నియోజకవర్గాలకు సభ్యులను ఎన్నుకుంటారు. పొగాకు, టీపొడెం వంటి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే మలావీ దేశానికి భారీగా విదేశీ రుణభారంతోపాటు ఆర్థిక సంక్షోభం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ సమస్యలున్నాయి. అధ్యక్ష పదవికి 17 మంది పోటీ పడుతుండగా, ప్రస్తుతం పదవిలో ఉన్న మలావీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు (ఎంసిపి) అధ్యక్షుడు లాజరస్ ఛక్వేరా (70) రెండోసారి కూడా పదవిని నిలబెట్టుకుంటాననే విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు ప్రతిపక్ష డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డిపిపి) నాయకుడు పీటర్ ముథారికా (85) గట్టిపోటీ ఇస్తున్నారు.

## ఖతార్‌పై ఇజ్రాయెల్ మళ్ళీ దాడి చేయదు

### భరోసా ఇచ్చిన ట్రంప్

**వాషింగ్టన్:** దోహాపై ఇజ్రాయెల్ ఇక మరోసారి దాడి చేయదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భరోసా ఇచ్చారు. ఓవల్ ఆఫీసులో ట్రంప్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడారు. నెతన్యాహూ మీకు ఏదైనా హామీ ఇచ్చారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు, ఇజ్రాయెల్ మరోసారిఇ ఖతార్‌పై దాడి చేయదు అని మాత్రమే సమాధానం చెప్పారు. ఖతార్ తమకు చాలా గొప్ప మిత్రదేశమని, ఈ విషయం చాలామందికి తెలియదని అన్నారు. తమ ప్రియమిత్రదేశమైన ఖతార్‌తో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ట్రంప్ మూడురోజులక్రితం నెతన్యాహూకు హెచ్చరిక చేశారు. సోమవారం నాడు దోహాలో అరబ్‌దేశాల నాయకులు సమావేశమై ఇజ్రాయెల్‌తో సంబంధాలను సమీక్షించారు.

## భారీగా అక్రమాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

ఎసిబి అధికారులు తెలిపారు. తమకు అందిన ఫిర్యాదులతో రంగంలోకి దిగిన ఎసిబి కేసు నమోదు చేసి సోదాలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్ జిల్లాల్లోని ఆయన బంధువులు, కుటుంబసభ్యులు, స్నేహితుల నివాసాల్లో మొత్తం 12 చోట్ల సోదాలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రధాన ప్రాంతాల్లో 6 ఇళ్లు, 3 ప్లాట్లు, గచ్చిబౌలిలో ఖరీదైన భవనం, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో 10 ఎకరాల వ్యవసాయ భూమి, 2 కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు, హైదరాబాద్ శివారులో వెయ్యి గజాల్లో వ్యవసాయ క్షేత్రం (ఫార్మ్‌హౌస్) గుర్తించినట్లు ఎసిబి డిఎస్‌పి ఆనంద్ మీడియాకు తెలిపారు. ఈ సోదాల్లో మరిన్ని ఆస్తులకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. అయితే విద్యుత్ శాఖలో అవినీతి అధికారి వ్యవహారం బట్టబయలు కావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. అంబేడ్కర్ ఆస్తులపై సోదాలు ముగిసిన అనంతరం ఆయనను అరెస్టు చేసింది. కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించింది.

## 5వేల కోట్లు నష్టం (మొదటి పేజీ తరువాయి)

(ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్) వాస్తవంగా వ్యాపారం చేసే వారికి ఉపయోగకరమని, అడ్డదారులు తొక్కే వారి వల్ల రాష్ట్ర ఆదాయానికి నష్టమన్నారు. నిబద్ధతతో స్వచ్ఛంగా వ్యాపారం చేసేవారు అడ్డదారులు తొక్కే వ్యాపారుల సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని వ్యాపారులను భట్టి విక్రమార్క కోరారు. జిఎస్‌టి రేట్ల సవరణ నేపథ్యంలో వ్యాపార వర్గాలతో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో మంగళవారం ‘ముఖాముఖి’ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆదాయాన్ని కోల్పోతుందని, ప్రజలకు ఆ ఫలాలు చేరాలంటే వ్యాపారులు భాగస్వాములు కావాలని సూచించారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజల ఎదుగుదల కోసం ప్రజా ప్రభుత్వం రూ. 5వేల కోట్ల ఆదాయం కోల్పోతున్నప్పటికీ జిఎస్‌టి రేట్ల సవరణ విధాన నిర్ణయంలో ప్రధాన భూమికను పోషించిందని గుర్తు చేశారు. జిఎస్‌టి కౌన్సిల్ సభ్యునిగా ప్రజల తరపున నిర్ణయాలు తీసుకోవడంలో తాను ప్రముఖ పాత్రను వహించానని అన్నారు. సవరించిన రేట్లతో పెద్ద సంఖ్యలో వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులోకి వస్తున్నాయని, ఆ ఫలాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, వ్యాపారులపైన ఉందన్నారు. జిఎస్‌టిలో సులభమైన విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ఢిల్లీలో సుదీర్ఘ చర్చలు జరిగాయని, భేషజాలకు పోకుండా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడతాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం, వ్యాపారులు కలిసి నడిస్తేనే ప్రగతి సాధ్యమన్నారు. పనుల విధానం సరళంగా, సక్రమంగా ఉండాలన్నారు. వ్యాపారులు మనసు కష్ట పెట్టుకోకుండా రేట్ల సవరణ ద్వారా తగ్గిన వస్తువుల ధరల వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని భట్టి కోరారు. జిఎస్‌టి రేట్ల సవరణతో వ్యవసాయ రంగానికి అవసరమైన పరికరాల ధరలు,ఆహార ఉత్పత్తుల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయని వివరించారు. సిమెంట్‌పైన 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారని, ఫలితంగా సిమెంటు ధరలు తగ్గుతాయని, సిమెంటు ధరలు తగ్గడంతో నిర్మాణ రంగం భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని, తగ్గుతున్న సిమెంటు ధరల వివరాలను దుకాణాల ముందు ప్రదర్శించాలని కోరారు. హైదరాబాద్ ఒక నగర రాజ్యాంగ మారుతుంది, రాష్ట్ర వ్యాప్తంగా అర్బనైజేషన్ పెరుగుతుందని, తద్వారా ఇన్‌ఫ్రా రంగం వ్యాపారాన్ని వ్యవస్థీకృతం చేసుకునేందుకు ఉపయోగపడుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు.

**వ్యాపారుల సమస్యల చర్చకు ప్రభుత్వ ద్వారాలు తెరిచే ఉన్నాయి....**

వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులున్నా, చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వ ద్వారాలు నిరంతరం తెరిచే ఉంటాయని భట్టి విక్రమార్క భరోసనిచ్చారు. సమస్యలను పరిష్కరించి రాష్ట్ర వ్యాప్తంగా సులభతరమైన వ్యాపారం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. జిఎస్‌టి రేట్ల రేషనలైజేషన్ తర్వాత, అంతకుముందు వివిధ వస్తువుల ధరలు ఏ విధంగా మార్పు జరిగిందో వ్యాపారులు తమ దుకాణాల ముందు సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా విధంగా ప్రదర్శించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్యపన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు. కాగా ముఖాముఖిలో బీమా, డెయిరీ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు చెందిన వ్యాపారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## గాజాలో ‘సామూహిక హత్యాకాండ’ (మొదటి పేజీ తరువాయి)

ఊచకోత కోసి చంపాడు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1948లో ఐక్యరాజ్యసమితి మొదటిసారి హిట్లర్ ఊచకోతలను ప్రామాణికంగా తీసుకుని ‘సామూహిక హత్యాకాండ’ అనే పదానికి ఒక నిర్వచనం ఇచ్చి కొన్ని నిబంధనలు రూపొందించి ఆమోదించింది. ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే చర్యలన్నింటినీ సామూహిక హత్యాకాండగా పరిగణించి అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా పరిగణిస్తారని ఆనాడు ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ఈ తీర్మానానికి అనుగుణంగా గాజాలో నివేదికను రూపొందించి ఇజ్రాయెల్ ఈ తీర్మాన నిబంధనలన్నింటినీ ఉల్లంఘించిందని, సామూహిక హత్యాకాండకు పాల్పడిందని విచారణ కమిషన్ నిర్ధారించింది. కానీ ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెలీ కట్జ్ ఈ నివేదికను తప్పుల తడకగా, అబద్ధాల నివేదికగా కొట్టిపారేశారు. ఈ విచారణా కమిషన్ లో ఉన్న ముగ్గురు నిపుణులు హమాస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, వారి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు.

ఇజ్రాయెల్ సైన్యం భారీ ఎత్తున భూతల, గగనతల దాడులు ప్రారంభించిన మంగళవారంనాడు ఐక్యరాజ్యసమితి విచారణా కమిషన్ ఈ నివేదిక విడుదల చేసింది. అంతర్జాతీయ చట్టాలకింద నిర్వచనం చెప్పడానికి వీలుగా గాజాలో ఇజ్రాయెల్ నాలుగు లేదా ఐదు సామూహిక దారుణ హత్యాకాండ ఘటనలకు పాల్పడిందని నివేదిక తెలియజేసింది. హమాస్ గ్రూపు సభ్యులను నిర్దాక్షిణ్యంగా వేటాడి చంపడం, ఈ బృందాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కావాల్సిన ఉద్దేశపూర్వక పరిస్థితులు సృష్టించడం, పాలస్తీనియన్లకు సామూహిక మానసిక,శారీక నష్టం కలిగించడం, జననాలు సంభవించకుండా అడ్డుకోవడం వంటి అనేక చర్యలకు పాల్పడి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని నివేదిక తెలియజేసింది.

**23 నుండి జనరల్ అసెంబ్లీ వార్షికోత్సవసభల్లో పాలస్తీనాకు గుర్తింపు**

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ వార్షికోత్సవ వేడుకల రెండో విడత ఉన్నత స్థాయి సమావేశాలు సెప్టెంబరు 23వ తేదీ నుండీ న్యూయార్క్‌లో ప్రారంభం అవుతాయి. ఈ సమావేశాలలో పాలస్తీనాకు అనేక దేశాలు గుర్తింపును ప్రసాదించనున్నాయి. ముఖ్యంగా యూరప్ దేశాలు పాలస్తీనాను ఒక సర్వ స్వంత్ర, సార్వభౌమాధికార దేశంగా గుర్తించనున్నాయి. దీంతో దాదాపు 100 కంటే ముందుగా ప్రారంభమైన పాలస్తీనా–యూదు జాతుల సమస్య భవితవ్యం కొత్త మలుపు తీసుకోబోతున్నది. వందేళ్ళకంటే ముందే యూదు జాతి ప్రజలు యూరప్ నుండి మధ్యప్రాచ్యానికి వెళ్ళి స్థిరపడటంతో పాలస్తీనా సమస్య ప్రారంభమైంది. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించడాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జోర్డాన్ నదికి, మెడిటేరియన్ సముద్ర జలాలకు మధ్య ఉన్న ప్రాంతానికి గనుక పాలస్తీనా దేశంగా గుర్తింపు ఇస్తే ఆ గుర్తింపు ఇజ్రాయెల్ దేశాన్ని ఇరకాటంలో పడేస్తుందని, తమ దేశానికి అత్యంత ప్రమాదకారిగా మారుతుందని వాదిస్తున్నారు. ఈనెల 12వ తేదీన జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం 142–10 మెజారిటీ ఓటుతో పాలస్తీనా–ఇజ్రాయెల్ రెండు ఇరుగు పొరుగు దేశాలుగా సహజీవనం చేసేందుకు (రెండు దేశాల పరిష్కారం) మద్దతు ఇస్తూ తీర్మానించింది. మొదటిసారి హమాస్‌ను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా విమర్శించింది. హమాస్‌లేని పాలస్తీనా ఆవిర్భవించాలని పేర్కొంది. అదేవిధంగా ఇజ్రాయెల్ చేస్తున్న సామూహిక హత్యాకాండను ఖండించింది. మరోవైపు తాజా పరిణామాల నేపథ్యంలో స్పెయిన్ కూడా ఇజ్రాయెల్ పట్ల తన వైఖరిని పునఃసమీక్షించింది. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న 700 మిలియన్ పౌండ్ల ఒప్పందాన్ని స్పెయిన్ రద్దుచేసుకుంటున్నట్లు ప్రకటించింది.

## యూరియా రాలే (మొదటి పేజీ తరువాయి)

ఉద్యానపంటల సాగు (హార్టికల్చర్) వేగంగా విస్తరిస్తోంది. సుమారు 12.40 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయని, వార్షిక ఉత్పత్తి 71.52 లక్షల మెట్రిక్ టన్నులు దాటిందని, అయినప్పటికీ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కేవలం 16 జిల్లాల్లో మాత్రమే కెవికెలు పనిచేస్తున్నాయి. మిగిలిన జిల్లాలకు ఈ సౌకర్యం లేకపోవడం పెద్ద లోటు అని మంత్రి తుమ్మల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలో ఒక కృషి విజ్ఞాన్ కేంద్రం ఉండేలా మరో 16 కొత్త కెవికెలనులు రాష్ట్రానికి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా తెలంగాణ వ్యవసాయ అభివృద్ధిలో పెద్ద అడుగు వేసి, రైతుల ఆదాయాలు పెంపొందించి, గ్రామీణ జీవనోపాధి మెరుగుపరచి, దేశవ్యాప్తంగా వ్యవసాయ వృద్ధికి విశేషంగా తోడ్పడగలదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రానికి అదనంగా 25వేల పోర్టబుల్ స్ప్రింక్లర్ల సిస్టమ్స్ కేటాయించాలని కోరారు.

2025–26 సంవత్సరంలో 16,510 పోర్టబుల్ స్ప్రింక్లర్ యూనిట్లు కేటాయించగా, ఇప్పటివరకు 11 వేల యూనిట్లకు పరిపాలనా అనుమతులు జారీ చేసి, 9,346 యూనిట్లు ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరానికి అనుగుణంగా ఇప్పటికే పంపిణీ చేసినట్లు తెలిపారు.

**ఈ నెలలో 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటును భర్తీ చేయండి :**

ఖరీఫ్ సీజన్‌కు గాను రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన యూరియాలో ఇప్పటీవరకు 2లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా కాలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌కు వివరించారు. ఈ లోట్‌ను ఈ నెలలో భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా రబీ సీజన్‌లో రైతాంగానికి ఇబ్బంది లేకుండా ముందుగానే రైతులకు ప్రతి నెలా రెండు లక్షల టన్నుల యూరియా సరఫరా చెయ్యాలని విన్నవించారు.జియోపొలిటికల్ కారణాల వల్లనే సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయని, వీలైనంత త్వరగా తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## కుంభవృష్టి (మొదటి పేజీ తరువాయి)

మరణించారు. పొరుగున ఉన్న ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ జిల్లాలోనూ ఐదుగురు వ్యక్తులు కొట్టుకుపోయారు. మేఘా విస్ఫోటన, భారీ భారీ వర్షాలకు వరదు పోటెత్తిన వరదల్లో చిక్కుకున్నారు. కొండ వాలుల గుండా ప్రవహించే కుండపోత నీటిలో ఇళ్లు పూర్తిగా తిన్నాయి. కార్లు, వాణిజ్య సముదాయాలు కొట్టుకుపోయాయి. ఉత్తరాఖండ్‌లో ఒక వంతెన కూడా కొట్టుకుపోయింది. ఈ రెండు రాష్ట్రాల్లో మంచుతో నిండిన నదులు, వాగులు చాలా వరకు ఉప్పొంగిపోయాయి. ఉత్తరాఖండ్‌లో, గంగా, యమున మరోసారి ప్రమాదస్థాయికి దగ్గరగా ప్రవహిస్తున్నాయి. అయితే తాంసా నది నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరింది. తాంసా నది ఉదయం వేగంగా ఉప్పొంగి, దాని ఒడ్డున ఉన్న ప్రసిద్ధ తపకేశ్వర్ ఆలయాన్ని ముంచెత్తింది. దాని ప్రవేశ ద్వారం వద్ద ఉన్న భారీ హనుమాన్ విగ్రహాన్ని భుజాల వరకు ముంచెత్తింది. ఆలయ పూజారి బిపిన్ జోషి మాట్లాడుతూ, గత 25 నుండి 30 సంవత్సరాలలో నదిలో నీరు ఇంత ఎక్కువగా పెరగడం తాను చూడలేదని అన్నారు. అదృష్టవశాత్తూ, వరదలు సంభవించినప్పుడు తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో భక్తులు తక్కువగా ఉన్నారని, ఆలయంలో ఉన్న పూజారులు సురక్షితంగా ఉన్నారని ఆయన అన్నారు. సాంగ్ నది ఉప్పొంగి ప్రవహిస్తూ ఉత్తరాఖండ్‌లోని సమీప ప్రాంతాలను ముంచెత్తింది. డెహ్రాడూన్‌లోని జిల్లా విపత్తు నిర్వహణ కార్యాలయం ప్రకారం, ఉత్తరాఖండ్‌లోని సహస్త్రధార, మాల్దేవ్తా, సంట్లదేవి, దలాన్‌వాలా ఈ విపత్తులో అత్యంత దెబ్బతిన్నాయి. సహస్త్రధారలో 192 మి.మీ వర్షం కురిసింది. ఆ తరువాత కొన్ని గంటల్లోనే మాల్దేవ్తాలో 141.5 మి.మీ, హాతి బర్కల, జాలీ గ్రాంట్‌లో 92.5 మి.మీ చొప్పున, కల్సిలో 83.5 మి.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ మాట్లాడుతూ, ప్రభావిత ప్రాంతాల్లో బృందాలు సహాయ చర్యలలో నిమగ్నమై ఉన్నాయని, ఇప్పటికే 300 నుండి 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. డెహ్రాడూన్‌లోని పౌంధా ప్రాంతంలోని దేవ్‌భూమి ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో నీటి ఎద్దడిలో చిక్కుకున్న దాదాపు 200 మంది పిల్లలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం రక్షించిందని సమాచార డైరెక్టర్ జనరల్ బన్నిధర్ తివారీ తెలిపారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి డెహ్రాడూన్ జిల్లాలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు ఆయనతో పాటు వెళ్లారు.

వర్షాలతో దెబ్బతిన్న మాల్దేవ్తా ప్రాంతంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా అన్ని నదులు పొంగిపొర్లుతున్నాయన్నారు. 25 నుండి 30 చోట్ల రోడ్లు తెగిపోయాయని, ఇళ్ళు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతిన్నాయని చెప్పారు. భారీ వర్షాల తర్వాత ఉత్తరాఖండ్‌లో పరిస్థితి గురించి ధామి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరించారని ముఖ్యమంత్రి కార్యాలయం హిందీలో సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపింది. వారు రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని, ఈ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాఖండ్ ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపినట్లు సిఎంఒ వెల్లడించింది.

**హిమాచల్‌లోనూ దారుణ పరిస్థితి**

పొరుగున ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో కూడా పరిస్థితి దారుణంగా ఉంది. సోమవారం సాయంత్రం నుండి 12 గంటల్లో రాష్ట్ర రాజధాని సిమ్లాలో 141 మి.మీ వర్షం కురిసింది, ఆ తర్వాత నగ్రోతా సూర్యన్ 135.2, భట్టియాట్ 80 మి.మీ, సుందర్‌నగర్ 60.5 మి.మీ, బ్రాహ్మణి 54.4 మి.మీ, గులేర్ 54.2 మి.మీ, మండి 52.6 మి.మీ, మరియు కాంగ్రా 50.5 మి.మీ. వర్షం పడింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రంలో 46 మేఘావిస్ఫోటనాలు, 97 ఆకస్మిక, మరియు 140 కొండచరియలు విరిగిపడ్డాయి. మూడు జాతీయ రహదారుల విస్తరణతో సహా 650 రోడ్లు మూసివేయబడ్డాయి. 1,250 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 160 నీటి సరఫరా పథకాలు ఇప్పటికే దెబ్బతిన్నాయి. తాజా వర్షాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి. కుండపోత వర్షం కారణంగా ఏర్పడిన ఆకస్మిక వరదలు మండి జిల్లాలోని ధరంపూర్ ప్రాంతంలోని ప్రధాన బస్ స్టాండ్‌ను ముంచెత్తాయి. అనేక వాహనాలు కొట్టుకుపోయాయి. జిల్లాలోని బ్రాగ్తా గ్రామంలో కొండచరియలు విరిగిపడి ఇల్లు కూలి ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి మరణించారు. వరదలు దుకాణాల్లోకి చొచ్చుకు రావడంతో దుకాణదారులు, నివాసితులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. దీనివల్ల వస్తువులు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఈ వర్షాల కారణంగా ధరంపూర్‌లోని సోన్, భరండ్ వాగులు వరదలకు గురయ్యాయని అధికారులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖేష్ అగ్నిహోత్రి ఫేస్‌బుక్‌లో ధరంపూర్ ప్రాంతంలో, చుట్టుపక్కల రెండు డజన్ల రాష్ట్ర రవాణా బస్సులు, దుకాణాలు, పంప్ హౌస్, ఒక వర్క్‌షాప్ దెబ్బతిన్నాయని పోస్టు చేశారు. సిమ్లా నగరం నడిబొడ్డున ఉన్న హిమ్‌ల్యాండ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో అనేక వాహనాలు నేలమట్టమయ్యాయి.

**మహారాష్ట్రనూ ముంచెత్తిన భారీ వర్షాలు**

మరోవైపు గత 24 గంటల్లో మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముగ్గురు మరణించారు. 120 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంగళవారం తెలిపింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), ఇతర సహాయక బృందాలు ప్రభావిత జిల్లాల్లో సహాయ చర్యలలో పాల్గొన్నాయని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మరాఠ్వాడలోగల ఎనిమిది జిల్లాల్లోని ఐదు జిల్లాల్లో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. బీడ్‌లో అత్యధికంగా 143.7 మి.మీ వర్షం కురిసింది. ఆ తర్వాత మంగళవారం ఉదయం నాటికి గడిచిన 24 గంటల్లో నాందేడ్‌లో 131.6 మి.మీ, జల్నాలో 121.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నదులు ఉప్పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు వరదల్లో మునిగిపోయాయి, సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. బీడ్, అహల్యానగర్ అత్యంత ప్రభావితమయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ప్రాంతాల్లో రక్షణ, సహాయ చర్యలు నిర్వహిస్తూ 120 మందికి పైగా ప్రజలను సురక్షితంగా తరలించారు. గత 24 గంటల్లో బీడ్ జిల్లాలో వర్ష సంబంధిత ఘటనలలో ఇద్దరు మరణించగా, నాగ్‌పూర్‌లో ఒకరు మరణించినట్లు సమాచారం. ఛత్రపతి సంభాజీనగర్, జల్నా, బీడ్, నాందేడ్‌లోని కనీసం 41 రెవెన్యూ సర్కిళ్లలో సోమవారం 65 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని ఒక అధికారి తెలిపారు. మరాఠ్వాడలోని 11 ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల నుండి 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అధికారులు ఆనకట్టలు, నదులు, వరద ప్రభావిత గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. రుతుపవనాలు చురుగ్గా ఉన్నందున మరాఠ్వాడ, విదర్భలోని కొన్ని ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో మరో రెండు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. గడిచిన 24గంటల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు.

### విముక్తి కోసమే పుట్టిందే
## ''తెలంగాణ సాయుధ పోరాటం''

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ : భూమి కోసం, భుక్తి కోసం, దాస్య శుంకలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతిలతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. పోలంపల్లి పులిబిడ్డ పోరు తల్లి ముద్దుబిడ్డ కామ్రేడ్ అనభేరి ప్రభాకర్ రావు సొంత గ్రామం పోలంపల్లిలో సిపిఐ పక్షాన భారీ ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం గర్వకారణంగా ఉందన్నారు. వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిసత్వానికి వ్యతిరేకంగా అణచివేతకు వ్యతిరేకంగా దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాటాలు చేసిని వీరుడు అనభేరి అని కొనియాడారు. పాఠ్యపుస్తకాల్లో వారి చరిత్రను ముద్రించాలని , హైదరాబాదు ట్యాంక్ బండ్‌పై అనభేరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, మండల సహాయ కార్యదర్శి సూరం మల్లేశం, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టల శ్రీనివాస్, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన అవిశ్రాంత పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

జాతీయస్థాయికి ఎదిగిన మహానాయకుడు కామ్రేడ్ సురవరం

పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి




ప్రజాపక్షం/కోదాడ : పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. వీరి పోరాటాల ఫలితంగానే అనేక సంస్కరణలు, అనేక పథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడి నుండి జాతీయ స్థాయికి ఎదిగిన మహానాయకుడని కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధనలో ఆయన పాత్ర సముచితమని పేర్కొన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ట, నష్టాలను ఓర్చి ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా పేదల పక్షాన నిలబడేది ఎర్రజెండా వారసులేనని నిరూపించిన నేత అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల అభివృద్ధికి వారి సూచనలు, సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. నల్లగొండ జిల్లా సమస్యల తోపాటు దేశ సమస్యలపై పార్లమెంట్ సమావేశాలలో తన వాణిని గట్టిగా వినిపించి చరిత్ర ఆయనది అన్నారు. తన జీవిత ఆసాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అనుసరించి ముందుకు సాగిన నికార్సైన నేతని స్పష్టం చేశారు. రూ.18వందల కోట్లతో ఆయన కలలు గన్న డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగానికి సాగునీరు అందిస్తామని బరోసా ఇచ్చారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఎంతో ఆదర్శప్రాయుడని అన్నారు. ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్‌లు మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నిబద్ధత కలిగిన నేత అని కొనియాడారు. రాష్ట్ర సమస్యల తోపాటు దేశ సమస్యలపై పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించిన నేత అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు మనమందరం ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి : పల్లా**

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మునుగోడు మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి సంఘం నాయకుడిగా, యువజన నాయకుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, అనుబంధ సంఘాల బాధ్యుడిగా నిబద్ధతతో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన మహా నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికై జైలు జీవితాన్ని కూడా గడిపారని, ఉమ్మడి నల్లగొండ జిల్లాతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉందని చెప్పారు. రెండు పర్యాయాలు నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసి ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించారన్నారు. జిల్లాలో సాగునీరు, ఫ్లోరోసిస్ నివారణకు డిండి నుండి నల్లగొండ వరకు ఆనాడు పాదయాత్ర చేసి నాటి కేంద్ర పాలకులకు కనువిప్పు కలిగించారని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికి ఈ ప్రాంత ప్రజలపై ఉన్న ప్రేమతో నల్లగొండలో నిర్వహించిన పార్టీ రజితోత్సవ సభకు హాజరై ప్రజలనుద్దేశించి ప్రసంగించారన్నారు. వామపక్ష పార్టీల కలయికను ఆయన ఆకాంక్షించారని, ఆయన స్ఫూర్తిని కొనసాగించడమే మనమిచ్చే నివాళు అని పేర్కొన్నారు. దీనికి ముందు సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, నాయకులు మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, హన్మంతరావు, ఉస్తెల సృజన, ధనుంజయ నాయుడు, మండవ వెంకటేశ్వర్లు, సాయబెల్లి, ఎల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రాయోజిత పథకాలలో
## రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ కల్పించాలి

కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి .




ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ కల్పించడంతో పాటు రైతుల ఆదాయం పెరిగేలా పాలసీలలో మార్పులు, రూపకల్పన జరగాల్సిన అవసరముందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రబీ అభియాన్ – 2025 వ్యవసాయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సదస్సుకు పలు రాష్ట్రాల నుండి వ్యవసాయ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సంవత్సరం కాలంలో తెలంగాణ సాధించిన విజయాలను సదస్సుకు వివరించారు. తెలంగాణ రాష్ట్రం సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిందని, దేశానికి అవసరమయ్యే విత్తనాల్లో దాదాపు 60 శాతం తెలంగాణ నుండే సరఫరా కావడంతో పాటు 20కుపైగా దేశాలకు విత్తనాల ఎగుమతి జరుగుతోందని తెలిపారు. తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వడంతో పాటు ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలని, విత్తన చట్టాన్ని పున:సమీక్షించి, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలని కోరారు. అలాగే ఆయిల్ పామ్ సాగులో కూడా రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం 1.5 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతుండగా, దీన్ని త్వరలో 8 లక్షల హెక్టార్లకు విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్, వేరుశెనగ, మిరప, పసుపు, సిరిధాన్యాలు వంటి పంటలు విస్తృతంగా పండుతున్నాయని, అందులో తాండూరు కంది, చాపట మిరప జిఐ గుర్తింపు పొందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, ఉచిత 24 గంటల విద్యుత్ సరఫరా, పంట రుణ మాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీలు వంటి పథకాలతో రైతులకు భద్రత, నమ్మకం కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 2,601 రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ దాదాపు 13 లక్షల మంది రైతులు, అందులో 3 లక్షల మహిళా రైతులు నేరుగా శాస్త్రవేత్తలు, అధికారులతో సంప్రదింపులు జరిపేలా అవకాశాలు కల్పించామని అన్నారు.రైతు ఆదాయం పెరగేలా పాలసీలలో మార్పులు తీసుకురావాలని,ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ మాదిరిగానే రైతుల ఆదాయం పెరుగుతోందా లేదా అన్న దానిపై తరచుగా సర్వేలు చేయాలని చెప్పారు.ప్రస్తుతమున్న సబ్సిడీలతో నైట్రోజన్ ఎరువుల వాడకం పెరిగి భూమిలోని పోషకాల అసమతుల్యత పెరుగుతోందని, కాబట్టి ఎరువుల ధరలను సవ్యంగా ఉంచి సమతుల్య పోషకాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు.కేంద్రం సమయానుకూల సహకారం అందించడంతో పాటు జాతీయ స్థాయి సంస్కరణలతో భారత వ్యవసాయాన్ని మరింత సురక్షితంగా మార్చి అందరికీ ఆహార, పోషక భద్రతను అందించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి
## ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలి

వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్: వాణిజ్య పన్నులకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం పెంచుకునేందుకు లోతుగా అధ్యయనం చేసి, 15 రోజుల్లో నివేదికను తెప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును భట్టి విక్రమార్క ఆదేశించారు. వాణిజ్య పన్నుశాఖలో ఆదాయం పెంచేందుకు సర్కిళ్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ సమావేశం సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వివిధ రకాల వస్తువుల వారీగా సమీక్ష చేయాలని ఆదేశించారు. స్టాంప్స్, రెవెన్యూ శాఖలో ఆదాయం పెంపునకు గత సంవత్సరం వేసిన కమిటీ, ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టు పరిస్థితిపై డిప్యూటీ సీఎం సమీక్షించారు. స్టాంప్స్,రిజిస్ట్రేషన్ శాఖతో ముడిపడిన హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసి, హౌసింగ్ బోర్డు వంటి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఆదాయం పెంచేందుకు అన్ని శాఖలను సమన్వయం చేసుకునే అంశాన్ని ప్రభుత్వప్రధాన కార్యదర్శి సీరియస్‌గా తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. రవాణా శాఖలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యేక పాలసీ రూపొందిస్తామని మంత్రులు తెలిపారు. ఆదాయ వనరుల సమీక్ష సమావేశానికి వచ్చే ముందు అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆయా శాఖలో ఆదాయం పెంపుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఒక స్పష్టమైన నివేదికతో సమావేశానికి హాజరుకావాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎ రిజ్వీ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రవాణ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణా
## దుర్బల వర్గాలపై తీవ్ర ప్రభావం




- పేదలను లక్ష్యంగా చేసుకొని వెట్టి చాకిరీ చేయిస్తున్న ముఠాలు
- వీటిపట్ల అవగాహన కలిగించేలా మీడియా కథనాలు రాయాలి
- 'హ్యూమన్ ట్రాఫికింగ్ – బాండెడ్ లేబర్'పై వర్క్‌షాప్‌లో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారతదేశంలో మానవ అక్రమ రవాణ సమాజంలోని అత్యంత దుర్బల వర్గాల వారి పట్ల తీవ్ర ప్రభావం చూపుతోందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదరికంలో జీవిస్తున్న, బలమైన కుటుంబ నిర్మాణం లేని, తక్కువ విద్య, దిగువ సామాజిక వర్గాలకు చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు మానవ అక్రమ రవాణా చేసి, వారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని తెలిపారు. వెట్టి చాకిరి పట్ల అవగాహన కల్పించే విధంగా మీడియా ప్రతినిధులు కథనాలు రాయాలని సూచించారు. 'హ్యూమన్ ట్రాఫికింగ్ బాండెడ్ లేబర్' అంశాలపై వర్క్‌షాప్ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, ఇంటర్‌నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) సంయుక్తంగా హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బాధితుల్లో సగానికి పైగా బలవంతపు లేదా బాండెడ్ లేబర్ ఉన్నారన్నారు. వీరంతా ఇటుక బట్టీలు, గృహ నిర్మాణం, ప్రాజెక్టు పనులు, బహుళ అంతస్తులలో పనులు, వస్త్ర కర్మాగారాలు, వ్యవసాయం లేదా రాతి గనులలో రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పాటు పనిచేస్తున్నారని, ఇలాంటి వారిని మీడియా ప్రతినిధులు గుర్తించి, తమ వార్తల ద్వారా అవగాహన కలిగించాలని సూచించారు. ఇలాంటి వారు దళారుల చేతిలో మోసానికి గురైనవారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులను కల్పిస్తామని వారికి దళారులు ముందుగానే అత్యధిక డబ్బుల ఆశ చూపి, వడ్డీ ద్వారా అప్పులను సమకూర్చి, వారి జీవితాలను, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని ఆయన చెప్పారు. వీరిని సంబంధిత యజమానులు మనుషులుగా కాకుండా కేవలం వస్తువులుగా చూస్తూ, ఈసడించుకుని తక్కువ స్థాయి వ్యక్తులుగా ముద్రవేసి, వారి జీవితాలను చెరిపేస్తున్నారన్నారు. దశాబ్ద కాలంగా కొన్ని కుటుంబాలు తరతరాలుగా బంధించబడిన శ్రమను అనుభవిస్తాయని, అలాంటి వారిని విముక్తి కలిగేలా చూడాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నదన్నారు. వెట్టి చేస్తున్న కార్మికులు మరణించిన ప్పటికీ వారి పిల్లలు, తోబుట్టువులు, తల్లిదండ్రులకు వెట్టిని బదిలీ చేసి ఇంకా వేధిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయని శ్రీనివాస రెడ్డి తెలిపారు. గృహపని, నిర్మాణం వంటి తక్కువ నైపుణ్యం కలిగిన రంగాలలో పని కోరుకునే భారతీయ వలసదారులు, వివిధ దేశాలకు వలసల పేరుతో వెళ్లిన కార్మికులు అక్రమ రవాణాలో చిక్కుకుంటున్నారన్నారు. కాగా ఇంటర్‌నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) స్వచ్ఛంద సంస్థ బృందం మానవ అక్రమ రవాణా నేరాలకు సంబంధించిన దర్యాప్తు ఆధారాలను సేకరించి, ప్రాణాలతో బయటపడిన వారిని విడిపించి, అక్రమ రవాణాదారులను అరెస్టు చేయడంలో పోలీసులకు సహకారం అందించి బాధితులకు తగిన న్యాయం చేసే విధంగా కృషి చేస్తోందని ఆ బృందం సభ్యులు శిక్షణలో వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, ఐజెఎం మీడియా కమ్యూనికేషన్స్ అధిపతి ప్రియా అబ్రహాంతో పాటు పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. ఇటీవల వెట్టి చాకిరి నుంచి విముక్తి పొందిన వారు తాము పడిన బాధలను, స్వచ్ఛంద సంస్థ, ప్రభుత్వం నుంచి అందిన సహకారాన్ని వారు వివరించారు.

## రాహుల్‌కు ముఖ్యమంత్రి చేయూత



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రమాద ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్‌కు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించినందుకుగాను ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్, సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాహుల్ తన కుటుంబంతో కలిసి సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటిరాహుల్ నవంబర్ 2, 2024న రైలులో రాజస్థాన్ వెళ్తుండగా కొందరు దుండగులు ఆయనను రైలులో నుంచి తోసేశారు. ఈ ఘటనలో రాహుల్ తన రెండు కాళ్లను కోల్పోయారు. దీంతో రాహుల్‌కు సిఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లను అమర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాయం చేసింది. తాను మళ్లీ నడిచే విధంగా సహకారం అందించిన ముఖ్యమంత్రికి రాహుల్ తన కుటుంబంతో కలిసి ధన్యవాదాలు తెలిపారు.

**అంధ విద్యార్థులకు 'సంగీత వాయిద్య పరికరాల' పంపిణీ**

అంధ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో 'సంగీత వాయిద్య పరికరాలను'మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,ఎంపి అనిల్ కుమార్‌యాదవ్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి , సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగీతంలో శిక్షణ పొందిన అంధ విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట పాట పాడి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన పాటల సిడిని సిఎం ఆవిష్కరించారు.

## ట్రాన్స్‌జెండర్ల భవిష్యత్తుకు ప్రభుత్వం అండ : మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో తల ఎత్తుకుని జీవించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన అవకాశాలను కల్పిస్తుందని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల, ట్రాన్స్‌జెండర్ల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ట్రాన్స్‌జెండర్ల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే సిఎం సంకల్పమన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో 20 మంది ట్రాన్స్‌జెండర్లకు సెక్యూరిటీ గార్డులుగా మంత్రి లక్ష్మణ్ కుమార్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డు నియామకాల కోసం దాదాపు 300ల నుంచి 400ల మంది దరఖాస్తు చేసుకోగా, ఇందులో నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేశామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనల ఫలితంగా ఇప్పటికే ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద భిక్షాటన చేసిన వారికి ట్రాఫిక్ నియంత్రణలో అవకాశాలు కల్పించగా, ఇప్పుడు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డులుగా నియమించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ట్రాన్స్‌జెండర్లు కష్టపడి పనిచేసి ఎవరికీ తాము ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలి సూచించారు. మహిళా, శిశు సంక్షేమ, ఎస్‌సి డెవలప్‌మెంట్ కార్యదర్శి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ ఒక చిన్న అడుగుతోనే గొప్ప మార్పునకు సాధ్యమని, నిజాయితీగా పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ సంస్థలు ట్రాన్స్‌జెండర్ల సేవలకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిజేబుల్ వెల్ఫేర్ డైరెక్టర్ శైలజ, ఎస్ఐఎస్ ఇండియా లిమిటెడ్ నిర్వాహకులు గిరిజష్ పాండే, ట్రాన్స్‌జెండర్లకు యూనిఫాములను అందజేసిన దీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ ఫౌండర్ ముకుంద మాల, మౌంట్ ఫాంట్ సోషల్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ వర్గీస్ తెక్కనాథ్, ట్రాన్స్ వెల్ఫేర్ ఫౌండర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ ముసలమ్మ జాతర**
గ్రా॥ గుంజేడు, మం॥ కొత్తగూడ, జి॥ మహబూబాబాద్.
లేఖ నెం. SMJ/ప్రకటన/2025 నోటిఫికేషన్ తేది: 15.09.2025
మెమో నెం. ఎఫ్5/8896/2025, తేది:09-09-2025, శ్రీయుత కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్, తెలంగాణ వారి ప్రకారము ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ ముసలమ్మ జాతర, గుంజేడు, మండలం కొత్తగూడ, జిల్లా మహబూబాబాద్‌కు ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టము 30/87 (సవరణ చట్టం 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016 ననుసరించి) సెక్షన్ 15, ఉపసెక్షన్-1 కి లోబడి రెనోవేషన్ కమిటీ నియమింపబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకము కొరకు వారి దరఖాస్తులను సెక్షన్-17 నందలి ఉపసెక్షన్ 3ను అనుసరించి నిర్ణీత ప్రోఫార్మా (ఫారం-II)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల లోపు శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ గారికి తమ దరఖాస్తులను పంపవచ్చును.
సం/- శైలజ రామయ్యర్, కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్.
DIPR R.O. No. : 8103-PP/CL/ADVT/1/2025-26, Date: 16-09-2025

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండర్ ప్రకటన
**NIT No. 31, పని పేరు:** 01 పని కొరకు జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో సిసి రోడ్ వేయడం, **అంచనా విలువ / ఇసివి:** రూ.13.25 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 16.09.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 19.09.2025న మ.2.45గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI,(ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 8157-PP/CL/ADVT/1/2025-26, Date: 16-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎంను కలిసిన జైలు డ్యూటీమీట్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏడవ ఆల్ ఇండియా జైలు డ్యూటీమీట్2025లో గెలుపొందిన ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా సిఎం ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా డ్యూటీమీట్‌లో వివిధ పోటీలలో పతకాలు సాధించిన వారిని సిఎం అభినందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో జరిగిన పోటీలలో 133 పతకాల్లో తెలంగాణ జైళ్ల శాఖ సిబ్బంది 28 ( 21 బంగారు, 4 రజతం, 3 కాంస్యం) పతకాలు కైవసం చేసుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, జైళ్ల విభాగం డిజి సౌమ్య మిశ్రా, ఐజీ మురళి బాబు, వరంగల్ రేంజ్ డిఐజి సంపత్, ఎస్‌పిలు శివ కుమార్ గౌడ్ కళాసాగర్, డ్యూటీ మీట్ పోటీ విజేతలు ఉన్నారు.

## ఐఏఎస్ అధికారుల బదిలీ

### ప్రభుత్వ సలహాదారుగా ఎస్‌విఎన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా ఎస్‌విఎన్ రెడ్డి నియామకం అయ్యారు. హైదరాబాద్ మెట్రోరైల్ ఎండిగా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా శృతి ఓజాను తిరిగి నియమించారు. అలాగే సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ గా కృష్ణ ఆదిత్య.. హెచ్‌ఎండిఏ సెక్రటరీగా కోటం శ్రీవాత్సను బదిలీ చేశారు.

## హైదరాబాద్‌లో 50 మంది సిఐల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో 50 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మంగళవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.బదిలీ అయిన వారిలో ఎక్కువగా డిటెక్టివ్ (డిఐ), ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే కొత్త పోస్టులో రిపోర్టు చేయాలని సివి ఆనంద్ ఆదేశించారు.

## పేలుళ్ల అనుమతిపై స్పష్టత ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొండల్ని, గుట్టల్ని, రాళ్లను తొలగింపునకు జరిపే పేలుళ్ల తీరుపై స్పష్టత ఇవ్వాలని పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. అనుమతులు సిటీ పోలీస్ కమిషనర్ ఇస్తారని చెబితే చాలదని, పేలుళ్లు నిర్వహించడానికి ఎన్వోసీని ఏ ప్రాతిపదికన ఇస్తారో చెప్పాలంది. ఈ మేరకు సిటీ పోలీసు కమిషనర్‌కు మంగళవారం ఆదేశాలిచ్చింది. ఇతర శాఖల నుంచి వివరాలు తెప్పించి పరిశీలన చేసేదీ లేనిదీ కూడా వివరించాలంది. పేలుళ్లకు అనుసరించే ప్రాతిపదిక ఏమిటో చెప్పాలంది. విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ న్యాయవిహార్ వెనుక భాగంలో రాత్రిళ్లు పేలుళ్లు చేయడంపై సుమోటో పిల్‌ను (జడ్జి రాసిన లేఖ ఆధారంగా) చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ బెంచ్ మంగళవారం విచారించింది. పోలీస్ కమిషనర్ ప్రతివాదిగా లేరని ప్రభుత్వం చెప్పడంతో ప్రతివాదిగా చేర్చాలని ఆదేశించింది.

## రిటైర్డు ఐఎఎస్ జోషికి ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఇరిగేషన్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్‌కె జోషికి హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ ఘోష్ కమిషన్‌లోని సిఫారసుల ఆధారంగా తనపై చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ జోషి వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ బెంచ్ మంగళవారం విచారించింది. కమిషన్ రిపోర్ట్ ఆన్‌లైన్‌లో ఉందని పిటిషనర్ లాయర్ చెప్పారు. ట్విట్టర్‌లోనూ ఉందన్నారు. సాక్షిగా కమిషన్ పిలిచి ఆభియోగాలు మోపిందని, ఇలా చేసే ముందు సెక్షన్ 8(బి), 8(సి) కింద నోటీసు ఇవ్వలేదని చెప్పారు. దీనిపై ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ జస్టిస్ ఘోష్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎవరిపైనా చర్యలు తీసుకోదని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ఆదేశించిందని చెప్పారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రాన్ని ఆదేశించిన ధర్మాసనం విచారణను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది.

## వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎమ్మెల్సీగా పి.వెంకట్రామిరెడ్డి ఎంపిక తీరును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని నెంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ బెంచ్ తోసిపుచ్చింది. నెంబరు కేటాయించాలని ఆదేశించింది. ఐఏఎస్ పదవికి రాజీనామాను కేంద్రం ఆమోదించకుండానే ఎమ్మెల్సీగా నామినేషన్ వేయడం చెల్లదు. ఎమ్మెల్సీ పదవిపై అనర్హులు. ఈ మేరకు ఈసీకి, మండలి చైర్మన్‌కు ఆదేశాలివ్వాలి.. అని కరీంనగర్‌కు చెంది జె.శంకర్ ఇతరులు పిటిషన్లు వేశారు. ఎమ్మెల్సీ రాజీనామాను సీఎం ఒత్తిడితో సీఎస్ ఆమోదించారు. నిజానికి కేంద్రం ఆమోదం చెప్పాలి. నోటీసు ఇచ్చాక గడువు తీసుకున్నాక కేంద్రం ఆమోదించాలి. ఇవేమీ చేయకుండా రాష్ట్రం ఆమోదించడం చెల్లదు.. అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పిటిషనర్‌కు రూ.20 వేల జరిమానా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బలరాం కొనసాగే అర్హత లేదని పిటిషన్ వేసిన పిటిషనర్‌కు హైకోర్టు రూ.20 వేల జరిమానా విధించింది. పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్, ఇన్‌ఛార్జి సీఎండీ బలరాం ఉన్నారు. డైరెక్టర్‌గా కొనసాగే అర్హత లేదంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సంపత్‌కుమార్ పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. సింగరేణి కంపెనీలో పనిచేసి తొలగింపునకు గురయ్యారని, 18 కేసులు ఉన్నాయని, ఇదే తరహా కేసులో హైకోర్టు గతంలో రూ.50 వేలు జరిమానా విధించిందని గుర్తు చేశారు. రూ.20 వేలు జరిమానా విధించి పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పారు.

## స్థానికతపై స్పష్టత ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏపీలోని కోరుకొండ సైనిక్ పాఠశాలలో చదివిన తెలంగాణకు చెందిన విద్యార్థికి మెడికల్ సీట్ల కేటాయింపు విషయంలో స్థానికతపై వివరణ ఇవ్వాలని కాళోజీ యూనివర్సిటీకి హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ 8వ తరగతి వరకు తెలంగాణలో చదివాడు. తెలంగాణ కోటాలో సైనిక్ స్కూల్‌లో 9,10, ఇంటర్ చదివాడు. ఇప్పుడు మెడికల్ సీటుకు స్థానికుడు కాదని అంటున్నారు.. అనిపిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై బుధవారం వివరణ ఇవ్వాలని వర్సిటీని సీజే బెంచ్ ఆదేశించింది.

## మెడికల్ సీటు ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఆర్‌ఎస్ అధికారిగా కోల్‌కతాకు బదిలీ పై వెళ్లడంతో ఇక్కడ మెడికల్ అడ్మిషన్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఎం.సిద్ధార్థ్ మను అనే విద్యార్థి వేసిన పిటిషన్‌లో సీజే బెంచ్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. పిటిషనర్ సమర్పించిన అన్ని పత్రాలను పరిశీలించి స్థానిక కోటా కింద అడ్మిషన్‌పై నిబంధనల ప్రకారం ఇవ్వాలంది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీని ఆదేశాలు జారీ చేసింది.

## ఓజోన్ పొరతోనే జీవ మనుగడ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూమికి సూర్యునికి మధ్య ఉన్న ఓజోన్ పొరను కాపాడుకుంటెనే జీవ మనుగడ కొనసాగుతుందని టిజిపిసిబి సభ్య కార్యదర్శి రవి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓజోన్ పొర రక్షణపై అవగాహన కల్పించారు. ఈ పొరను రక్షించేందుకు చెట్లు నాటడం, పర్యావరణానుకూల ఉత్పత్తులను వినియోగించడం, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ తగ్గించడం, స్థిరమైన జీవన శైలిని అలవర్చుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు ఓజోన్ క్షీణత పర్యావరణంపై దుష్ప్రభావాలు అనే అంశంపై పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు.

# అటవీ అధికారులపై దాడులు చేస్తే పిడి యాక్ట్

### ఫారెస్టు సిబ్బందికి అండగా ఉంటా
### అటవీ శాఖ అసోసియేషన్ సమావేశంలో మంత్రి సురేఖ



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** అటవీ అధికారులపై దాడులు చేస్తే పిడి యాక్టులు పెడతామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర అటవీ శాఖ అధికారుల అసోసియేషన్ సంఘాలతో మంత్రి సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, తదితరులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారుల సంఘాల నాయకుల తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... తాను ఫారెస్టు సిబ్బందికి ఒక అక్కగా అండగా ఉంటానని చెప్పారు. ఫారెస్టు ఉద్యోగుల సమస్యలు వినేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చిన్న చిన్న విషయాలు శాఖపరంగా మనమే పరిష్కరించుకుందామని గుర్తు చేశారు. కీలక అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామని చెప్పారు. మనమంతా ఒక ఫ్యామిలీ అని మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. ఎందుకంటే, అటవీ శాఖకు, ఫారెస్టు ఉద్యోగులే ఫ్రంట్ రన్నర్స్ అని తెలిపారు. అలాంటి ఉద్యోగుల కోసం పని చేయడం తన బాధ్యత అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పోలీసులకు ఎటువంటి జీత భత్యాలు ఇస్తున్నారో... అటవీ అధికారులకు అంతే స్థాయిలో ఇచ్చేందుకు తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఫారెస్టు అసోసియేషన్ నాయకులు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులకు ఎటువంటి జీతభత్యాలున్నాయో ఫారెస్టు అధికారులకు కూడా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో అటవీ అధికారులకు సంబంధించిన మూడు సంఘాలు పాల్గొన్నాయి. ఎసిఎఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ అసోసియేషన్ నరేందర్, షౌకత్ అలీ, విజయ్ కుమార్, సవిత, రవి కిరణ్, తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. నాగేందర్, ఉపాధ్యక్షులు బి. సాంబు, రాష్ట్ర కార్యదర్శి బి. ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ పి. సుకన్య, ట్రెజరర్, కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.



### బిల్లులు చెల్లించిన తరువాతనే..
## స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
### మానవహక్కుల కమిషన్ ఎదుట ఫిర్యాదు చేసిన..
### తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జెఏసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటి(జెఏసి) రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నేతృత్వంలో సర్పంచ్‌లు మానవహక్కుల కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. మానవ హక్కుల కమిషన్‌లో మంగళవారం జరిగిన విచారణలో పంచాయతీ రాజ్ కమిషనర్‌ను బిల్లులు చెల్లించాలంటూ ఆదేశించారు. అయితే అధికారులు మరోసారి నెల రోజుల గడువు కోరారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచ్‌లు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్షపాతం చూపిస్తూ పంచాయతీ పాలనను నిర్లక్ష్యం చేస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా, తప్పుడు ప్రకటనలతో సర్పంచ్‌ల ప్రాణాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారు అని యాదయ్య గౌడ్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా సర్పంచ్‌ల బకాయిలను చెల్లించాలని, లేదంటే ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానపరిచే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, మెడబోయిన గణేశ్, సంగారెడ్డి జిల్లా అరవింద్ రెడ్డి, వరంగల్ నెక్కొండ మండల ఫోరం అధ్యక్షుడు మాదాసు రవి, నిర్మల్ జిల్లా పూర్ణచందర్ గౌడ్, సముద్రాల రమేష్, వికారాబాద్ జిల్లా సర్పంచులు పి. పాండు, రంగారెడ్డి వెంకట్రాం రెడ్డి, తిరుపతి రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కందుకూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దున్నపోతుమీద వానపడ్డట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తుందని, దున్నపోతుకు సర్పంచ్‌లు వినతిపత్రం అందచేశారు.

## విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ప్రభుత్వం

### హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అబిడ్స్‌లోని స్టాన్లీ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన విద్య అందించడమే లక్ష్యమని, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, జ్ఞానం, నైతిక విలువలు, క్రమశిక్షణ నింపి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసిపోరని, ఇటీవల ఉత్తీర్ణత శాతం పెరగడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో సేవలందించాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలో ఎంపికైన 108 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి సన్మానించారు. కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులకు ఏఐ శిక్షణ ఇవ్వడం, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి, డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపునకు కృషి
### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మెరుగుపరచడంలో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పౌర సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారానే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. లక్డీకాపూల్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు రూ.17.93 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వర్షపు నీటి కాలువ (స్టార్మ్ వాటర్ డ్రెయిన్) ప్రాజెక్టుకు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. వర్షాకాలంలో వరదలు, ప్రజల ఇబ్బందులు తలెత్తకుండా కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫండి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

**స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రాజెక్ట్ వివరాలు..**

- లక్డీకాపూల్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు మొత్తం 2,720 మీటర్ల పొడవున ఆర్‌సిసి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం
- న్యూ ప్రగతి ప్రెస్ నుండి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు 2,150 మీటర్ల డ్రెయిన్
- చిరాగ్ అలీ లేన్ నుండి బాంబే బజార్, నాంపల్లి స్టేషన్ రోడ్ వరకు 570 మీటర్ల డ్రెయిన్
- ప్రాజెక్ట్ పరిధిలోని క్యాచ్‌మెంట్ ఏరియా : 175.13 హెక్టార్లు
- ఎఫ్‌టిసిసిఐ మార్గ్, రెడ్‌హిల్స్, దేవయ్య బాగ్, ఏక్ మినార్ మజీద్ రోడ్, నేతాజీ నగర్, నాంపల్లి స్టేషన్‌రోడ్ ప్రాంతాల్లో వర్షపు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యం.

## రోడ్డు విస్తరణ పేరుతో గుడిసెలు తొలగిస్తే సహించం : సిపిఐ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గురుబ్రహ్మ నగర్ బస్తీలో సుమారు 30 ఏళ్లుగా ఉంటున్న పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, రోడ్డు విస్తరణ పేరిట వాటిని తొలగించాలని చూస్తే సహించబోమని సిపిఐ నాయకులు హెచ్చరించారు. రోడ్డు విస్తరణ పేరిట ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు స్థానిక ఎంఎల్‌ఏ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారనిఆ ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ఈ అంశంపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని సిపిఐ నాయకులుమామిడి చెట్ల వెంకటస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఏ దానం నాగేందర్ అనేక సంవత్సరాలుగా గుడిసెలను తొలగించి ఆ స్థలాన్ని బడా బాబులకు కట్ట బెట్టాలని తీవ్రమైన ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు.ఎంఎల్‌ఏ ప్రయత్నాలను సిపిఐ గా అడ్డుకుంటూ గుడిసె వాసులకు అండగా నిలబడుతున్నామన్నారు.దీంతో రోడ్డు విస్తరణ పేరుతో కుట్ర పన్నుతున్నారని వాటిని సిపిఐ సాగనీయబోదని స్పష్టం చేశారు. అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్న బస్తీ వాసులకు పట్టాలు ఇచ్చి వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. లేదంటే కబ్జా ప్రయత్నాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నర్సింహ, చిన్న భీమేష్, బి.రాముడు. పి.కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
## 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 'బతుకమ్మయంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' పేరుతో పోటీలను నిర్వహిస్తున్నామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేవారు తమ ఎంట్రీలను మెయిల్ ఐడీ (youngfilmmakerschallenge@gmail.com), వాట్సాప్ నంబర్ (8125834009)కు ఈ నెల 30వ తేదీ లోపు పంపించాలని ఆయన మంగళశారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమం (మహిళలకు ఉచిత బస్సు,మహాలక్ష్మి ,గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూని వర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్,పాటల పోటీలు ఉంటాయని వివరించారు. షార్ట్ ఫిలిమ్స్ నిడివి 3 నిమిషాలవరకు, పాటల వ్యవధి 5 నిమిషాలకు మించి ఉండకూడదని తెలిపారు. 40 ఏళ్ళ లోపు వయసు ఉన్న వారు, 4కె రిజల్యూషన్ ఉండి, షార్ట్ ఫిల్మ్స్/వీడియో సాంగ్స్ పోటీలలో సూచించిన 'థీమ్'ల పైనే ఉండాలని, పోటీలోని వీడియోలు గతంలో ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదని, బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కోసమే చిత్రీకరించినవారే పోటీలకు అర్హులని దిల్‌రాజు వివరించారు. పోటీల్లో ఎంపికైన థీమ్‌కు ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.1 లక్ష, కన్సోలేషన్ బహుమతిగా రూ. 20 వేలు(అయిదుగురికి) ఇవ్వడంతో పాటు విజేతలందరికీ ప్రశంసా పత్రం, జ్ఞాపికను ప్రదానం చేస్తామని దిల్‌రాజు తెలిపారు. నిర్దేశిత గడువులోగా వచ్చిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి, వివిధ కేటగిరీలలో ఎంపికలు పూర్తి చేస్తుందన్నారు.

## తాము చేసిన మంచిని, అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించడంలో తాము విఫలమయ్యామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. తాము చేసిన మంచిని, అభివృద్ధిని చెప్పు కోలేకపోయా మన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అంతకుముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికపై బిఆర్‌ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనను కొనసాగించే సత్తా లేదని, అందుకే ప్రతిసారీ పాత ప్రభుత్వం పైనే నెపం నెట్టివేస్తున్నదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని కెటిఆర్ తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన చెప్పారు.

## హైదరాబాద్‌లో మరో పాస్ పోర్ట్ కేంద్రం అవసరం




### మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాస్‌పోర్టు వినియోగదారులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకోసం విదేశీ వ్యవహారల శాఖ అధికారులు నడుం భిగించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్ మెట్రోస్టేషన్‌లో, రాయదుర్గంలో, కరీంనగర్‌లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఇందులో రాయదుర్గం, కరీంనగర్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయగా ఎంజిబిఎస్ మెట్రోస్టేషన్‌లో మాత్రం నూతన శాఖను ఏర్పాటు అయ్యింది. రాయదుర్గంలో అభివృద్ధి చేసిన పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కొత్తగా మరో పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కేంద్రం చొరవ చూపాలని శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్ నగరం రోజురోజుకీ పెరుగుతున్న జనాభాకు మరింత మెరుగైన సేవలు అందాలంటే మరో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అవసరమని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఏటా దేశవ్యాప్తంగా సగటున కొత్త పాస్‌పోర్ట్ కోసం కోటి మందికి పైగా దరఖాస్తు చేసుకుంటున్నారని, ఇందులో తెలంగాణ వాటా సుమారు 11 లక్షల వరకు ఉంటుందన్నారు. గతంలో పాస్‌పోర్ట్ కోసం నెలల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను కేవలం మూడు రోజుల్లోనే పూర్తి చేస్తూ తెలంగాణ పోలీసులు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కొత్త పాస్ పోర్ట్ సేవా కేంద్రం నగర ప్రజలకు, ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఎల్‌సి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సికింద్రాబాద్ ఆర్పీవో స్నేహజ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్ మెట్రో స్టేషన్ లో ఆధునీకరించిన నూతన పాస్ పోర్ట్ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పార్లమెంట్ సభ్యులు అసుద్దీన్ ఒవైసి,ఎంఎల్‌సి మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎండి, పాస్ పోర్ట్ జాయింట్ సెక్రటరీ కెజి శ్రీనివాస్ ,హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన,రీజనల్ పాస్ పోర్ట్ అధికారి స్నేహజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలోనే మొదటి మెట్రోలో ప్రారంభమైన మొదటి పాస్ పోర్ట్ కేంద్రం ఎంజిబిఎస్ పాస్ పోర్ట్ కార్యాలయం అని తెలిపారు. తెలంగాణ లో 5 పాస్ పోర్ట్ కేంద్రాలు ఉన్నాయి..బేగంపేట ప్రధాన పాస్ పోర్ట్ కేంద్రంగా ఉందన్నారు. ఎంజిబిఎస్ , టోలిచౌకి , నిజామాబాద్ , కరీంనగర్ లలో ఉన్నాయన్నారు. ఎంజిబిఎస్ లో పాస్ పోర్ట్ కేంద్రం అందరికి ఉపయోగపడుతుంది. ఇక్కడ మెట్రో బస్ సౌకర్యం ఉండడం వల్ల ఎక్కువ స్లాట్స్ బుక్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణ మధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**టెండర్ నోటీసు నెం. NED/E-19 & 20/2025-26 తేది: 12.09.2025** PUB/1136

www.ireps.gov.in లో ఈ క్రింది ఇ-టెండర్లకు ఆఫర్లు ఆహ్వానించబడ్డాయి.

క్ర.నెం.: 01 **టెండర్ నెం.:** NED/E- 19/2025-26 **పని పేరు:** ముద్ఖేడ్ స్టేషన్-ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్ వద్ద 30 పడకల సామర్థ్యం గల కొత్త బహుళ అంతస్తుల రన్నింగ్ రూమ్ ఏర్పాటు. **సుమారు ఖర్చు (రూ.):** 48,15,897.80/- **బిడ్ సెక్యూరిటీ (రూ.):** 96,300/- **ఆఫర్ చెల్లుబాటు:** 60 రోజులు **పూర్తయిన కాలం:** 12 నెలలు www.ireps.gov.in వద్ద అందుబాటులో ఉంది, నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ కింద. **ముగింపు తేదీ మరియు సమయం:** 06.10.2025 యొక్క 15:00 గంటలు

క్ర.నం.: 02 **టెండర్ నంబర్:** NED/E-20/2025-26 **పని పేరు:** దీనికి సంబంధించి విద్యుత్ ఏర్పాట్ల ఏర్పాటు 1) హిమాయత్‌నగర్ స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌ల మొత్తం పొడవును కవర్ చేయడానికి ప్లాట్‌ఫామ్ యొక్క విస్తరణ. 2) భోకర్ స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌ల మొత్తం పొడవును కవర్ చేయడానికి ప్లాట్‌ఫామ్ యొక్క విస్తరణ. **సుమారు ఖర్చు(రూ.):** 60,45,617.50/- **బిడ్ సెక్యూరిటీ (రూ.):** 1,20,900/- **ఆఫర్ చెల్లుబాటు:** 60 రోజులు **పూర్తికాలం:** 12 నెలలు అందుబాటులో ఉంది: www.ireps.gov.in, నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ కింద **ముగింపు తేదీ మరియు సమయం:** 06.10.2025 యొక్క 15.00 గంటలు

టెండర్ డాక్యుమెంట్ కోసం, అర్హత ప్రమాణాల వివరాలు, ప్రత్యేక షరతులు మొదలైనవి పైన పేర్కొన్న విధంగా మా వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఆఫర్ సమర్పించే ముందు ఆన్‌లైన్‌లో ఏదైనా దిద్దుబాటు ప్రచురించబడిందో లేదో తనిఖీ చేయాలని సూచించబడింది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (Elec.), నాందేడ్**

**నెం.NW/148/WIII/టెండర్ నోటీసు/ 2025-26 తేదీ:15.09.2025.** PUB/1137

ఈ క్రింది పనికి టెండర్లు పిలిచారు. పని వివరాలు ఇక్కడ ఉన్నాయి:

క్ర.నం.: 01 **టెండర్ నం.:** T-202526-3- 062 అథారిటీ: Co-ord **పని వివరణ:** సీనియర్ DEN/W/NED అధికార పరిధిలోని PSC గిర్డర్ బ్రిడ్జిల కోసం క్రెడిల్ టైప్ ఇన్స్పెక్షన్ ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు. **టెండర్ విలువ:** రూ. 46597474.66 **బయానా డబ్బు:** రూ. 383000.00 **పూర్తి కాలం:** పన్నెండు నెలలు **టెండర్ ఫారమ్ ధర:** రూ.0

క్ర.నం.: 02 **టెండర్ నం.:** T-202526-3- 063 అథారిటీ: Co-ord **పని వివరణ:** బాస్మత్ గూడ్స్ షెడ్‌లో 650x11 చదరపు మీటర్ల అన్ని వాతావరణ COP కేటాయింపు. **టెండర్ విలువ:** రూ. 81107710.04 (బూ) **బయానా డబ్బు:** రూ. 555500.00 **పూర్తి కాలం:** తొమ్మిది నెలలు **టెండర్ ఫారం ధర:** రూ.0

క్ర.నం.: 03 **టెండర్ నం.:** T-202526-2- 064 అథారిటీ: Co-ord **పని వివరణ:** నాందేడ్ డివిజన్: DEN/NE/NED అధికార పరిధిలో PSC గిర్డ్ వంతెనల కోసం క్రెడిల్ రకం తనిఖీ ప్లాట్‌ఫారముల ఏర్పాటు. **టెండర్ విలువ:** రూ. 73878840.02 **బయానా డబ్బు:** రూ. 519400.00 **పూర్తి కాలం:** ఆరు నెలలు **టెండర్ ఫారం ధర:** రూ.0

క్ర.నం.: 04 **టెండర్ నం.:** T-202526-2- 065 అథారిటీ: Co-ord **పని వివరణ:** ఆదిలాబాద్‌లో ఆల్ వెదర్ COP, CC అప్రోచ్ రోడ్, లైటింగ్ ఏర్పాట్లు, CCTV మరియు బౌండరీ వాల్, మర్చంట్ & హమాల్ గదులకు మెరుగుదల. (అన్ని వాతావరణ COP మాత్రమే). **టెండర్ విలువ:** రూ. 71433583.94 **బయానా డబ్బు:** రూ. 507200.00 **పూర్తి కాలం:** తొమ్మిది నెలలు **టెండర్ ఫారం ధర:** రూ.0

క్ర.నం.: 05 **టెండర్ నం.:** T-202526-2- 066 అథారిటీ: Co-ord **పని వివరణ:** నాందేడ్ డివిజన్: గూడ్స్ షెడ్ సౌకర్యాలు మరియు అన్ని వాతావరణ COP (650M x 10M ) at GL - 2 at మాల్టెక్డి. (ఆల్ వెదర్ COP మాత్రమే) **టెండర్ విలువ:** రూ. 71433583.94 **బయానా డబ్బు:** రూ. 507200.00 **పూర్తి కాలం:** తొమ్మిది నెలలు **టెండర్ ఫారం ధర:** రూ.0

క్ర.నం.: 06 **టెండర్ నం.:** T-202526-2- 067 అథారిటీ: Co-ord **పని వివరణ:** వాషిమ్ గూడ్స్ షెడ్ వద్ద గూడ్స్ ప్లాట్‌ఫామ్‌కు అనుకొని CC రోడ్డుతో కూడిన మీడియం లెవల్ గూడ్స్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు. **టెండర్ విలువ:** రూ. 83607842.69 **బయానా డబ్బు:** రూ. 568000.00 **పూర్తి కాలం:** తొమ్మిది నెలలు **టెండర్ ఫారం ధర:** రూ.0

క్ర.నం.: 07 **టెండర్ నం.:** T-202526-2- 068 అథారిటీ: Co-ord **పని వివరణ:** SWI-నాందేడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని పాత KVS భవనాన్ని కమ్యూనిటీ హాల్‌గా మార్చడం. SWII-డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని సర్వీస్ భవనాలు మరియు DOC కాలనీకి మొత్తం మెరుగుదల, అంటే వెనుక వైపు భవనాల పైకప్పు లీకేజీకి మరమ్మతులు, అల్మారా, కార్యాలయాలలో విభజనలను అందించడం మరియు DOCలో డ్రైనేజీ మరియు మురుగునీటి వ్యవస్థ, ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డు మెరుగుదలలు మొదలైనవి. SWIII-రెండు సంవత్సరాల పాటు DOC/NEDలో పచ్చిక మరియు తోట నిర్వహణను ప్రతిపాదించారు. SWIV-నాందేడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ టాయిలెట్లు, కారిడార్లు, సాధారణ ప్రాంతాల నిర్వహణ. **టెండర్ విలువ:** రూ. 38855137.56 **బయానా డబ్బు:** రూ. 344300.00 **పూర్తి కాలం:** ఇరవై నాలుగు నెలలు **టెండర్ ఫారం ఖర్చు:** రూ.0

క్ర.నం.: 08 **టెండర్ నం.:** T-202526-2- 069 అథారిటీ: Co-ord **పని వివరణ:** మాల్‌టెక్డి వద్ద GL-2 వద్ద గూడ్స్ షెడ్ సౌకర్యాలు మరియు అన్ని వాతావరణాలకు (650Mx10M) అందించడం- (అన్ని వాతావరణ COP తప్ప) **టెండర్ విలువ:** రూ. 57509863.84 **బయానా డబ్బు:** రూ. 437600.00 **పూర్తి కాలం:** పన్నెండు నెలలు **టెండర్ ఫారమ్ ఖర్చు:** రూ.0

**టెండర్ నం.:** T-202526-3-062, T-202526-3-063, T-202526-2-064, T-202526-2-065, T-202526-2-066 **పని యొక్క సారూప్య స్వభావం (50 లక్షల కంటే ఎక్కువ ఖర్చు కోసం):** ఉక్కు తయారీ మరియు నిర్మాణంతో కూడిన ఏదైనా పని: FOB లేదా స్టీల్/కాంపోజిట్ గిర్డర్ వంతెనలు లేదా స్టీల్ కాంపోజిట్ గిర్డర్ లేదా ఇండస్ట్రియల్ షెడ్ లేదా పిఇఫ్ షెల్టర్ (స్టీల్) లేదా మైక్రోవేవ్/హెచ్‌టి టవర్‌తో లేదా కూడిన వంతెనలు లేదా ఆర్‌ఓబి లేదా స్టీల్ మెంబర్ల భర్తీ/ స్టీల్ గిర్డర్ల బ్రిడ్జిలపై మరమ్మతులు లేదా గిర్డర్ల వంతెనలపై స్టీల్ స్లీపర్లు. **టెండర్ నం.:** T-202526-2-067, T-202526-2-068, T-202526-2-069 **పని యొక్క సారూప్య స్వభావం (50 లక్షల కంటే ఎక్కువ ఖర్చు కోసం):** ఏదైనా సివిల్ ఇంజనీరింగ్ పనులు (ట్రాక్ పనులు / జోనల్ పనులు మినహా).

పైన పేర్కొన్న అన్ని టెండర్లు 13.10.2025న 15:00 గంటలకు మూసివేయబడతాయి.

**A1437 సీనియర్ DEN/Co-ord/నాందేడ్**

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.




# జాతీయం

NATIONAL & GENERAL NEWS

మేఘాలయలో ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా తన సంకీర్ణ ప్రభుత్వంలో మంగళవారం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. ఎనిమిది మంది మేఘాలయ శాసనసభ్యులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారని అధికారులు తెలిపారు. ఎన్‌పిపికి చెందిన తిమోతి డి షిరా, బిజెపికి చెందిన సంబోర్ షల్లాయ్, యుడిపికి చెందిన మెట్బా లింగ్డో రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. వైలాద్మికి షిల్లా, సోస్తేనెస్ సోహ్తున్, ఎన్‌పిపికి చెందిన బ్రెనింగ్ ఎ సంగ్మా, హెచ్ ఎస్‌పిడిపికి చెందిన మెథోడియస్ ధఖర్, యుడిపికి చెందిన లహ్క్మెన్ రింబుయ్ కూడా మంత్రి మండలిలో చేరారు.కాగా, మంత్రివర్గ విస్తరణ జరగడానికి ముందే సీనియర్ నాయకులు ఎఎల్ హెక్, పాల్ లింగ్డో, అంపరీన్ లింగ్డోతో సహా మొత్తం 12మంది మంత్రులలో ఎనిమిదిమంది రాజీనామా చేసినట్లు తెలిపారు.

### మతమార్పిడి చట్టాలపై 'స్టే విధింపు' కోరుతూ దాఖలైన పిటిషన్లపై...

## రాష్ట్రాల వైఖరిని కోరిన సుప్రీంకోర్టు

**నోటీసులు జారీ**

**ఆరు వారాల తర్వాతకు విచారణ వాయిదా**



**న్యూఢిల్లీ :** మత మార్పిడి చట్టాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం అనేక రాష్ట్రాల వైఖరిని కోరింది. నాయమూర్తులు జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తూ సమాధానాలు అందిన తర్వాత అలాంటి చట్టాల అమలును నిలిపివేయాలనే ప్రార్థనను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. అనంతరం ధర్మాసనం రాష్ట్రాల స్పందనలకు నాలుగు వారాల గడువును ఇచ్చి, అటు పిమ్మట పిటిషన్లు తిరిగి వాదనలు దాఖలు చేసుకోవడానికి అనుమతించింది. అనంతరం ఆరువారాల తర్వాతకు విచారణను వాయిదా వేసింది. ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ప్రస్తుత చట్టంలో చేసిన 'మరింత కఠినమైన' మార్పులను దృష్టిలో ఉంచుకుని, మతమార్పిడి చట్టాలకు వ్యతిరేకంగా పిటిషనర్లలో ఒకరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సి.యు. సింగ్‌కు ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఉత్తర్ ప్రదేశ్ సహా మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జార్ఖండ్ మరియు కర్ణాటక రాష్ట్రాలు అమలు చేసిన మతమార్పిడి చట్టాల చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. వివాహం లేదా ఇతర మార్గాలలో మత మార్పిడులు జరుగుతున్నాయనే వివాదాస్పద అంశంపై సీనియర్ న్యాయవాదుల వాదనలను విన్నది. ఈ విషయంలో అత్యవసర పరిస్థితి గురించి సీనియర్ న్యాయవాది సింగ్ నొక్కిచెప్పారు. మతాంతర వివాహం చేసుకున్న ఏ వ్యక్తికైనా బెయిల్ అసాధ్యం అవుతుంది అని హెచ్చరించారు. అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఈ చట్టాన్ని ఆమోదించాయని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయానికి సంబంధించి రాజస్థాన్ తాజాగా చట్టాన్ని ఆమోదించింది అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో థర్డ్ పార్టీలలో ఫిర్యాదులు దాఖలు చేయడానికి సవరణలు ప్రవేశపెట్టబడ్డాయని న్యాయవాది సింగ్ చెప్పారు. దీనివల్ల చర్చి పరిశీలనలతో పాటు మతాంతర వివాహాలలో 'భారీగా వేధింపులకు' దారితీస్తుంది, అంతేకాదు ఇక్కడ గుంపులు జోక్యం చేసుకుంటాయి. స్పెషల్ లీవ్ పిటిషన్ల(ఎస్‌ఎల్‌పి)లో దాఖలు చేసిన సవరణ దరఖాస్తులను అనుమతించాలని సింగ్ కోరారు. మరోవైపు, సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ మధ్యప్రదేశ్ ఆమోదించిన చట్టం కొనసాగించడంపై 'మధ్యంతర స్టే' విధించాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఉత్తర్ ప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో ఇలాంటి చట్టాలపై స్టే కోసం దాఖలు చేసిన దరఖాస్తులు ఉన్నాయని న్యాయవాది రిందా గ్రోవర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అడిషనల్ సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల తరపున తాత్కాలిక ఉపశమనాన్ని వ్యతిరేకిస్తూ 'మీరు మూడు నాలుగు సంవత్సరాల తర్వాత అకస్మాత్తుగా స్టే కోసం దాఖలు చేస్తారు. మేం మా సమాధానాలను దాఖలు చేస్తాం' అని అన్నారు. 'ఇది మోసపూరిత మతమార్పిడో, కాదో ఎవరు కనుక్కుంటారు?' అని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ప్రశ్నించారు. ఈ కేసులో కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించడానికి కోర్టు పిటిషనర్ల తరపున న్యాయవాది శ్రిష్టిని నోడల్ కౌన్సెల్‌గా, ప్రతివాద రాష్ట్రాల తరపున న్యాయవాది రుచిరను నోడల్ కౌన్సెల్‌గా నియమించింది.

### 'వంటారా' మాదిరిగానే...

## అన్ని కేసులూ పరిష్కారమవుతాయా?

**'సుప్రీం'లో కేసు క్లోజ్ చేసిన మరుసటి రోజు కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఎద్దేవా**

**రహస్య సీల్డ్ కవర్ వ్యాపారమా? అని ఆశ్చర్యం వ్యక్తం**



**న్యూఢిల్లీ :** ప్రత్యేక దర్యాప్తు బృందం క్లీన్ చిట్ ఇచ్చిన తర్వాత జూలాజికల్ రెస్క్యూ, పునరావాస కేంద్రం 'వంటారా'పై కేసును సుప్రీంకోర్టు ము గించిన ఒకరోజు అనంతరం కాం గ్రెస్‌నేత జైరామ్ రమేష్ మంగళవార ం ఆ విషయమై స్పందించారు. ఒక వేళ అన్ని కేసులను కూడా ఇంత త్వరగా, వర్గీకృతంగా పరిష్కరించి ఉండాల్సింది కదా అని వంటారాపై సుప్రీంకోర్టు కేసును ముగించిన తర్వాత ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, మాజీ కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి కూడా అయిన జైరామ్ రమేష్ మాట్లాడుతూ సుదీర్ఘ జాప్యాలకు నిలయమైన భారతీయ న్యాయవ్యవస్థ తనకు నచ్చినప్పుడల్లా శరవేగంతో కదులుతుంది అని సుతిమెత్తటి వ్యాఖ్యలు చేశారు. '2025 ఆగస్టు 25న అత్యున్నత న్యాయస్థానం వంటారా వ్యవహారాలపై ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించి విచారణకు ఆదేశించింది. జామ్‌నగర్‌లో 'రిలయన్స్ ఫౌండేషన్' ఒక వన్యప్రాణుల సంరక్షణ, పునరావాస కేంద్రం 'వంటారా'ను నెలకొల్పింది. ప్రత్యేక దర్యాప్తు బృందం తన సభ్యులతో వంటారాను పరిశీలించి 2025 సెప్టెంబరు 12న తన నివేదికను సమర్పించారు' అని జైరామ్ రమేష్ చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం తన నివేదికను ఒక సీల్డ్ కవర్‌లో 2025 సెప్టెంబరు 15న సమర్పించింది. కాగా సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సిఫార్సులను అంగీకరించి కేసును క్లోజ్ చేసింది. 2025 ఆగస్టు 7న దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) ద్వా రా ఇది ప్రేరేపించబడిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఎత్తిచూపారు. ఈ 'మర్మమైన సీల్డ్ కవర్ వ్యాపారం' ! లేకుండానే అన్ని కేసులను ఇంత త్వరగా, స్పష్టంగా పరిశీలించి, పరిష్కరించిఉంటే బాగుండేదని జైరామ్ రమేష్ అన్నారు. సుప్రీంకోర్టు సోమవారం తన ప్రత్యేక దర్యాప్తు బృందం వంటారాకు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని అంగీకరిస్తూ ఇందులో చట్ట ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసింది.

### వాణిజ్య సమస్యల పరిష్కారంపై

## అమెరికా—భారత్ చర్చలు ప్రారంభం




**న్యూఢిల్లీ:** అమెరికా—భారత్ ప్రధాన వాణిజ్య సంప్రదింపులకర్తల మధ్య మంగళవారం న్యూఢిల్లీలో సంభాషణలు ప్రారంభమయ్యాయి. ఐతే రెండు దేశాలమధ్యా ఇవి ఆరో విడత సంప్రదింపులుగా మాత్రం పరిగణించకూడదని భారత వాణిజ్యమంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు స్పష్టత ఇచ్చారు. ఇప్పటివరకూ ఉన్నతస్థాయీ వాణిజ్య అధికార ప్రతినిధులు ఐదు విడతల సంప్రదింపులు పూర్తి చేశారు. ఆరో విడత సంప్రదింపులు ఇంకా ప్రారంభం కాలేదు.రెండు దేశాలకు చెం దిన వాణిజ్యశాఖల ఉన్నతస్థాయీ అధికారులు వారం వారం దృశ్యమాధ్యమ పద్ధతి ద్వారా చర్చలు కొనసాగిస్తున్నారని కూడా సీనియర్ అధికారి చెప్పారు. రెండు దేశాలమధ్యా వాణిజ్య సమస్యలను పరిష్కరించుకోవడం అంత కష్టమైన విషయం కాదని ట్రంప్ ప్రకటించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సానుకూలంగా స్పందించడంతో ఈ చర్చల పునఃప్రారంభానికి మార్గం ఏర్పడింది. ఉక్రేన్‌లో రష్యా యుద్ధం కొనసాగించడానికి పరోక్ష కారణం, ఆ దేశం నుండి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడమేనని అమెరికా ఆరోపించడంతో రెండు దేశాలమధ్యా వాణిజ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఐతే జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ గణాంకాల ప్రాతిపదికపై రష్యా నుండి ఇంధన సేకరణ చేస్తున్నట్లు భారతదేశం తన వైఖరిని సమర్థించుకుంటూ వస్తున్నది. సకల వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశ రైతుల ప్రయోజనాలు, పాడిపరిశ్రమ ప్రయోజనాలు, సూక్ష్మ, చిన్న,మధ్యతరమా పరిశ్రమలను సంరక్షించుకోవడంకోసమే లక్ష్యమని భారత్ వాదిస్తున్నది.

దక్షిణ—మధ్యాసియా ప్రతినిధిగా అమెరికా తరపున పనిచేస్తున్న బ్రెండన్ లించ్, భారత్ తరపున ప్రధాన సంప్రదింపులకర్త, కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఈ సంభాషణల్లో పాల్గొన్నారు. భారీ సుంకాలు భారత్‌పై విధించడంవల్ల సమస్యలు తలెత్తిన నేపథ్యంలో వాటిని పరిష్కరించుకోవడానికి రోజం తా వారిద్దరూ సంభాషణలు చేశారు. భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన తర్వాత వాణిజ్య సంభాషణల నిమిత్తం అమెరికా తరపు ఉన్నత స్థాయీ అధికారి భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ట్రంప్ విధించిన యాభై శాతం దారుణ సుంకాలు అన్యా యం, అసంబద్ధంగా భారత్ విమర్శిస్తున్నది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై సంప్రదింపులు జరపాలని రెండు దేశాల అగ్రనాయకులు తమ కిందిస్థాయీ ఉన్నతాధికారులకు గడచిన ఫిబ్రవరినెలలో ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత ప్రకారం ఈ ఏడాది చివరినాటికి తొలిదశ సంప్రదింపులు ముగించాల్సి ఉంది. ఇప్పటివరకూ ఐదువిడతల సంప్రదింపులు పూర్తి కాగా, ఆరోవిడత వాణిజ్య చర్చలు ఆగస్టు 25 నుండి 29వ తేదీ వరకూ జరగాల్సి ఉన్న తరుణంలో భారత్‌పై భారీస్థాయిలో ట్రంప్ సుంకాల భారం మోపడంతో ఈ చర్చలు వాయిదాపడ్డాయి.

## భక్తుల డబ్బు కల్యాణ మంటపాల నిర్మాణానికి కాదు

**మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరణ**

**న్యూఢిల్లీ :** దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మంటపాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడు లోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మంటపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కల్యాణ మంటపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే.. అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా? అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

### చొరబాటుదారులపై మోదీ ప్రచారం

## ప్రజాదృష్టి మళ్లింపు వ్యూహామే...

**ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఆరోపణ**

**పాట్నా :** బిహార్‌లో చొరబాట్లకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న వ్యాఖ్యలు ప్రజా దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న వ్యూహాలను ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బిహార్ అధికార్ యాత్రను ప్రారంభించడానికి పొరుగున ఉన్న జెహానాబాద్ జిల్లాకు బయలుదేరే ముందు యాదవ్ పాట్నాలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం పూర్నియాలో జరిగిన ర్యాలీలో ప్రధాని బిహార్‌లో ప్రతిపక్ష పార్టీ చొరబాటుదారులకు రక్షణకవచంగా మారిందని పేర్కొనడంపై మీ స్పందన ఏమిటని తేజస్విని విలేకరులు ప్రశ్నించగా పై విధంగా ఆయన స్పందించారు. బిహార్‌లో చొరబాటుదారులు ఉన్నారని అనుకుంటే మీరు (మోదీ) 11 సంవత్సరాలు అధికారంలో ఉన్నారు, అంతేకాకుండా, మీరు (బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ) రాష్ట్రాన్ని 20 సంవత్సరాలుగా పాలిస్తున్నారు' కదా చరి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బిహార్‌లో పాలక వర్గం ఒక్క చొరబాటుదారుడిని కూడా గుర్తించగలిగిందా అని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'గత సంవత్సరం జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పుడు వారు ఇదే విధంగా లేవనెత్తిన ఒక మోసపూరితమైన విషయం ఇది అని నేను ఆనాడే చెప్పాను. ఇప్పుడు వారు దాని గురించి మరచిపోయారు' అని యాదవ్ పేర్కొన్నారు. చొరబాటు సమస్యను ప్రజా దృష్టిని మళ్లించేందుకు తెరపైకి తెచ్చారని, మంచి పాలన అందించడంలో, ప్రజలకు ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, వారి ఫిర్యాదులను త్వరగా, సమర్థవంతంగా పరిష్కరించడంలో ఎన్‌డిఎ తన వైఫల్యాన్ని గ్రహించిందని మాజీ డిప్యూటీ సిఎం అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి ఎన్‌డిఎ కూటమిని ఓడిస్తుందన్నారు. విద్య, మందులు, ఉద్యోగాలు, ఫిర్యాదుల పరిష్కారం, సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందేశంతోనే తాను బిహార్ అధికార్ యాత్రను ప్రారంభిస్తున్నానన్నారు.

### రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్

## చైతన్య బఘేల్ నడిపినట్లు ఇడి వెల్లడి

**రాయ్‌పూర్:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్‌కేసులోఛత్తీస్‌గఢ్‌మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ దర్యాప్తులో చైతన్య బఘేల్ రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్‌ను నడిపినట్లు గుర్తించామని పేర్కొంది. ఈ సిండికేట్‌ను నిర్వహించడానికి దాని సభ్యులకు అప్పటి ఐఎఎస్ అధికారి అనిల్, వ్యాపారవేత్త అన్వర్ ధేబర్ సహకరించినట్లు ఇడి ఆరోపించింది.సిండికేట్ సేకరించిన అన్ని అక్రమ నిధుల ఖాతాలు, పంపిణీకి సంబంధించిన విషయాలను చైతన్య చూసుకునేవాడని ఇడి ఆరోపించింది. ఇక్కడ వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవాడని తెలిపింది. మరికొందరు రాజకీయ నేతలకుకూడాఈకుంభకోణంతో సంబంధం ఉందని.. త్వరలో వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న సమయంలో 2019—2022లో రూ.2,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని.. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదుచేసినఇడిఇటీవలమాజీసిఎం నివాసంలో సోదాలు చేపట్టింది. ఆ సమయంలో చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఇడి ఆయనను అరెస్టుచేసింది.

## పాల ఉత్పత్తుల రేట్లను తగ్గించిన మదర్ డెయిరీ

**న్యూఢిల్లీ :** వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) రేట్లలో కీలక మార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. జిఎస్‌టిలోని అత్యధిక పన్ను శ్లాబులను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. ఇకపై 5, 18 శాతం స్లాబులు మాత్రమే ఉండనున్నాయి. ఈ కొత్త పన్ను రేట్లు ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం నిర్ణయంతో అనేక వస్తువుల రేట్లు తగ్గనున్నాయి.ఇందులోభాగంగానే ప్రముఖ డెయిరీ సంస్థ మదర్‌డెయిరీ తాజాగా కీలక ప్రకటన చేసింది. పాల నుంచి నెయ్యి వరకూ అనేక ఉత్పత్తులపై జిఎస్‌టి మార్పులకు అనుగుణంగారేట్లనుతగ్గించనున్నట్లు ప్రకటించింది. వెన్న, నెయ్యి, మిల్క్ ప్రొడక్ట్స్, మజ్జిగ వంటివి 12 శాతం శ్లాబులో ఉండగా.. దీన్ని తొలగించడంతో ఇవి 5 శాతం శ్లాబులోకి చేరనున్నట్లు కేంద్రం ప్రకటించడంతెలిసిందే. ఇందుకు అనుగుణంగా మదర్ డెయిరీ ప్రకటనచేసింది. పాలు, పన్నీర్, బటర్, చీజ్, నెయ్యి, మిల్క్ షేక్స్ వంటి ఉత్పత్తుల రేట్లను తగ్గించి జిఎస్‌టి బెనిఫిట్స్ ప్రజలకు అందిస్తున్నామన్నది.

### ఆన్‌లైన్ జూదం మోసాల కేసులో

## క్రికెటర్స్ ఉతప్ప,యువరాజ్‌సింగ్, నటుడు సోనూసూద్‌ల విచారణ

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో ప్రముఖ ఆటగాళ్ళు రోబిన్ ఉతప్ప (39), యువరాజ్‌సింగ్(43)లతోపాటు ప్రముఖ నటుడు సోనూసూద్(52)లను 1xబెట్ యాప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) వచ్చేవారం విచారణ చేస్తుంది. డిజిటల్ ఫ్లాట్‌ఫాంపై డబ్బుతో జూదం ఆడటంతోపాటు ధనాన్ని అక్రమ మార్గాల్లో తరలించారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన దర్యాప్తు పరిధిని విస్తరించింది. ఇందులో భాగంగా ఈనెల 22న ఉతప్పను, 23న యువరాజ్‌సింగ్, 24న సోనూ సూద్‌లను విచారణ చేస్తారు. రాబోయే రోజుల్లో మరింతమంది క్రీడాకారులను, సినిమా నటులను, ప్రజలను ప్రభావితం చేసేవారిని, సెలబ్రిటీలను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ కేసులపై పిలిపించి దర్యాప్తు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.హవాలా, బ్యాం కింగ్ మార్గాల ద్వారా ఈ చెల్లింపులు జరుగుతున్నట్లు గుర్తించారు. భారతదేశంలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లను డబ్బుతో ఆడటం నిషేధం, నేరం అనే విషయాలు అసలు ఈ క్రికెటర్లకు, సినీ నటులకు, సెలబ్రిటీలకు తెలుసా? లేదా? అనే విషయాన్ని ఇ.డి అధికారులు స్పష్టంగా అడగదలచుకున్నారు. వారు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా? తెలియక చేస్తున్నారా? అనే విషయాలను, కంపెనీ లావాదేవీల గురించి కూడా వారి నుండి ఇ డి అధికారులుసమాచారంరాబడతారు. డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌పై డబ్బుతో జూదం, సంబంధిత ధనం అక్రమ తరలింపు విషయాలపై ఈ ముగ్గురినీ పిలిపించి ప్రశ్నించినట్లు అధికారులు మంగళవారం చెప్పారు. న్యూఢిల్లీలోని డి కేంద్ర కార్యాలయంలో వరుసగా మూడురోజులపాటు వచ్చేవారంలో వారిని వేరు వేరుగా విచారణ చేస్తారు. 1xబెట్ పేరుతో ఉన్న బెట్టింగ్ ఫ్లాట్‌ఫారమ్‌తో ఈ కేసులు ముడిపడి ఉన్నాయి. మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖార్ ధావన్, తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ మాజీ ఎంపి, నటుడు మిమి చక్రవర్తిలను కూడా ఈ కేసుల దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు గడచిన కొద్ది వారాలుగా ప్రశ్నిస్తున్నారు. బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా (36), మంగళవారం ఇ.డి అధికారుల ఎదుట హాజరుకాగా, నటి ఊర్వశీ రౌతెలా (31) కూడా మంగళవారం అధికారుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. ఈ నటి 1xబెట్ కు భారత్‌లో అంబాసిడర్‌గా పనిచేస్తున్నారు.

**దేశంలో 22 కోట్లమంది ఆన్‌లైన్ జూదగాళ్ళు**

ఆన్‌లైన్‌లోజూదాన్నిడబ్బుతో ఆడటం నిషేధించడానికి ముం దుగా దేశంలో దాదాపు 22 కోట్లమంది యూజర్లు అనేక రకాల బెట్టింగ్ యాప్‌లను ఉపయోగిస్తున్నారు. వీరిలో 11 కోట్లమంది రోజూవాదీ జూదగాళ్ళు. మనదేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ వ్యాపారం మార్కెట్ విలువను దాదాపు 100 బిలియన్ డాలర్లుగా అంచనావేశారు. ఈ మార్కెట్ విలువ 30 శాతం వంతున పెరుగుతోంది. భారత ప్రభుత్వానికి 2022 నుండి ఈ ఏడాది జూన్ వరకూ 1,524 కంపెనీలు వ్యాపారం కోసం దరఖాస్తులు చేసుకున్నాయి.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఈ విషయం ప్రకటించింది. సైప్రస్‌దేశాన్ని ప్రధాన కేంద్ర కార్యాలయంగా చేసుకుని పనిచేస్తున్న 1xబెట్ గ్యాంబ్లింగ్ కంపెనీ 2007 నుండీ భారత్‌లో పనిచేస్తూ భారీసంఖ్యలో మధ్యతరగతి,ఎగువమధ్యతరగతి వర్గాలను వ్యసనపరులుగా మార్చింది. యూరప్‌లోని నెదర్లాండ్స్‌దేశంలో అంతర్భాగంగా ఉండే క్యూరాకో అనే ద్వీపదేశం నుండి 1xబెట్ గ్యాంబ్లింగ్ కంపెనీ లైసెన్సు పొంది మనదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.


**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, **మహమ్మద్ అజహరుద్దీన్ తండ్రి ఇక్బాల్**, ఇ.నెం. 1-9-61/33/A2/2, విజయ కాలనీ, సూర్యాపేట. నా ఒరిజినల్ **పాస్‌పోర్ట్ నెం. Z2994293.** నేను తేది: 05.09.2025న సూర్యాపేట నుండి హైదరాబాద్‌కు వెళ్లేందుకు విజయకాలనీ నుండి బైక్‌పై హైటెక్ బస్‌స్టాండ్‌కు వెళ్తుండగా మార్గం మధ్యలో నా పాస్‌పోర్ట్ పడిపోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు తెలియజేయగలరు. సెల్: 8466982219

ఇట్లు
**మహమ్మద్ అజహరుద్దీన్**
విజయ కాలనీ, సూర్యాపేట.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UB 8115 | Naseer Ahmed Shaik | AL GURU 1211 FBT | 2017 |
| 2 | TS03UD 4989 | Suresh Kasarla | APE XTRA LDX BS6 CNG | 2023 |
| 3 | AP15TA 1566 | Anusha Bakki | TATA LPT 2515 TURBO FBT | 2009 |
| 4 | TS03UC 0536 | Naseer Ahmed Shaik | AL E COMET 1214 FBT | 2017 |
| 5 | TS02FI 0542 | Anurdha Merugu | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2013 |
| 6 | TS06UC 8193 | Venkanna Alakuntla | TATA LPK 2523 FBT | 2019 |
| 7 | TS09FH 4448 | Ranjith Solthi | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2018 |
| 8 | TS03UC 8256 | Ganesh Lunavath | ESCORTS 439 DS PLUS PT | 2020 |
| 9 | TS24TA 1629 | Naseer Ahmed Shaik | EICHER PRO 3018 BS6 FBT | 2023 |

**AUCTION DATE 20-09-2025**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments
Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883

# మోదీజీ ! ఇన్ని మాటలేల?

ప్రజాపక్షం
17-09-2025, బుధవారం

ప్రధాని నరేంద్ర మోదీ మామూలుగానే వాగాడంబరి; ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలొస్తున్నా ఆర్నెల్ల ముందునుంచే ఆ రాష్ట్రం చుట్టూ ప్రదక్షిణలు చేయటం, నోటికొచ్చిన వాగ్దానాలు చేయటం ఆయనకు అలవాటు. ఇక శిలాఫలకాల (శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు) ఆవిష్కరణ, వేలకోట్ల రూపాయల ప్రాజెక్టుల వాగ్దాన పరంపరలు వెన్నతో పెట్టిన విద్య. గత పదేళ్లుగా చూసుకుంటే ఎన్నికలకు ముందు ఆయన ఏ రాష్ట్రానికెళ్లినా ఆ చేతికి ఎముకే లేదన్నట్లు పదుల వేల కోట్ల రూపాయలు ప్రకటిస్తుంటారు. వచ్చే సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే స్వరాష్ట్రం గుజరాత్‌లో మోదీజీ ఇప్పటినుంచే తీరికలేనని యాత్రలు, వాగ్దానాలు చేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ జాతుల వైషమ్యాలు, ఘర్షణలతో రెండేళ్లుగా అల్లకల్లోలంగా ఉంటే – దేశదేశాలు తిరిగే మీరు మణిపూర్ సందర్శించి ఆ ప్రజలకు ఎందుకు సాంత్వన చేకూర్చారని ప్రతిపక్షాలు ఎన్నిసార్లు ప్రశ్నించినా జవాబు చెప్పని ప్రధాని నాలుగురోజుల క్రితం తీరిక చేసుకుని వెళ్లారు. వెళ్లటం హర్షించదగిందే. కాని ఆ బాధితులకు మాత్రం ఊరట కలిగించలేకపోయారు. అంతకుముందురోజు మిజోరం సందర్శించి అద్భుతమైన రైలుమార్గం ప్రారంభించారు. సంతోషం. అయితే ఆ మార్గంతోనే అభివృద్ధి పలుగులు తీస్తుందనటమే చిత్రం. ఈశాన్య భారత్‌లోని 8మంది అక్కచెల్లెళ్లు (రాష్ట్రాలు) వెనుకబాటుతనంలో ఉండటానికి బాధ్యత తంతా కాంగ్రెస్ పార్టీదేనట. ఎంత సులభంగా నింద వేస్తారు. అస్సోం మొదలు అనేక రాష్ట్రాల్లో ఆదిమతెగల జాతి వైరాలను, సాయుధ తిరుగుబాట్లను శాంతపరిచి ఒప్పందాల సాధన, అమలుకు ఎన్ని సంవత్సరాలు పట్టిందో మోదీజీకి అర్థమై ఉండదు. అధికారం సంపాదించటం ఎలా అనే యావ తప్ప శాంతి, భౌతిక అభివృద్ధి మీద తగినంత దృష్టి లేదు.

ఈశాన్య రాష్ట్రాలతోపాటు తూర్పు రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బిహార్‌లను కాషాయ ఛత్రం కిందకు తెచ్చుకోవటం మోదీ–అమిత్‌షా గేమ్ ప్లాన్. ముస్లిం బూచి పనిచేయటం లేదు. మహారాష్ట్ర, కర్నాటకల్లోలాగా ఎంపికచేసిన నియోజకవర్గాల్లో ఓటరు జాబితాలను తారుమారు చేసే పథకం బిహార్‌లో ఫలప్రదమవుతుందో లేదో చూడాలి. పదుల లక్షల సంఖ్యలో ఓట్ల తగ్గింపు ఐదారు జిల్లాల్లోనే ఉంది. రాహుల్‌గాంధి ముమ్మరమైన ప్రచారాందోళన ద్వారా బిజెపి పనుపున ఎన్నికల కమిషన్ ఆడుతున్న ఓటరు వెన్నుపోటు నాటకాన్ని బట్టబయలు చేశారు. తలా యించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ సుప్రీం కోర్టు ముందేకాదు, ప్రజాక్షేత్రంలో కూడా విమర్శలపాలవుతున్నారు. ప్రధానమంత్రి మోదీజీ తాజా బిహార్ పర్యటనలో 'చొరబాటు దారులపై' ధ్వజమెత్తారు. తాను ఎర్రకోట మీదే చెప్పినట్లు, సరిహద్దు రాష్ట్రాల్లో బెడదగా తయారైన చొరబాటుదారులను గుర్తించి, తరలించేందుకు కమిషన్‌ను నియమిస్తానన్నారు. బిహార్, బెంగాల్, అస్సోంలలో చొరబాటుదారులవల్ల అక్కడిప్రజలు తమ అక్కచెల్లెళ్లు, కుమార్తెలకు భద్రత లేకుండా పోయిందని భావిస్తున్నారని ప్రధాని అన్నారు.

బిహార్‌లో అయితే ఆత్మగౌరవం, గుర్తింపుకు కూడా ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రధాని చెబుతున్న స్థాయిలో చొరబాటుదారులు ఉంటే వారిని దేశంలోనికి రానిచ్చిందెవరు? మోదీగారి బిఎస్ఎఫ్, భద్రతా దళాలేకదా? అయినా ఎన్నికల దాకా వారెందుకు గుర్తుకు రాలేదు. ఈ పాపాన్నంతా కాంగ్రెస్, ఆర్‌జెడి నెత్తిన వేసి రాజకీయ లబ్ధిపొందటమే మోదీజీ అసలు ప్రయోజనం. ఆ ప్రతిపక్షాలు చొరబాటుదారుల్ని ఆహ్వానించాయి, ఆశ్రయమిచ్చాయి, ఓటర్ల జాబితాలో చేర్చి ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయన్నది ఆయన నిందారోపణ.

అసోంలో విదేశీయుల గుర్తింపుకోసం దశాబ్దం పైబడి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం పూర్తికాలేదు – ఎప్పటికి పూర్తవుతుందో చెప్పగలిగినవారు లేరు. ఈ మధ్య అసోం, మరికొన్ని హిందీ రాష్ట్రాలనుంచి బెంగాలీ మాట్లాడే ముస్లింలను పట్టుకుని బంగ్లాదేశీయులని పంపించారు. వారిలో కొందరు భారతీయులుగా రుజువు చేసుకుని తిరిగి వచ్చారు. ఇది బెంగాల్‌లో బిజెపికి ఎదురుతన్నింది. అందువల్ల సమస్యలు పరిష్కరించవలసిందే. కాని ఎన్నికలు అందుకు సరైన సమయం కాదు.

# ఆసియా ఖండపు సోక్రటీస్ : పెరియార్



డాక్టర్ దేవరాజు మహారాజు


''ఇంగ్లాండులో బ్రాహ్మణులు లేరు. శూద్రులుగానీ, అస్పృశ్యులుగానీ లేరు. రష్యాలో కులం, మతం, అదృష్టాలు లేవు. అమెరికాలో బ్రహ్మముఖం నుండి గానీ, పాదాల నుండి గానీ పుట్టిన వాళ్లు లేరు. జర్మనీలో దేవుడు ఆహారం తీసుకోడు. టర్కీలో దేవుడు పెండ్లి చేసుకోడు. ఫ్రాన్స్‌లో ఆయన పన్నెండు లక్షల విలువైన ఆభరణాలు ధరించడు. ఈ దేశాలలో ప్రజలు తెలివైన వాళ్లు. బుద్ధిమంతులు. వారు, వారి, ఆత్మగౌరవాన్ని వదులుకోవాలని అనుకోరు. వారి దృష్టి కేవలం హక్కుల సాధన మీద, జాతీయ భద్రత మీద, అభివృద్ధి మీద మాత్రమే ఉంటుంది. మరి, మన దేశానికే ఎందుకీ హేయమైన దేవుళ్లూ–మత ఉగ్రవాదం''? – అని ఆవేదన చెందారు పెరియార్ రామసామి. జనంలోని అమాయకత్వాన్ని, మూఢ నమ్మకాల్ని, అర్థం లేని సంప్రదాయాల్ని దునుమాడినవాడు. ద్రవిడ ఉద్యమ పితామహుడైన ఇరోడ్ వెంకటప్ప రామసామి (17, సెప్టెంబరు, 1879–24 డిసెంబరు 1973) అందించిన స్ఫూర్తి దేశానికే పరిమితం కాలేదు. అది ఖండాంతరాలకు పాకింది. THE PROPHET OF NEW AGE అనీ, తూర్పు, దక్షిణ ఆసియా ఖండపు సోక్రటీస్ – అనీ యునెస్కో గుర్తించి ఆయనకు ఒక ప్రశంసా పత్రం అందించింది.

1977లో మద్రాస్ హైకోర్టుకు ఒక పిటిషన్ వచ్చింది. తమిళనాడులో పెరియార్ విగ్రహాల కింద రాసిన వాక్యాలు ప్రమాదకరంగా ఉన్నాయనీ, అవి ప్రజల ధార్మిక భావనల్ని దెబ్బతీస్తున్నాయని, అందువల్ల వాటిని వెంటనే తొలగించాలన్న ఆదేశాలు కోర్టు ఇవ్వాలని– ఆ పిటిషన్ సారాంశం! అందుకు కోర్టు స్పందించింది. వాదనలు, ప్రతివాదనలు విన్న తరువాత ఇలా తీర్పిచ్చింది. ఇరోడ్ వెంకటప్ప రామసామి పెరియార్ ఏ ఆలోచనా ధోరణితో ఉండేవాడో, ఆ ఆలోచనలనే ఆయన విగ్రహం కింద చెక్కించి పెట్టారు. అందులో తప్పేముంది? పెరియార్ చెప్పని మాటలు ఆయన విగ్రహం కింద చెక్కించలేదు కదా? ఇష్టమైన వారే చదువుకుంటారు. ఇష్టం లేని వారు మానేస్తారు. అందులో బలవంతం ఏమీ లేదు కదా? ఇంకా అభ్యంతరం ఎందుకూ? అని కోర్టు ప్రశ్నించింది. 'పెరియార్ విగ్రహం కింద చెక్కించి పెట్టిన వాక్యాలు తొలగించనవసరం లేదు' అని కోర్టు తీర్పు చెప్పింది. విగ్రహాల కింద అమర్చిన ఫలకాల మీద పెరియార్ మాటలు ఇలా ఉన్నాయి–

''దేవుడు లేడు–దేవుడు లేనే లేడు! దేవుడు ఉన్నాడనుకుని దేవుణ్ణి సృష్టించిన వాడు మూర్ఖుడు. ఆ భావాన్ని ప్రచారం చేసేవాడు దుర్మార్గుడు. ఇక దేవుణ్ణి పూజించే వాడయితే పరమ నికృష్టుడు.''

దేవుణ్ణి దృష్టిలో ఉంచుకుని పెరియార్ రామసామి ఒక పదిహేను ప్రశ్నలు సంధించాడు. అవి ఆ కాలంలోనే సమాజాన్ని అతలాకుతలం చేశాయి. దేవుణ్ణి అమితంగా ఆరాధించేవారు ఆ ప్రశ్నలు తెలుసుకోకపోవడమే మంచిది. అనవసరంగా వారు, వారి మనోభావాలు దెబ్బ తీసుకోకపోతేనే మంచిది. నిజాల్ని నమ్మేవారు, వాస్తవం తెలుసుకుందామని అనుకునే వారు మాత్రమే పెరియార్ ప్రశ్నల గురించి తెలుసుకోవాలి. ఆ ప్రశ్నలు నిత్య నూతనం – దేవుడికి పెరియార్ సంధించిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి.

1. నువ్వేమైనా పిరికివాడివా? ఎవరికీ కనబడకుండా ఎందుకు దాక్కుంటావూ? ఎవరి ముందుకూ ఎందుకు రావూ?
2. రాత్రింబవళ్లు పూజలు, అర్చనలు చేయించుకుంటూ ఉంటావు. పొగిడించుకోవడమంటే నీకు అంత ఇష్టమా?
3. యేం? నీకు అంత ఆకలిగా ఉంటుందా? జనాల నుండి ఎప్పుడూ మిఠాయి, పాయసం, పాలు, నెయ్యి స్వీకరిస్తూనే ఉంటావూ?
4 నువ్వేమైనా మాంసాహారివా? నోరు లేని పశువుల్ని ఎప్పుడూ బలికోరుతూ ఉంటావూ?
5. నువ్వేమైనా బంగారంతో వ్యాపారం చేసేవాడివా? నీ గుళ్లల్లో ఎక్కడికక్కడ లక్షల టన్నుల బంగారం నొక్కేసుకుంటావ్?
6. నువ్వేమైనా వ్యభిచారివా? ఆలయాల్లో దేవదాసీలను ఉంచుకుంటావ్?
7. ఇంత బలహీనుడివా? నీ ఎదుట రోజూ సమాజంలో జరుగుతున్న రేప్‌లు, శారీరక హింసలు ఆపలేకపోతున్నావ్?
8. నువ్వేమైనా మూర్ఖుడివా? ప్రపంచంలో ఇంత పేదరికం ఉంటే, సమయానికి ఇంత ముద్ద దొరకని పేదలుంటే, అన్నీ చూస్తూ కూడా అన్నం, పాలు, నెయ్యి, నూనె అన్నీ నదుల్లో పారబోయిస్తున్నావ్?
9. నువ్వేమైనా చెవిటివాడివా? అకారణంగా చనిపోతున్న మనుషుల ఆర్తనాదాలు, బలత్కారానికి గురి అవుతున్న పసికూనల ఏడ్పులు, పెడబొబ్బలూ వినిపించడం లేదా?



10. నువ్వేమైనా గుడ్డివాడివా? రోజూ ఇన్నిన్ని అపరాధాలు జరుగుతూ ఉంటే – నీకేమీ కనిపించడం లేదా?
11. నువ్వేమైనా టెర్రరిస్టులతో కుమ్మక్కయ్యావా? ధర్మం పేరుతో ప్రతి రోజూ లక్షల మందిని చంపిస్తున్నావూ?
12. లేక నువ్వే ఓ మతోన్మాదివా? ఉగ్రవాదివా? నిన్ను చూసి అందరూ భయపడుతూ ఉండాలని కోరుకుంటున్నావా?
13. నువ్వేమైనా మాటలు రాని మూగవాడివా? ఏ విషయం గూర్చీ ఒక్క మాట కూడా మాట్లాడవు. కోట్ల మంది లక్షల ప్రశ్నలు గుప్పిస్తున్నా, నీ దగ్గర దేనికీ ఒక్క సమాధానమైనా ఉండదా?
14. నేవ్వేమిటీ? అవినీతిలో అంతగా మునిగిపోయావా? పేద సాదలకు ఎప్పుడైనా, ఏమైనా ఇచ్చావా? ఇవ్వక పోగా, వారు పశువుల్లాగా కష్టపడి సంపాదించిందంతా తెచ్చినీ కోసం ఖర్చు చేస్తున్నారే? నీకేమీ అనిపించడం లేదా?
15. నువ్వెంత మూర్ఖుడివో ఇక్కడే తెలుస్తోంది. అసలు నీ అస్థిత్వాన్నే ఒప్పుకోని మాలాంటి నాస్తికుల్ని పుట్టించావ్. మాతో నానా విధాలుగా తిట్లు తింటున్నావ్ –మాతో రకరకాల విమర్శలు చేయించుకుంటున్నావ్?

పెరియార్ సంధించిన ఈ ప్రశ్నలకు దేవుడు ఎలాగూ సామాధానమివ్వలేదు. వకాల్తా పుచ్చుకుని శివాలూగేవారైనా చెప్పాలి కదా? చెప్పలేదు– పెరియార్ కాలం నుండి ఈ నాటిదాకా ఎవరూ ముందుకు రాలేదు. మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేయడమో, ప్రత్యర్థుల మీద బూతుల వర్షం కురిపించడమో కాదు కావల్సింది. సంధించిన ప్రశ్నలకు అర్థముందా లేదా? ఉంటే మనం కూడా ఆవిధంగా ఎందుకు ఆలోచించడం లేదూ అని ఆత్మవిమర్శ చేసుకోవాలి. బూజు పట్టిన భావజాలాన్ని మార్చుకునే ప్రయత్నం చేయాలి.

ఆత్మాభిమానం గల హేతువాదిగా పెరియార్. భారతీయ సమాజంలోని నిచ్చెనమెట్ల కులవ్యవస్థను తీవ్రంగా నిరసించాడు. అధిక సంఖ్యాకులు శూద్రులుగా అవమానాలకు గురికావడం, మరికొంత మంది అస్పృశ్యులుగా బానిసలకన్నా హీనంగా బతకడం ఆయన సహించలేకపోయాడు. తన పేరుతో కులాన్ని తెలిపే 'నాయకర్'ను వదిలేశాడు. ఆత్మగౌరవద్రవిడ ఉద్యమానికి రూపకల్పన చేశాడు. 'వివేకం ఏ మాత్రం లేని జంతువుల్లో విభజనలు లేవు. బ్రాహ్మణ కుక్క, శూద్ర కుక్క, పరియ(అస్పృశ్య) కుక్క అని విడివిడిగా లేవే? గాడిదల్లో, కోతుల్లో ఇలాంటి విభజనలు లేవే?' –అని పెరియార్ ఆవేదన చెందాడు. హేతువాదమంటే ఏమిటో తెలియని పక్షుల్లో క్రిమికీటకాల్లో విభజనలు లేవు. మరి మనిషి ఆలోచించగల మేధావి కదా? ఇంత నీచమైన విభజన చేసి, అధిక సంఖ్యాకుల్ని ఎందుకు హింసిస్తున్నట్టు? బ్రాహ్మణుడికి గౌరవనీయ స్థానమెందుకూ? అతని కాళ్ళు కడిగి ఆ నీళ్ళు తాగడమెందుకూ? పెళ్ళిళ్ళలో, శోభానకార్యక్రమాల్లో, నామకరణం, గృహప్రవేశం–బతుకులో, చావులో బ్రాహ్మణుడికి ఆధిపత్యపాత్ర ఎందుకుంది? ఎక్కడి నుంచో వలసవచ్చి ఇక్కడి మూలవాసుల మీద, ద్రావిడుల మీద అధికారం వెలగబెడుతున్న ఈ ఆర్య బ్రాహ్మణులు కుట్రలు బట్టబయలు చేయకుండా ఇంకా నిశ్శబ్దంగా భరిస్తూ ఉండాలా? అని ప్రశ్నించాడాయన! బ్రాహ్మణులు చెప్పారనే కదా? వారుచేసిన కుట్రలు గ్రహించకుండా, నిర్జీవ ప్రతిమలకు భజనలు చేస్తూ బతుకు బాగుపడుతుంది – అని అనుకుంటున్నారు. అలా ఎన్నటికీ జరగదు. పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవాల్సిందే!

కొంతకాలం కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెరియార్, అక్కడ బ్రాహ్మణాధిక్యతను భరించలేక బయటికొచ్చాడు. గాంధీతో తీవ్రంగా విభేదించాడు. గాంధీ మోసపూరితంగా హిందూధర్మాన్ని పరోక్షంగా ప్రచారం చేశాడనీ అన్నారు పెరియార్. అస్పృశ్యులు బావుల్లోని నీళ్ళుతాగొద్దంటే, వారికోసం విడిగా బావులు ఏర్పాటు చేయాలన్నాడు. ఆలయ ప్రవేశం కావాలంటే, వారికోసం విడిగా ఆలయాలు నిర్మించాలన్నాడు– గాంధీ. అంతేగాని మనుషులంతా ఒక్కటి అనే భావనలోకి ఆయన రాలేదు. జనాన్ని రానీయలేదు. అందుకే పెరియార్ వేదాల్ని కాల్చేయాలని, విగ్రహాల్ని పగులగొట్టాలని ప్రజలకు సూచించాడు. స్వయంగా తనే వినాయకుడి మట్టి విగ్రహాల్ని తెచ్చి, రోడ్డు మీదికి విసిరికొట్టి –ఇలా చేయడం వల్ల కనీసం రోడ్లయినా బాగుపడతాయని సూచించాడు.

1952లో రాజాజీ 'కుల కల్విథిట్టమ్' అనే పేరుతో ఒక నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాడు. అది కులవారసత్వాన్ని కొనసాగించే ఒక పథకం! అందులో –ఉదయం పిల్లలు పాఠశాలల్లో చదువుకుంటారు. మధ్యాహ్నం నుండి ఇళ్ళకు వెళ్ళి వారి తల్లిదండ్రుల దగ్గర వారి కుల వృత్తిని నేర్చుకుంటారు. వడ్రంగి –వడ్రంగి పని, కంసాలి–కంసాలి పని నేర్చుకుంటే, బ్రాహ్మణ పిల్లలు మంత్రోచ్ఛారణ నేర్చుకోవాలి. కాలం గడుగుస్తున్న కొద్దీ, విద్యావకాశాలు మెరుగవుతున్న కొద్దీ –పెరియార్ లోగుట్టు గ్రహించాడు. కుల విభజనని సమర్థించే ఈ నూతన విద్యావిధానం అనర్థదాయకమని పెరియార్ తీవ్రంగా వ్యతిరేకించాడు. రాజాజీయే స్వయంగా 1954లో ఆ విద్యా విధానాన్ని విరమించుకున్నాడు. రాజాజీ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన కామరాజ్ ఆ విద్యావిధానాన్ని పూర్తిగా నిషేధించాడు. పెరియార్ జస్టిస్ పార్టీ ప్రారంభించకముందు 1926–32 మధ్య కాలంలో మలేసియా, యూరోప్, సోవియెట్ యూనియన్ వంటి అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తను చేపట్టిన ఆత్మగౌరవ ఉద్యమం గురించి, నిరీశ్వరవాదం గురించి ప్రసంగించాడు. 1944లో దానిపేరు ద్రవిడ కజగం–గా మార్చాడు. ఇటీవల సనాతన ధర్మంమీద తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు దేశంలో ఎంతదుమారం లేపాయో మనం చూశాం. అంటే పెరియార్ భావజాలం ఆయన మరణానంతరం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తూనే ఉందన్నమాట! మనువాదుల్ని వణికిస్తూనే ఉందన్నమాట!! ఈ అత్యాధునిక కాలానికి కూడా పెరియార్ అవసరం ఇంకా చాలానే ఉంది. యునెస్కో ఆయనను 'దక్షిణ ఆసియా సోక్రటీస్' అని ఊరికే అనలేదు. ఒక సత్యాన్ని సత్యంగా నిరూపించడానికి సోక్రటీస్ ప్రాణాన్ని త్యాగం చేశాడు. పెరియార్ జీవితాతం అవహేళనకు గురయ్యాడు –సత్యశోధనలో! సత్యస్థాపనలో!!

(17 సెప్టెంబర్. పెరియార్ జయంతి)

(కవి రాజు త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలిగ్రహీత)

# ఇది ముమ్మాటికీ తెలంగాణ విలీనమే...

## హైదరాబాద్ సంస్థానం విలీనంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పాత్ర శూన్యం



బండి సుధాకర్ గౌడ్
టిపిసిసి అధికార ప్రతినిధి
99123 71755

1948లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యే నాటికి ఇంకా పుట్టనే పుట్టని భారతీయ జన తా పార్టీ ... ఇవాళ ముందుకొచ్చి తెలంగాణ విలీనమా? విమోచనా? అని రచ్చ చేయడమంటే, నిస్సిగ్గుగా, చరిత్రను వక్రీకరించడమే. వాస్తవాలను మరిచి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు దేశంకోసం పోరాటాలు చేసి, ఆత్మ బలిదానం చేసిన నాయకుల పేర్లను వాడుకొని వారి ఆత్మఘోషకు కారకులవుతున్నారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 33ఏళ్లకు ఆవిర్భవించింది భారతీయ జనతా పార్టీ. భారత స్వాతంత్ర్య సమరంలోగానీ, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోగానీ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల పాత్ర ఏమీ లేదని చరిత్రను చదివితే తేటతెల్లమవుతున్నది. 1948లో భారతీయ జనతాపార్టీ లేదు, ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ వారెవరూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొనలేదు, వారికి సంబంధమే లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15 తర్వాత దేశమంతటా ఆనందోత్సాహాలు నెలకొన్నప్పటికీ హైదరాబాద్ రాష్ట్రం మాత్రం స్వతంత్రంగానే కొనసాగింది. నిజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేయకుండా ప్రత్యేకంగానే ఉంచే ప్రయత్నం చేశాడు. దీంతో హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నిజాం పాలనలో రజాకార్లు ప్రజలపై హింసాత్మక దాడులు చేయడం మొదలుపెట్టారు. ఈ హింసను అరికట్టడంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నుంచి స్వామి రామానంద తీర్థ తదితరులు, ఆంధ్ర మహాసభ నుంచి మాడపాటి హన్మంతరావు, రావి నారాయణ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, సురవరం ప్రతాప రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, దాశరథి కృష్ణమాచార్య, సూసర్ల శ్రీరామ నర్సింహ, పులిజాల వెంకట రంగారావు, కాళోజీ నారాయణరావు, బత్తిని మొగిలయ్య గౌడ కొండా వెంకట రంగారెడ్డి, వట్టికోట ఆల్వార్ స్వామి, తదితర అనేకమంది వీర తెలంగాణ యోధులు సాయుధ రైతాంగ పోరాటం చేశారు. ఈ సుదీర్ఘ ధిక్కార పోరాటాన్ని గమనించిన ఇండియన్ యూనియన్ ప్రభుత్వం జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో ఒక రాజకీయ పరమైన నిర్ణయం తీసుకున్నది. ఫలితంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి పర్యవేక్షణలో ఆపరేషన్ పోలో సైనిక చర్యను ప్రారంభించి, ఖాసీం రజ్వీ అరాచకాలకు అడ్డుకట్టవేసి, హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకున్నది. దీంతో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎదుట నిజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగిపోగా, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో భాగంగా కలుపుకొన్నారు. చరిత్ర, వాస్తవాలన్నీ ఇలా ఉంటే,ఆనాటికి ఇంకా పుట్టనే పుట్టని భారతీయ జనతా పార్టీ ... ఇవాళ ముందుకొచ్చి తెలంగాణ విలీనమా? విమోచనా? అని రచ్చ చేయడం వారి దివాళాకోరు తనానికి ఖచ్చితంగా నిదర్శనమే. 1925లో ఏర్పాటైన ఆర్‌ఎస్‌ఎస్ హెగ్డేవార్, సావర్కర్, గోల్వాల్కర్ లు ఏకంగా భారత యువత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారంటే ఇవాళ మనందరికీ ఆశ్చర్యం కలగక మానదు. ఇది చరిత్ర చెబుతున్న నిజం. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు మాత్రం దేశంకోసం బలిదానం చేసిన నాయకుల పేర్లను వాడుకొంటుంటే వారి ఆత్మలు ఘోషిస్తున్నాయి. 1948లో అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించారు. దీంతో 1951లో జనసంఘ్ పేరుతో పార్టీని తెరపైకి తెచ్చి, దాని రూపాంతరంగా 1980లో భారతీయ జనతాపార్టీని నెలకొల్పారు. దేశంకోసం ఎవరు పనిచేశారో, స్వార్థ రాజకీయాల కోసం ఎవరు పనిచేస్తున్నారో ఇపుడు చెప్పండి. చరిత్ర అంటే చెరిపేస్తే చెరగని సత్యం. దాచేస్తే దాగని నిజం. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పాత్ర లేకున్నా మతతత్వాన్ని రెచ్చగొట్టి లబ్ధి పొందాలనే బిజెపి ప్రయత్నాలు వృథా ప్రయాసగానే మిగిలిపోతాయి. ఎవరు అవునన్నా, కాదన్నా సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినమే.

# సురవరం...
# నిత్య సూర్యోదయం..!

ఆయన
అస్తమించారని...
పత్రికలన్నీ..
ప్రధాన శీర్షికల ఉపరితలాన
ఎరుపెక్కిన పద విన్యాసాల
అక్షర ప్రవాహాలై ప్రతిధ్వనిస్తుంటే
నాకు ఆశ్చర్యమేసింది...!


సురవరం సార్...
జన మనసుల విప్లవ గగనాన
సూర్యోదయపు స్ఫూర్తి గీతమై
ప్రజా హక్కుల పోరాటాన
గళమెత్తిన స్వర ప్రభంజనమై..
జీవన తరంగాల
ప్రకాశమంతా కమ్యూ'నిజమై'..
తనువంతా 'గాంధీ ఆసుపత్రిలో'
పరిశోధనా నిమిత్తమై...

ఆస్తి మొత్తం పేద పిల్లల
వైజ్ఞానిక విద్యా ప్రభావితమై..
నవతరపు హృదయాల్లో
లౌకిక తత్వపు అరుణారుణవనమై...
ఇలా...ఇల అంతటా..
ఓ సాహస ఉద్దీప శిఖరమై
ఉద్యమిస్తూనే ఉన్నారు..!
తెలంగాణ నినాదాల
వెలుగుల పద్య కిరణాల కవిత్వమై
అను నిత్యం సామాన్యుని
పక్షాన పోరాడే చైతన్య
తారల సమూహమై
వామపక్ష భావజాల
తత్వపు నవ్య పథాన
దిక్సూచి యంత్రమై
విజయలక్ష్మి గుండె గుడిలో
కామ్రేడ్ సమర రథపు
ప్రేమ చిహ్నమై
సమానతపు కలల తీరాన
నిలువెత్తు నిగ్రహమై
విగ్రహమై నిలిచే ఉన్నారు..!

సుధాకర గాత్ర గాంభీర్యానికి
యువతరపు ప్రేరణ వందేమాతరానికి...
అస్తమయ నీడలంటవు..!
మరణ జ్వాలలు మండవు..!!

అనునిత్యం ఉదయిస్తూనే
మనందరి చిరునవ్వుల
ఇంద్రధనుస్సుగా విప్లవిస్తూనే
మళ్లీ మళ్లీ పుడుతూనే ఉంటారు
మరణం లేకుండానే..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536





చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21-25 సెప్టెంబర్, 2025

చండీఘడ్ (పంజాబ్)

## 20వ కాంగ్రెస్, (హైదరాబాద్, 2008)

ఈ జాతీయ మహాసభ (కాంగ్రెస్) 2008 మార్చి 23–27 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగింది. యుపిఎ ప్రభుత్వానికి పార్టీ తోడ్పాటు కొనసాగుతున్నప్పటికీ వైరుధ్యాలు పెరుగుతున్నాయి. పార్టీకి స్వతంత్ర ప్రతిష్టను, ప్రజాపునాదిని నిర్మించుకోవటంపై ఎక్కువగా దృష్టి సారించాలని కాంగ్రెస్ వక్కాణించింది. ప్రజా సంఘాల పునాదిని విస్తరించాలని నిర్ణయించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి అనుకూలంగా సిపిఐ నిర్ణయం తీసుకుంది ఈ మహాసభలోనే.

ఎ.బి.బర్ధన్ ప్రధాన కార్యదర్శిగా, సుధాకరరెడ్డి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

ఇదిలావుండగా పార్టీ కాంగ్రెస్ అనంతరం అమెరికాతో అణుశక్తి సహకార ఒప్పందం సమస్యపై యుపిఎ ప్రభుత్వంతో కమ్యూనిస్టులకు భిన్నాభిప్రాయాలు పెరుగుతూ వచ్చాయి. అధిక ధరలు, నిరుద్యోగం తదితర అంశాలను చూపుతూ అమెరికాతో అణు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష సంఘటన మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరించింది. అయితే అమెరికాతో అణు సహకారం కోసం తన పదవిని ఫణంగా పెట్టటానికైనా సిద్ధపడిన మన్మోహన్‌సింగ్ 2008 జులై 22న లోక్‌సభలో తాను ప్రవేశపెట్టిన విశ్వాసతీర్మానాన్ని 275–256 ఓట్లతో నెగ్గారు. 10మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. ములాయంసింగ్ సమాజ్‌వాదిపార్టీ తోడ్పాటుతో, భాగస్వామ్యంతో ప్రభుత్వం కొనసాగింది.

యుపిఎ పాలనలో అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్న మధ్యతరగతుల్లో ఈ అణు ఒప్పందం ఘటనతో డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు ఆదరణ పెంపొందగా, కమ్యూనిస్టులకు ప్రజాదరణ తగ్గింది. కమ్యూనిస్టులు ప్రజాసమస్యలపై ముందునుండి పోరాటాలు చేయకుండా, అణు ఒప్పందాన్ని పూర్తిగా వ్యతిరేకించటం ప్రజల మనోభావాలకు వ్యతిరేకమవుతుందని భావించి ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరణకు వాటిని కారణాలుగా చెప్పారనే భావన ఏర్పడింది. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు పూర్తి మెజారిటీ ఇవ్వటాన్ని అణు ఒప్పందంపై తన వైఖరికి ప్రజల మద్దతుగా భావించారు మన్మోహన్ సింగ్. అయితే మరో ఐదేళ్ల తదుపరి ప్రజలు అధికారాన్ని నరేంద్రమోదీ నాయకత్వంలో పచ్చి మితవాద, మతవాద పార్టీ బిజెపికి అప్పగించారు. అది వేరు విషయం.

## 21వ కాంగ్రెస్ (పట్నా, 2012)



సిపిఐ 21వ జాతీయ మహాసభ (కాంగ్రెస్) 2012 మార్చి 27–31 తేదీల్లో పట్నాలో జరిగింది. రాజకీయ తీర్మానం, రాజకీయ సమీక్ష నివేదిక, నిర్మాణ నివేదికలను అది చర్చించింది. సభ్యత్వరుసుము, కార్యదర్శుల పదవీకాలం వగైరా అంశాలకు సంబంధించి పార్టీ నిబంధనావళికి కొన్ని సవరణలు ఆమోదించింది. విస్తృతమైన వామపక్ష, ప్రజాతంత్ర ఐక్యతకు కృషి చేయాలని నిర్ణయించింది. వామపక్ష ఐక్యత మరింత పారదర్శకంగా ఉండాలని కోరుకున్నది.

పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎ.బి.బర్ధన్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన పార్టీ కాంగ్రెస్, కొత్త ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకరరెడ్డిని ఎన్నుకుంది.

## 22వ కాంగ్రెస్ (పుదుచ్చేరి, 2015)

ఈ కాంగ్రెస్ నాటికి దేశ రాజకీయాలు పూర్తిగా మితవాద మలుపు తీసుకున్నాయి. యుపిఎ రెండవ ప్రభుత్వకాలంలో అవినీతి కుంభకోణాలు, అసమర్థ పాలనపై ప్రజల ఆందోళనల నేపథ్యంలో 2014 ఏప్రిల్–మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను ఓడించి తొలిసారి మతోన్మాద భారతీయ జనతాపార్టీకి పట్టం కట్టారు. ఆ ఎన్నికల్లో బిజెపికి 31శాతం ఓట్లతో 282 లోక్‌సభ సీట్లు లభించగా, ఎన్‌డిఎ కూటమికి 336 సీట్లు లభించాయి. వాజ్‌పేయితో కలిసి పార్టీని ఇంత అభివృద్ధిలోకి తెచ్చిన ఎల్.కె.అద్వానీని పక్కనబెట్టి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీని ప్రధాని అభ్యర్థిగా ఆర్‌ఎస్‌ఎస్ నిర్ణయించింది. 75 ఏళ్ల వయస్సును క్రియాశీల రాజకీయాలనుంచి రిటైర్మెంట్ వయస్సుగా అది ఒక లక్ష్మణరేఖ గీసింది. (అయితే ఈ నెలలో ఆ వయోపరిమితిలో ప్రవేశించిన ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్, ప్రధాని నరేంద్రమోదీలను కొనసాగిస్తున్నది – అది వేరు విషయం.)

ఈ అధికార మార్పిడి ప్రజలు ప్రజాస్వామికంగా ఎన్నుకున్న ఒక పార్టీనుండి మరో పార్టీకి మారటం వంటిది కాదని కమ్యూనిస్టుపార్టీ నిర్ధారణకు వచ్చింది. కార్పొరేట్ అనుకూల మితవాద, మతవాద శక్తులను అధికారం నుంచి తొలగించాలని, ప్రజల ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని పార్టీ కాంగ్రెస్ పిలుపు ఇచ్చింది. అది కొత్త 'పార్టీ కార్యక్రమం' ఆమోదించింది. శాశ్వత కార్యక్రమం కమిషన్‌ను నియమించింది.

2015 మార్చి 25–29 తేదీల్లో జరిగిన ఈ 22వ పార్టీ కాంగ్రెస్‌కు 819 మంది డెలిగేట్లు, ప్రత్యామ్నాయ డెలిగేట్లు హాజరైనారు.

ఎస్.సుధాకరరెడ్డి ప్రధాన కార్యదర్శిగా, గురుదాస్ దాస్ గుప్తా డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినారు.

## 23వ కాంగ్రెస్ (కొల్లాం, 2018)

సిపిఐ 23వ కాంగ్రెస్ 2018 ఏప్రిల్ 25–29 తేదీల్లో కొల్లాం (కేరళ)లో జరిగింది. 810మంది ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐని సంస్థాగత నిర్మాణం రీత్యా, ప్రజా ఉద్యమాల నిర్మాణం ద్వారా పటిష్టవంతం చేయాలని కాంగ్రెస్ వక్కాణించింది. వామపక్ష ఐక్యతను విశాల ఐక్యతకు పోటీ పెట్టరాదని రాజకీయ తీర్మానం స్పష్టం చేసింది. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ లౌకిక, ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీస్తూ హిందూత్వ ఆధిపత్య స్థాపనకై ఏకపక్ష పోకడలు పోతున్నదని విమర్శించింది. దాన్ని అధికారం నుంచి తొలగించేందుకై లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులన్నింటి ఐక్యత ఆవశ్యకతను నొక్కిచెప్పింది.

మహాసభ ఎన్నుకున్న నూతన జాతీయ సమితి సమావేశమై ఎస్.సుధాకర్‌రెడ్డిని పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది. కామ్రేడ్ సుధాకర్‌రెడ్డి అనారోగ్యం కారణంగా 2019 జులైలో జాతీయసమితి సమావేశంలో ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా సమర్పించారు. కామ్రేడ్ డి.రాజా ఆ స్థానంలోకి ఎన్నుకోబడ్డారు.

## 24వ కాంగ్రెస్ (విజయవాడ, 2022)

సిపిఐ 24వ జాతీయ మహాసభ (కాంగ్రెస్) 2022 అక్టోబర్ 14 నుంచి 18వరకు విజయవాడలో జరిగింది. 2019 ఏప్రిల్ – మేలో సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ నాయకత్వంలో నరేంద్రమోదీ రెండవ పర్యాయం ప్రధానమంత్రి పదవి చేబట్టాక – రాజ్యాంగ, ప్రజాస్వామిక, ఫెడరల్ విలువలపై హిందూత్వవాదుల దాడి పెచ్చుపెరిగింది. ఆ ఎన్నికల్లో బిజెపికి లోక్‌సభలో సీట్లు పెరిగి (282 నుంచి 333 సీట్లు; ఓట్లు 2014లోని 31శాతం నుంచి 37.36 శాతం) ఏకపక్ష ఆధిపత్య పరిపాలన మొదలుపెట్టింది. కమ్యూనిస్టు పార్టీలకు అతితక్కువ స్థానాలు (సిపిఐ–ఎం.3, సిపిఐ2) లభించాయి. కాంగ్రెస్ సంఖ్యాబలం 52. మైనారిటీల పట్ల వివక్ష, నిందారోపణలు, ఎస్‌సి, ఎస్‌టి, మహిళల హక్కుల్లోకి చొరబాటు, సమాజంలో మతపరమైన విభజన, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, రాజ్యాంగంపై దాడి తరచూ జరుగుతున్నది. ఇదిలా ఉండగా, 2019 నవంబర్ 9న అయోధ్యలోని రామజన్మభూమి–బాబ్రీమసీదు స్థల వివాదం కేసులో సుప్రీం కోర్టు రామజన్మభూమికి అనుకూలంగా చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ముస్లింలకు వేరేచోట 5ఎకరాలు స్థలం కేటాయించాలని ఆదేశించింది. హిందూత్వ శక్తులు పైశాచికానందంతో పెచ్చరిల్లాయి. గోరక్షణ పేరుతో ముస్లింలపై దాడులు, ద్వేష, దూషణ ప్రసంగాలు పెరిగాయి.

ఈ పరిస్థితుల్లో సిపిఐ స్వతంత్రంగా ప్రచారాందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు కృషి చేసింది.

ఇదిలా వుండగా, వ్యవసాయాన్ని కార్పొరేటీకరించే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం 2020 సెప్టెంబర్‌లో పార్లమెంటు ఆమోదం పొందిన మూడు రైతు వ్యతిరేక చట్టాలపై దేశ రైతాంగం తిరుగుబాటు చేసింది. అఖిలభారత కిసాన్ సంఘర్ష సమితి సమన్వయ కమిటీ ఢిల్లీ సరిహద్దులు దిగ్బంధించి సుదీర్ఘ కాలం సాగించిన నిరవధిక ఆందోళన, 2021 నవంబర్ 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ వివాదాస్పద రైతు చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించటంతో అప్పటికి ముగిసింది. అయితే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ గ్యారంటీ ఇస్తామన్న హామీని ప్రధాని నేటివరకు అమలు చేయలేదు. వివిధ రూపాల్లో రైతు ఆందోళన సాగుతోంది. ఈ రైతు ఉద్యమంలో సిపిఐ మార్గదర్శకంలోని అఖిలభారత కిసాన్ సభ సముచిత పాత్ర పోషించింది. మరోవైపున, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 10వ వామపక్ష కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, స్వతంత్ర యూనియన్‌లు, అసోసియేషన్‌లు దఫదఫాలుగా విజయవంతంగా దేశవ్యాప్త ఆందోళన సాగిస్తున్నాయి.

ఈ మధ్యలోనే కోవిడ్ మహమ్మారి దేశంపై దాడిచేసి కల్లోలం సృష్టించింది. లక్షల సంఖ్యలో ప్రజలు చనిపోయారు.

ఈ నేపథ్యంలో 2022 అక్టోబర్‌లో జరిగిన సిపిఐ విజయవాడ కాంగ్రెస్ ప్రజా సంఘాలను పటిష్టం చేయాలని, వివిధ విభాగాల ప్రజారాసులను సంఘటితపరిచి ఉద్యమాలు నిర్మించాలని నిర్ణయించింది. ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి దుష్టపాలనకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఒక్కతాటిపైకి తేవాలని నిర్ణయించింది.

కామ్రేడ్ డి.రాజాను పార్టీ ప్రధాన కార్యదర్శిగా జాతీయసమితి తిరిగి ఎన్నుకుంది.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సత్కారం



ప్రజాపక్షం/చర్లపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న 13 మందిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది అన్నిరంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేల క్ష్మారెడ్డిని ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించి మెమోంటోను అందించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ నర్సింహా, ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడలో ఉపాధ్యాయులకు సత్కారం




ప్రజాపక్షం/దమ్మాయిగూడ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆహ్మద్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు,ఎంఇఓ,ఉపాధ్యాయులను మాజీ వార్డు సభ్యులు కొత్త భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాలానుగుణంగా విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాండుగౌడ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ భవనాన్ని కేటాయించాలి

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తుంకి రమేష్ వినతి

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామపంచాయతి కార్యాలయాన్ని ప్రజాపాలనకు కేటాయించాలని శామీర్‌పేట కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ తుంకి రమేష్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తకు గ్రామస్థులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతి భవనాన్ని డిస్పెన్సరికి కేటాయించడం మానుకోవాలని అన్నారు. పెరుగుతున్న జనాబాకు అనుగుణంగా గ్రామప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిపాలనకు వేదికగా ఈ కార్యాలయాన్ని వాడుకోవడానికి వీలు ఉందని తక్షణమే కలెక్టర్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజి సర్పంచ్ ఎల్ల మల్లేష్, అబ్బగౌని బాస్కర్‌గౌడ్, అనిల్‌గౌడ్, కొండూరు నర్మద, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




## ఇంజనీర్లు లేనిదే దేశ ప్రగతి లేదు

ప్రజాపక్షం/చర్లపల్లి: ఇంజనీర్లు లేనిదే దేశ ప్రగతి లేదని లయన్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి అన్నారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఇంజనీర్స్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కార్యక్రమం నిర్వహకులు సభాధ్యక్షులు లయన్ పొలాస రమేష్ అధ్యక్షతన చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ భవనంలో ఇంజనీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీర్ నాగేందర్, బాలకృష్ణ, అన్వర్ బాషా, చర్లపల్లి విద్యుత్ ఎడిఇ రాందాస్, ఎఇలు రామకృష్ణ, రవీందర్, ఎన్ఎఫ్‌సి సిఈఓ డాక్టర్ శెట్టి, గేట్ వైస్ చైర్ పర్సన్ పాస్ట్ డిస్టిక్ట్ గవర్నర్ హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాపక్షం/ఉప్పల్ : విద్యుత్ స్తంభంపై ఉన్న పాత సర్వీస్ వైర్‌ను తొలగించే సమయంలో విద్యుత్ ఘాతంతో రోజువారి కూలీ మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే విద్యా నగర్ నరసింహ కాలనీలో నివాసం ఉండే బాణోత్ సేవ్య నాయక్ (47 ) రామంతాపూర్ సెక్షన్ లోని విద్యుత్ శాఖ లో లింగా నాయక్ అనే విద్యుత్ కాంట్రా క్టర్ వద్ద రోజువారీ కూలీగా పని చేస్తుంటాడు. ఈ సందర్భంగా మంగళ వారం రోజువారీ పనిలో భాగంగా రామంతా పూర్, గణేష్ నగర్ విద్యుత్ స్థంభంపై ఉన్న పాత సర్వీస్ వైర్‌ను తొలగించేందుకు విద్యుత్ స్థంభం ఎక్కిన సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ స్థంభం పై నుండి కింద పడడంతో వెంటనే స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తమకు న్యాయం కావాలంటూ బంధువులు ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహిం చారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



## గంజాయి నియంత్రణకు స్పెషల్ సర్చ్

### డిఐజి తఫ్సీర్ ఇక్బాల్

ప్రజాపక్షం/వికారాబాద్:జిల్లాలో ఎక్కడైన గంజాయి ఉన్నట్లు, విక్రహిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని డిఐజి చార్మినార్ జోన్6వజోన్ తఫ్సీర్ ఇక్బాల్ చెప్పారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లాలోని చోన్గోముల్ పోలీసు స్టేషన్‌ను, భవన పరిసరాలను పరిశీలించిన డిఐజి పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు కేసుల వివరాలు వివిధ రిజిస్టర్లను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి తప్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నియంత్రణకు పకడ్బందీ చర్యలతో పాటు ప్రత్యేక తనిఖీలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భధ్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జిల్లా ఎస్.పి. కెనారాయణరెడ్డి ఆధ్వర్యాన జిల్లా పోలీసులు అధికారులు చాలా బాగా పని చేస్తున్నారని ప్రసంశించారు. చెన్గోముల్ పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను తర్వగా పరిష్కరించాలని, కేసులలో కన్విక్షన్ రేటును పెంచాలని ఆదేశించారు. పోలీసు అధికారులు ప్రజలలో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలో విలేజ్ పోలీసు అధికారులను నియమించి ప్రజలతో మమేకమైన సైబర్ క్రైమ్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైన గంజాయి ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే స్పెషల్ సెర్చ్ ఆపరేషన్లు, నార్కోటెక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డిఐజి పోలీసు స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తర్వగా పరిష్కారించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకారంలో స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కె.నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ బి.రాములునాయక్, పరిగి డిఎస్‌పి ఎస్ శ్రీనివాస్, పరిగి సిఐ శ్రీనివాస్‌రెడ్డి, చెంగోముల్ ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్ లోని హనుమాన్ ఆలయం వద్ద దుర్గామాత విగ్రహన్ని ఏర్పాటు చేయుటకు ముందుగా ద్వజస్తంభాన్ని ఉత్సవ కమిటి సభ్యులు మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. ముందుగా శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గణపతి దేవతామూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామికి చందనాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గోమాతతో నవరాత్రుల ఉత్సవ వేదికను శుద్ధి చేసుకుని ద్వజస్తంభాన్ని వేద మంత్రోచ్చరణలతో ప్రతిష్టించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటి చైర్మన్ వీరేశం గుప్త, తదితరులు పాల్గొన్నారు.

# మా బిడ్డల భవిష్యత్తుతో రాజకీయమా?

- రూ.3 కోట్లు ఎక్కడివి? ఎవరు కొన్నారు?
- ఆధారాలుంటే నిరూపించండి..
- ఎలాంటి విచారణకైనా సిద్ధమే
- గ్రూప్‌– 1 క్వాలిఫైడ్ అభ్యర్థుల తల్లిదండ్రులు



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : గ్రూప్‌– 1 ఉద్యోగాలు రూ.3కోట్లకు అమ్ముకొన్నారంటూ ఓ పార్టీ నేతలు రాజకీయలబ్ధికోసం మాట్లాడటం సరికాదని, వాస్తవమైతే నిరూపించాలని, తాము ఎలాంటి విచారణకైనా సిద్ధంగానే ఉన్నామని గ్రూప్‌– 1 క్వాలిఫైడ్ అభ్యర్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్వార్థ రాజకీయాల కోసం ఓ పార్టీ నేత 563 మంది అభ్యర్థుల జీవితాలను ఆగం చేయొద్దని కోరారు. అసత్యపు ఆరోపణలతో తమ పిల్లలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయొద్దనికన్నీంటి పర్యంతమయ్యారు.

మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలువురు గ్రూప్‌– 1 క్వాలిఫైడ్ అభ్యర్థుల తల్లిదండ్రులు పావని(రంగారెడ్డి జిల్లా), సలాం (పెద్దపల్లి జిల్లా), కె.ఆనంద్‌కుమార్, ఎన్.పద్మజ (హైదరాబాద్), ఎస్. రఘువీర్(హనుమకొండ), గద్దల అమృతరావు(జనగామ), వెంకటరమణ (నల్లగొండ), లావణ్య (నిజామాబాద్), కల్పన (ఖమ్మం) మీడియాతో మాట్లాడారు. ప్రతి అభ్యర్థి ఏళ్లతరబడి కష్టపడి చదువుకొన్నారని, రూ3 కోట్లు పెట్టి ఉద్యోగం కొనే స్థోమత ఇక్కడకొచ్చిన కుటుంబాల్లో ఎవరికి లేదన్నారు. తమ పిల్లలను సంస్కారంతో పెంచి, పట్టుదలతో చదవిస్తే ఇప్పుడు రోడ్డునపడ్డట్టు అనిపిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. "పోస్టులు కొనుక్కొన్నామన్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమే. నిందలు వేసి మమ్ముల్ని మనోవేదనకు గురిచేయొద్దు. అన్ని పార్టీల నేతలు సహకరించి, మా బాధలు అర్థం చేసుకోవాలి. లేనిపోని దుష్ప్రచారాలను వ్యాప్తిచేయకుండా వాస్తవాలు తెలియజేయాలి. మా పిల్లలు ఎంతో కష్టపడి గ్రూప్‌–1 ర్యాంకు సాధించారు. రాజకీయాలు చేయడం మానుకోండి. మాకు న్యాయం చేయాలి" అని వేడుకొన్నారు.

**రూ.10వేల జీతంచేస్తున్న...**
**3కోట్లతో ఉద్యోగం కొంటానా?**

నా భర్త చనిపోతే ఓ పాఠశాలలో రూ.10 వేల జీతానికి పనిచేస్తున్న. రూ.30వేలు ఎప్పుడూ కళ్లతో చూడలేదు. రూ.3కోట్లకు ఉద్యోగం కొన్నట్టు నిరూపిస్తే నా మరణ శాసనం నేనే రాసుకొంటా. మా అబ్బాయికి అలాంటి ఉద్యోగం కూడా వద్దు అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

*366వ ర్యాంకర్ తల్లి*

**కూలీ పనులు చేసి నా బిడ్డను చదివించా**

నా బిడ్డ ఎంతో కష్టపడి చదివి ర్యాంకు సాధిస్తే కొంతమంది స్వార్థపరులు గ్రూప్‌– 1ను రాజకీయం చేస్తున్నారు. ఇప్పుడు చాలా బాధగా ఉన్నది. రూ.3కోట్లు కాదు, రూ.30లక్షలు కూడా బ్యాంక్ బ్యాలెన్స్ కూడా చూడలేదు. రాత్రిపగలు తేడాలేకుండా కూలి పనులు చేసుకొంటూ నా బిడ్డను చదివించా.

*– లలిత, 67వ ర్యాంకర్ తల్లి*

**రాజకీయ నేతలది దుష్ప్రచారం**

రాజకీయ నేతలు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి నా బిడ్డను చదివిస్తే రూ.3కోట్లకు ఉద్యోగాలు కొన్నామని నిందలు వేస్తున్నారు. ఫలితాలొచ్చాక రాజకీయ చేస్తూ పిల్లల జీవితాలతో ఆటలాడుతున్నారు. ఇకనైనా మమ్ముల్ని మనోవేదనకు గురిచేయొద్దు.

*– 46వ ర్యాంకర్ తండ్రి ఆవేదన*

**ఆధారాలు చూపించాలి**

ఉద్యోగం అమ్మింది ఎవరు? కొన్నది ఎవరు? ఆధారాలు చూపించాలి. నా కుమారుడికి గతంలో ఎస్ఐ ఉద్యోగం వస్తే గ్రూప్‌–1 కోసం చదివించాను. ఇప్పుడు ఇలా నిరాధార ఆరోపణలు చేయడం అన్యాయం.

*– విఠల్‌రెడ్డి, 60వ ర్యాంకర్ తండ్రి.*

## రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో లిఖించబడింది

### సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్




ప్రజాపక్షం/తాండూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే స్వర్ణాక్షరాలతో లిఖించబడిందని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. తెలంగా ణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో సందర్భంగా మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం పరిధి అంబేద్కర్ చౌక్ లో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం బాల్‌రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, ఆనాటి పోరాటానికి నాయకత్వం వహించిన ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, ధర్మబిక్షం, కొమురం భీమ్ వంటి అనేట నాయకులకు తాండూరు నియోజకవర్గం సిపిఐ పార్టీ ఆధ్వర్యాన విప్లవ జోహర్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ కమ్యూనిష్టు పార్టీ నాయకులు ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచి వారితో నిజాం రజాకార్లు, జమీదాంరులు, జాగీర్దారులు, దొరల వ్యతిరేకంగా పోరాటాన్ని చేశారని గుర్తు చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తెలంగాణకు మాత్రం నిజాం నియంతృత్వ పాలన సంవత్సర కాలం పాటు కొనసాగిందని గుర్తు చేశా రు. ఆంధ్ర మహాసభల పేరిట నాయకులు తమ భూమి పేదలకు పంచి 3500 గ్రామాలను విముక్తిచేసి పదిలక్షల ఎకాల భూమిని పేదలకు పంచడం జరిగిందన్నారు. 4వేల 500మంది రక్త తర్ప ణం, ఎన్నో త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనానికి పోరాటం కొనసాగిందని, దీనిని ఎవ్వరు మార్చ లేరని, దుర్బుద్ధితో ప్రయత్నాలు మాత్రం చేయగలరని, ఇది వారి అధికార దాహానికి పరాకాష్టకు నిదర్శమని అభివర్ణించారు. మత విద్వేషాలతో ప్రజలకు ఎలాంటి మేలుజరగదని, ప్రజలకు ఉపయోగపడే ప్రజాపాలనను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు నసీమాబేగం, లుక్మాన్, తదితరులు పాల్గోన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టియుడబ్ల్యుజె(ఐజెయు)ఎల్లవేళలా కృషి



ప్రజాపక్షం/నిజాంపేట్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టియుడబ్లుజె(ఐజెయు) ఎల్లవేళలా కృషి చేస్తుందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా టియుడబ్లుజె అధ్యక్షులు గడ్డమీది బాల్‌రాజ్ గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సూరారంలోని కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో నియోజకవర్గం టియుడబ్లుజె(ఐజెయు) కార్యవర్గ సమావేశం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కోటగడ్డ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటూరు శేఖర్, వెంకటేశ్వర్లు, దయాకర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కుంట అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్‌రాజ్‌కి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సాయిబాబా, కోశాధికారి శేషారెడ్డిలు సభ్యుల సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా కొనసాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు అల్లు రాజేంద్ర కుమార్, కల్కిమూర్తి, ఎల్లంపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ పాదయాత్ర




ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ప్రజా సమస్యలపై కార్పొరేటర దొడ్ల వెంకటేష్ గౌడ్ పీజెఆర్‌నగర్, ఎల్లమ్మబండలో మంగళవారం పాదయాత్ర చేశారు. 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజెఆర్‌నగర్ కాలనీలలో డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను స్థానిక కాలనీ వాసులు కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్ళారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక సమస్యలపై కాలనీలలో పాదయాత్ర చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యను అతిత్వరలోనే పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. డ్రైనేజీ లైన్స్‌కు సంబంధించిన అవసరమైన బడ్జెట్ ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని సంబంధిత అధికారుతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య సమ స్య ఎక్కువగా ఉందని, చెత్తను రోడ్లపై వేయకుండా పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుగా బస్తీకి వచ్చే చెత్త సేకరణ ఆటోలో మాత్రమే వేయాలన్నారు. జిహెచ్ఎం సి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లపై పడేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని అన్నా రు. ఇంటికి వచ్చి సేవలు అందించే పారిశుధ్య, ఎంటమాలజీ, వైద్య శాఖలకు సంబంధించిన సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.రవి, సిహెచ్ భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, చంద్రయ్య, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుంది

### ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని శారీరక దృడత్వానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా ఆర్‌టిఎ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటి బొమ్మరాశిపేటలోని శాంతినికేతన్ విద్యాలయంలో 69వ ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ సెలెక్షన్స్ అండర్ 14, అండర్ 17 విభాగంలో జోనల్ స్థాయి క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలకు ప్రాముఖ్యతనివ్వాలని, మొబైల్ ఫోన్‌లకు పరిమితం కాకూడదని చెప్పారు. గెలుపోటములు సహజమని ఓటమికి కృంగిపోకుండా విజయం దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం జోనల్ కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లా స్థాయి అండర్ 17 విభాగంలో మొదటి స్థానంలో నిలిచామని అదే ఒరవడిని కొనసాగిస్తు ఈ సంవత్సరం కూడ ఆదే ఫలితం వచ్చేలా అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ప్రతి ఒక్క క్రీడాకారుడు కష్టపడాలని చెప్పారు.

ఈ సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో జరుగబోయే మేడ్చల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ విద్యాలయ ప్రిన్సిపల్ దీపక్‌రతన్, వ్యాయామ ఉపాధ్యాయులు మదన్‌మోహన్‌రెడ్డి, నరేష్, రాజశేఖర్, క్రికెట్ కోచ్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.






## తుర్కపల్లి సిపిఐ నాయకుడు ఊరడి నర్సింహ మృతి

### నివాళులర్పించిన డిజి సాయిలుగౌడ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లికి చెందిన ఊరడి నర్సింహా సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి మంగళవారం వయోభారంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు డిజి సాయిలుగౌడ్, మూడుచింతలపల్లి మండల కార్యదర్శి తప్పెట్ల రాములు గౌడ్‌లు ఊరడి నర్సింహా భౌతిక కాయానికి పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ ఊరిడి నర్సింహ భూపోరాటాల్లో చురుకుగా పాల్గొని అనేక సమస్యలను పరిష్కరించారని అన్నారు. మృతుడి భార్య కమలమ్మ కొడుకు శ్రీనివాస్‌లను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియల కార్యక్రమంలో తుర్కపల్లి మాజి సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, శామీర్‌పేట గ్రామశాఖ కార్యదర్శి సోగడా రమేష్, ఊరడి యాదగిరి, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

## అక్రమ నిర్మాణాలను తొలగించండి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : ప్రభుత్వ స్థలాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని బాచుపల్లి మండల సిపిఐ కార్యద ర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాం డ్ చేశారు. రాష్ట్ర మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో శ్రీనివాస్ నిజాంపేట్‌లోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వేనంబరు 233/15లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలుమార్లు రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణలను తొలగించి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశి, యాదయ్య, దస్తగిరి పాల్గొన్నారు.








## అంబేద్కర్, బుద్ధ విగ్రహాలను ప్రతిష్టించాలి

### దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : లక్షకు పైగా ఎస్సీ జనాభా ఉన్న మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం, బుద్ద విగ్రహాలను ప్రతిష్టించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం కోరారు. దీంతో పాటు 2 వేల గజాల స్థలాన్ని కేటాయించి కమ్యూనిటీ హాలు, పార్కు ఏర్పాటు చేయాలన్నారు.

ఆయనతో పాటు దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు మల్లేష్, యాదయ్య, మేకల నగేష్‌లతో పాటు ఆయన మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి, ప్రజావాణిలో తెలంగాణా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చెన్నారెడ్డిని కల్సి ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాలను సమర్పించారు.




## సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనది : ఎంఇఒ భాగ్యమణి

ప్రజాపక్షం/శామీర్‌పేట : విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం ఉందని మూడుచింతలపల్లి మండల విద్యాధికారి భాగ్యమణి అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండల విద్యాధికారి భాగ్యమణి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఇఒ, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శాలువాలతో, పూలమాలలో ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులైన రేణుకారెడ్డి, ప్రశాంతి, జీవనజ్యోతి, సంధ్యారాణిలను ఎంఇఒ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తు సన్మానాలను చేయడం జరుగుతుందని, దీంతో ఉపాధ్యాయులపై మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. విద్యార్థులను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొల్తూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగరావు, లక్ష్మాపూర్ హెచ్ఎం శంకర్, కేశ్వాపూర్ హెచ్ఎం శ్రీనివాస్, మూడుచింతలపల్లి హెచ్ఎం సంధ్యారెడ్డి, ఉద్దెమర్రి హెచ్ఎం ప్రభాకర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిట్టీల పేరుతో మోసగించిన ఘనుడు

**ప్రజాపక్షం/శంషాబాద్ :** చిట్టీల పేరుతో నమ్మబలికి కోట్ల రూపాయలు గుంజేసి కుటుంబంతో పారిపోయిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. శంషాబాద్‌లో నివసిస్తున్న పల్లెమోని సురేందర్ ముదిరాజ్, అతడి భార్య కవిత చిట్‌ఫండ్ల పేరుతో డబ్బులు సేకరించినట్లు బయటపడింది. బాధితుల్లో ఓ జర్నలిస్టు ఉండడంతో ఈ మోసం బయటపడింది. పట్టణానికి జర్నలిస్టు మంచర్ల శ్రీనివాస్(50) సహా పలువురు బాధితులు ఈ మోసానికి గురయ్యారు. ఫిర్యాదు ప్రకారం జర్నలిస్టు శ్రీనివాస్ రూ.5 లక్షలు, రూ.2 లక్షల చిట్టీలు కట్టాడు. ఆయన అత్త కళావతి రూ.3 లక్షల చిట్‌లో డిపాజిట్ చేసింది. వారికి మొత్తంగా రూ.18 లక్షలు జూలై 2025లో చెల్లిస్తానని సురేందర్ హామీ ఇచ్చాడు. చివరికి డబ్బులు చెల్లించకుండా ఇంటిని తాళం వేసి కుటుంబంతో సురేందర్ పరారయ్యాడు. అంతేకాక, మరికొంతమంది వద్ద పుస్తకాలపై సంతకాలు తీసుకుని డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు లబోదిబో మంటున్నారు. డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినందుకు జర్నలిస్టు ఫిర్యాదు చేయగా, ఆర్జీఐఎ పోలీస్‌స్టేషన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ అశోక్ వర్మకు అప్పగించారు.

## నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని డిపిఎస్ స్కూల్ వద్ద నూతనంగా నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, శంకరన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంతారావు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

సిపిఐ రాష్ట్ర నాయకుడు అందోజు రవీంద్రచారి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని, ఈ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని బలమైన ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి అన్నారు. నైజం పాలనలో అణచివేతకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి నిజాం పాలకులను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందని ఆయన అన్నారు. అబ్దులాపూర్‌మెట్ మండలం సిపిఐ కమిటీ అధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా జెఎన్‌ఆర్‌ఎంఎం కాలనీ మెట్టు చౌరస్తాలో సిపిఐ జండాను ఎగురవేశారు. సాయుధ పోరాట యోధుడు, ప్రజల మనిషి ధర్మబిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మా, మంజుల, వెంకన్న, వేణుగోపాల్ చారి, యాదగిరి, రమేష్, లక్ష్మి , అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు కార్పొరేటర్ సుజాత నాయక్ వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్‌లో వరద ప్రభావం ఉన్న కాలనీలకు, నాలా ట్రంక్ లైన్ ఏర్పాటుకు అధిక నిధులు మంజూరు చేయాలని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్‌బాబును మంగళవారం సచివాలయం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి హస్తినాపురం డివిజన కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బానోతు సుజాత నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ ఎల్‌బినగర్ నియోజకవర్గ ఇన్నార్జి మధుయాష్కీగౌడ్ సూచన మేరకు డివిజన్ బలోపేతం కోసం మరిన్ని నిధులు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.


## ప్రజల అభ్యున్నతికి చిత్తశుద్ధి లేని పాలకులు

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ గౌడ్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా ప్రభుత్వానికి ప్రజల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధి లేదని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివకుమార్ గౌడ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మైక్రో బ్రేవరీ(సూక్ష్మ బీర్ల తయారీ యూనిట్) ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఆబ్కారీ కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.దశరథకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ మైక్రో బ్రేవరీలు కార్పొరేషన్ స్థాయిలో ఏర్పాటు అయితే ఇప్పటికే గల్లీకో వైన్ షాప్, వందలాది బెల్ట్ షాపులు ఉన్న పరిస్థితుల్లో ఈ బీర్ల తయారీ వల్ల చిన్న చిన్న కిరాణా షాపుల్లో సైతం బీర్ల అమ్మకాలు జరపడంతో పాటు దుకాణాదార్లు అత్యాశకు పోయి బీర్లను కల్తీ చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ను రద్దు చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు మధుకర్, గండికోట శివ తదితరులు పాల్గొన్నారు.

## మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడిన ముఠా రిమాండ్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో నెల రోజుల నుంచి తరచుగా గొర్రెలు, మేకల దొంగతనాలు జరుగుతున్నాయన్నా సమచారం మేరకు నిఘా ఏర్పాటుతో దొంగల ముఠాను పట్టుకోవడం జరిగిందని మంగళవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎసిపి లక్ష్మి నారాయణ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదాబాద్‌లోని పహాడి షరీఫ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్ (24)అబ్దుల్ కలీం (25) సోహెల్ (24) షేక్ రహుఫ్ (23) మహమ్మద్ జమీర్ ((26) ఆరిఫ్ (25) షేక్ హసీనుద్దీన్ (22)సాయికిరణ్ (30) లను అరెస్టు చేసి రిమాండ్ చేసిన్నట్లు తెలిపారు. ఈ దొంగల ముఠా అందరూ కలిసి ఉదయం నుండి సాయంత్రం వరకు కారులో వికారాబాద్, రంగారెడ్డి లోని వివిధ ప్రాంతాలలో తిరిగి ఎక్కడ మేకలు, గొర్రెలు ఉంటాయో తెలుసుకోని రాత్రి సమయంలో దొంగతనంగా వ్యాన్ ఎక్కించి జియాగూడ మార్కెట్ అమ్ముతున్నారు. ఈ విషయంపై షాద్‌నగర్ పోలీస్‌లు నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకున్నారిని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ డిసిపి రాజేష్, డిసిపి ముత్యం రెడ్డి, అడిషనల్ డిసిపి పూర్ణచందర్ రావు, సిఐ విజయ్ కుమార్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సన్నద్ధం

నోడల్ అధికారుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశం






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు సర్వ సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఉప ఎన్నిక నిర్వహణపై నోడల్ అధికారులతో ఆయన ప్రాథమిక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవిఎం, వివి ప్యాట్ రవాణా, మానవ వనరులు, శిక్షణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ప్రవర్తన నియమావళి, శాంతి భద్రతలు, వల్నరబులిటీ మ్యాపింగ్, వ్యయ పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, లైవ్ వెబ్‌క్యాస్టింగ్, ఎస్ఎంఎస్ మానిటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సన్నద్ధతను ఆయన సమీక్షించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లను మ్యాన్ పవర్ జాబితాలో చేర్చకూడదని కర్ణన్ స్పష్టం చేశారు. మీడియా కమ్యూనికేషన్ కోసం ప్రత్యేక మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, శ్రీనివాస్ రెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ బోర్ఖడే, ఎన్. రవి కిరణ్, అదనపు కమిషనర్లు అలివేలు మంగతాయారు, కె.వేణు గోపాల్, గీతా రాధిక, విజిలెన్స్ ఏఎస్‌పి సుదర్శన్, సివిఓ డాక్టర్ అబ్దుల్ వకీల్, పిఆర్ఓ దశరథం తదితరులు పాల్గొన్నారు.

### త్వరితగతిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి

వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డిపి) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో కమిషనర్ నగరంలోని అన్ని జోన్లలో చేపడుతున్న ప్రాజెక్టులు, ఎస్ఎన్‌డిపి పనుల పురోగతిని జోనల్ కమిషనర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, ప్లానింగ్, భూసేకరణ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒక్కో ప్రాజెక్ట్ పురోగతిని వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు, వాటి వెనుక ఉన్న కారణాలను వివరించారు. పనులు త్వరగా పూర్తి కావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టుల అమలుకు నిధుల కొరత లేదన్నారు. యుటిలిటి షిఫ్టింగ్, భూసేకరణ పెండింగ్ అంశాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. హెచ్ సిటీ కింద చేపట్టే పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, హేమంత్ కేశవ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.రవికిరణ్, చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్‌ఇంజనీర్(ప్రాజెక్ట్స్) సానే భాస్కర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్(ఎస్ఎన్‌డిపి,లేక్స్) జోతిర్మయి, ప్రత్యేక ఉప కలెక్టర్ రాములు నాయక్, ఎస్ఇ, ఇఇలు పాల్గొన్నారు.

### రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

లింగంపల్లి చౌరస్తా– అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ కర్ణన్, మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావుతో కలిసి ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు నెలల క్రితం ప్రారంభమైన ఈ విస్తరణ పనులు త్వరగా పూర్తి కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్రావు మాట్లాడుతూ నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి హైవేతో కనెక్ట్ చేస్తే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి అధికారులు తక్షణ చర్యలు ప్రారంభించాలని సూచించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, బొల్లారం ప్రజలతో పాటు శేరిలింగంపల్లి వాసులకు కూడా రింగ్ రోడ్ ప్రయాణం మరింత సులభతరం కానుంది. పర్యటనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) సానే భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇంకా లభించని నాలాల్లో గల్లంతైన వారి అచూకీ !

మూసీ, నాలాల్లో గాలింపు చర్యలు కొనసాగిస్తున్న హైడ్రా





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలాల్లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. మంగళవారం మూసీ నదిలో డ్రోన్ సాయంతో శోధనలు చేపట్టినా ఎలాంటి ఫలితం దక్కలేదని అధికారులు తెలిపారు. ముషీరాబాద్‌లోని వినోభా కాలనీలో కాలువలో కొట్టుకుపోయిన దినేష్ అలియాస్ సన్నీకి చెందిన ద్విచక్రవాహనాన్ని 150 మీటర్ల దూరంలో హైడ్రా సిబ్బంది గుర్తించి వెలికితీశారు. అయితే అతని జాడ మాత్రం లభించలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి బైకు దొరికిన స్థలం వరకు ప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి, డిఆర్‌ఎఫ్ సిబ్బంది భూగర్భ డ్రైనేజీ మార్గాల్లోనూ గాలించినా ఫలితం లేకపోయిందని అధికారులు చెప్పారు. ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్ నాలాలో కొట్టుకుపోయిన అర్జున్, రాముల విషయంలో కూడా పరిస్థితి అలాగే కొనసాగుతోందని హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య తెలిపారు. డిఆర్‌ఎఫ్ సిబ్బంది అత్యంత క్లిష్టమైన భూగర్భ శోధనలు కొనసాగిస్తున్నారన్నారు. హైడ్రా అధికారులు జయప్రకాశ్, గౌతమ్, యజ్ఞనారాయణ ఆధ్వర్యంలో ఈ గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## బతుకమ్మకుంటలో బతుకమ్మ ఉత్సవాలు

సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మకుంట మరోసారి తన పేరుకు తగ్గట్టుగా బతికే ఉన్నానని నిరూపించుకుంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ చెరువు ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలకు వేదిక కానుంది. ఈ నెల 25వ తేదీన జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదే రోజు నగర ప్రజలకు బతుకమ్మ కుంటను సిఎం అంకితం చేయనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ముఖ్యమంత్రి సలహాదారు వేమన రేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జలమండలి ఎం.డి. కె.అశోక్‌రెడ్డి సమీక్షలో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ఉత్సవాలను నిర్వహించాలని వేమనరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు.

### హైడ్రా కృషి అభినందనీయం..

కబ్జాల చెర నుంచి విముక్తి పొంది, నిర్మాణ వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన స్థితి నుంచి అందంగా రూపుదిద్దుకున్న బతుకమ్మకుంటను చూసి నగర మేయర్ విజయలక్ష్మి , కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు హైడ్రా కృషిని అభినందించారు. ఈ పనిని యజ్ఞంలా చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రశంసలు లభించాయి. చెరువును అభివృద్ధి చేసి ప్రజల కోసం అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా కీలక పాత్ర పోషించిందని వారు అన్నారు.

### అందరూ రావాలి.. ఆడాలి..

ఈనెల 25న జరగనున్న బతుకమ్మ ఉత్సవాలకు అందరూ హాజరై ఆనందంగా బతుకమ్మ ఆడాలని మేయర్ విజయలక్ష్మి , హనుమంతరావు పిలుపునిచ్చారు. నగరంలో చేపట్టిన ఆరు చెరువుల అభివృద్ధిలో బతుకమ్మకుంట ప్రథమంగా పూర్తికావడం గర్వకారణమన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఉత్సవాల్లో పాల్గొని మరిన్ని చెరువుల అభివృద్ధికి దోహదపడాలని మేయర్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన బతుకమ్మకుంట అభివృద్ధి, రాబోయే ఉత్సవాలతో మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందనుంది.

# రిజిస్ట్రేషన్‌ల సమస్యకు పరిష్కారం

రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మంత్రిని కలిసిన మధుయాష్కీ గౌడ్

11జిఒ బాధితుల సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హైదరాబాద్, హెచ్‌ఎండిఏ పరిధి పాటు అన్ని జిల్లాల్లో నెలకొన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం చూపుతామని రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గంలో జీవో నెం. 118 బాధితకాలనీలలో నెలకొన్న రిజిస్ట్రేషన్ల సమస్యలపై టీపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సెక్రటేరియట్‌లోని వారి ఛాంబర్‌లో కలిశారు. బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్, నాగోల్, హస్తినాపురం, చంపాపేట్‌లలోని బాధిత కాలనీ సంక్షేమ సం ఘాల ప్రతినిధులతో కలిసి మంత్రితో సమావేశమై సమస్యను వివరించారు. హుడా అప్రూవల్‌తో పాటు గతంలో గ్రామపంచాయితీ, మున్సిపాలిటీ అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న కాలనీలలో 2007 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో కష్టపడి కొనుకున్న ఇళ్లు, ప్లాట్ల యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా తప్పులు తడకతో జీవో 118 తీసుకురావడంతో కట్టుకున్న ఇళ్లకు విలువ లేకుండా, బ్యాంకులోన్లు రాకుండా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిషేధిత జాబితాలో ఉన్న 22ఏ నుంచి బాధిత కాలనీలను తొలగించాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌తో పాటు హెచ్‌ఎండిఏ పరిధి, పలు జిల్లాలోనూ ఇలాంటి సమస్యలు ఉన్న విషయం తమదృష్టికి వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టదని, వారికి శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పబోతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్, డివిజన్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, దుర్గారెడ్డి, రమాకాంత్, భవాని శంకర్, కొండోజు శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పురుషోత్తరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కళాకారులపై చిన్నచూపు తగదు

తెలంగాణ జానపద కళాకారుల ఐక్య వేదిక

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని చిందు యక్షగాన, గుస్సాడీ, డప్పు కళాకారులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందినా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిశాఖ శాఖ కులవివక్షతో వారిని చిన్నచూపు చూడటం తగదని తెలంగాణ జానపద కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి శ్రవణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం హిమగిరి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కనక సుదర్శన్ తెలిపారు. తెలంగాణలో 66 కళారూపాలు ఉన్నా భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ వ్యవహారంతో కొన్ని కళారూపాలు అంతరించిపోయేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ వేదికలలో 12 ఏళ్లుగా ఒగ్గు రవి, పేరిణి రాజ్‌కుమార్‌కు మాత్రమే అవకాశం ఇవ్వడం వెనుక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. రాష్ట్రంలోని జానపద కళాకారులకు ప్రదర్శన ఇచ్చిన 15రోజుల్లోపే రూ.5వేల పారితోషికం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐక్యవేదిక ఉపాధ్యక్షులు బండి రమేశ్, కార్యవర్గ సభ్యులు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.




## బిఆర్‌ఎస్‌ను కబ్జా చేసేందుకు హరీష్‌రావు కుట్ర

కాంగ్రెస్ నేత సామ రామమోహన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ పార్టీని కబ్జా చేసేందుకు మాజీ మంత్రి హరీష్‌రావు నయా స్కెచ్ వేశాడని కాంగ్రెస్ నేత సామ రామమోహన్ ఆరోపించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇడి కేసులో హీరోయిన్ కెటిఆర్ మీద ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కెటిఆర్‌ను జైలుకు పంపే ప్రయత్నం జరుగుతుందన్నారు. కెసిఆర్ కుటుంబంలో ఇప్పటికే ఒకరు బయటకి వెళ్లిపోయారన్నారు. బిఆర్ఎస్ బిగ్ వికెట్ అయిన కెటిఆర్‌ను బయటకి పంపే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ నాకౌట్ మ్యాచ్లో జరుగుతున్న ఇంట్రెస్టింగ్ పోరులో టర్నింగ్ పాయింట్ కెటిఆర్ అంశం చేరిందన్నారు. బిజెపి తాడు పట్టుకొని కెటిఆర్‌ను ఇరికించే ప్రయత్నం హరీష్‌రావు చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇంకా తెలంగాణలో నిలబడదన్నారు.

## డ్రగ్స్‌కెమికల్స్‌ను గుర్తించడానికి ఎక్సైజ్ టీమ్‌లకు శిక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గంజాయి, డ్రగ్స్ తనిఖీలకు వెళ్లినపుడు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కోవడంతోపాటు సింథటిక్ డ్రగ్స్, ఆల్ఫ్రోజోలం, కెమికల్స్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌టీమ్‌లు తనిఖీలు నిర్వహించినపుడు సూక్ష్మ దృష్టితో ముందు కు సాగాలని కెమికల్ ఎక్స్‌ఫర్ట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కార్తిక్ చైతన్య అన్నారు. నాంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్ టీమ్‌లకు కెమికల్స్‌ను ఎలా గుర్తించడం అనే విషయంపై అవగహన సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల నాచారం, చర్లపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీకి వినియోగించే మెఫెడ్రిన్‌ను పట్టుకోవడం జరిగింది. ఆ తరువాత బోయిన్‌పల్లిలోని శ్రీమేధా స్కూల్‌లో ఆల్ఫ్రోజోలం తయారీ విషయం వెలుగులోకి రావడం జరిగింది. ఇలాంటి సమయాల్లో తనిఖీలకు టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, అధికారులు వెళ్లినప్పుడు యంత్రాంగం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాన్ని పవర్ ప్రజెంటేషన్ ద్వారా విరవరించారు. హైదరాబాద్, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో అనేక కెమికల్ ఇండస్ట్రీయల్ ఉన్నాయని వాటిని తనిఖీలు చేయడానికి వెళ్లినపుడు ఎలాంటి విషయాలను పరిశీలించాలనే విషయంపై కార్తిక్ చైతన్య పిపిటి ద్వారా తెలియ జేశారు. తనిఖీల్లో ప్రధానంగా ఎక్సైజ్ శాఖ టీమ్‌లు వెళ్లినపుడు పెంటనీల్, ఆల్ఫ్రోజలం, డ్రగ్స్ మెఫెడ్రోన్ , సింథబూటిక్ డ్రగ్స్ తయారీపై యూనిట్ల వద్దకు వెళ్లినపుడు ముందు కెమికల్స్ మిలితం కోసం తయారుచేసిన లేదా రాసిన నోట్స్‌ను, మ్యాపులను, అక్కడ ఉన్న కెమికల్స్‌ను, తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్న అనంతరం సంబంధిత నిందితులు ఏ రకమైన డ్రగ్స్ తయారీ చేస్తున్నాడనే విషయం కోసం స్థానికంగా ఉన్న కెమికల్స్ వివరాలను గుగూల్‌లో పబ్ చామ్, ఎంఎస్‌డిఎస్ లాంటి సైట్లలో సమాచారం పక్కా విషయాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకుంటే కేసులను బాగా చేయడంతో పాటు నిందితులను పట్టుకో వచ్చునని అన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు ప్రణవీ, అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్.కిషన్, జి .శ్రీనివాసరెడ్డి, అడిషనర్ ఎస్‌పి వెంకటేశ్వర బాబు, ఎస్‌టిఎఫ్ డిఎస్‌పిలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్,ఈఎస్‌లు ప్రదీప్‌రావు, నవీన్, ఉజ్వలరెడ్డిలు పాల్గన్నారు.

# క్రీడ

## చైనా మాస్టర్ సూపర్ టోర్నీ తొలి రౌండ్‌లో
# పి.వి. సింధు శుభారంభం

**షెన్జెన్ :** పేలవ ఫామ్ నుంచి బయటపడి ఇటీవల ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ మెరుగైన ప్రదర్శనతో క్వార్టర్స్ చేరిన భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు.. తర్వాత జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఆమె తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే. అయితే, చైనా మాస్టర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో 21–4, 21–10తో జాకోబ్సెన్ (డెన్మార్క్)ను వరుస గేమ్‌ల్లో మట్టికరిపించి ప్రి క్వార్టర్స్‌కు చేరింది. కేవలం 27 నిమిషాల్లోనే ఈ పోరు ముగియడం విశేషం. ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించిన సింధు తొలి గేమ్‌ను 10 నిమిషాల్లోపే సొంతం చేసుకుంది. రెండో గేమ్ ఆరంభంలో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా సింధు తర్వాత జోరు పెంచింది. ఒక దశలో 11–8తో ఉన్న స్వల్ప ఆధిక్యంలో ఉన్న భారత షట్లర్.. తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించింది. కాసేపటికే గేమ్‌ను సొంతం చేసుకుంది.ఇక, పురుషుల సింగిల్స్ ఓపెనింగ్ రౌండ్ మ్యాచ్లో యువ షట్లర్ ఆయుష్ శెట్టి పోరాడి ఓడి టోర్నీనుంచి నిష్క్రమించాడు. 68 నిమిషాలపాటు సాగిన పోరులో ఆయుష్ 19 21, 2112, 1621తో చోతీన్ చెన్ (తైపీ) చేతిలో ఓడిపోయాడు. మిక్స్డ్ డబుల్స్‌లో రుత్విక, రోహన్ కపూర్ జోడీ 1721, 1121 తేడాతో యుచి షిమోగామి, సయాకా హోబారా (జపాన్) చేతిలో ఓటమిచవి చూసింది.





## ఫిడే గ్రాండ్ స్విస్ టైటిల్ గెలిచిన
# భారత గ్రాండ్ మాస్టర్

భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో చరిత్ర సృష్టించారు. ఆమె తన చివరి గేమ్‌ను మాజీ మహిళల ప్రపంచ ఛాంపియన్ టాన్ ఝోంగ్ యీతో డ్రా చేసుకుని వరుసగా రెండోసారి ఈ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈ విజయం ఒక చారిత్రక ఘనత.. ఎందుకంటే ఈ టోర్నమెంట్‌ను రెండు సార్లు గెలుచుకున్న మొదటి క్రీడాకారిణి ఆమెనే కావడం గమనార్హం. ఈ విజయంతో వైశాలి క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నా రు. కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ తర్వాత క్యాండిడేట్స్ టోర్నమెంట్ కు అర్హత సాధించిన మూడో భారత మహిళా క్రీడాకారిణిగా ఆమె నిలిచారు. ఈ అద్భుత విజయం సాధించిన వైశాలికి భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. ప్రధాని మోడీతో పాటు వైశాలి తమ్ముడు, ప్రముఖ గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద కూడా తన సోదరిని అభినందించారు. ఓపెన్ సెక్షన్‌లో భారత స్టార్ ఆటగాడు అర్జున్ ఎరిగైసి తన చివరి గేమ్‌ను విన్సెంట్ కేమర్‌తో డ్రా చేసుకున్నాడు, దీంతో అతడు క్యాండిడేట్స్‌లో స్థానం దక్కించుకోలేకపోయాడు. ఈ సెక్షన్‌లో అనీష్ గిరి, జర్మన్ గ్రాండ్ మాస్టర్ మథియాస్ బ్లూబామ్ క్యాండిడేట్స్‌కు అర్హత సాధించారు

## నాలుగో భారత అథ్లెట్‌గా
# సర్వేశ్ కుశారే రికార్డు!






భారత హై జంపర్ సర్వేశ్ కుశారే చరిత్రకు కొద్ది దూరంలో ఆగిపోయాడు. జపాన్‌లోని టోక్యో వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఫైనల్లో తీవ్రంగా నిరాశపరిచాడు. క్వాలిఫయింగ్‌లో మెరిసి అతడు.. అంతిమ పోరులో 2.28 మీటర్ల ఎత్తు దూకి ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అయినప్పటికీ తన కెరీర్లలోనే అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ మెగా టోర్నీ చరిత్రలో టాప్ 6లో నిలిచిన నాలుగో భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు సర్వేశ్. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో సర్వేశ్ సంచలన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. 2.16 మీటర్ల ఎత్తు దూకడంలో తొలి ప్రయత్నంలో విఫలం అయినప్పటికీ.. ఒత్తిడికి లోనవ్వలేదు సర్వేశ్. రెండో ప్రయత్నంలో 2.2 5 మీటర్ల ఎత్తు దుమికి ఫైనల్ బెర్తు సాధించాడు. తద్వారా భారత్ నుంచి ఈ విభాగంలో ఫైనల్ చేరిన తొలి పురుష అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు సర్వేశ్. టోక్యో ఒలింపిక్స్ విజేత గియన్‌మార్కో తంబేరిని వెనక్కి నెట్టిసి పతకంపై ఆశలు రేపాడు. గతంలో అతడి బెస్ట్ జంప్ 2.27గా ఉండేది. ఫైనల్లో అతడు తన రికార్డును అధిగమిస్తూ 2.28 మీటర్ల ఎత్తు దూకాడు.

# ఫోకస్

# మహిళ

## పట్టుదలకు మారుపేరు
# అనా విక్టోరియా

చాలా మంది ఎన్నో సాధించాలని అనుకుంటారు. కానీ, దాదాపుగా ఏదీ సాధించకుండా, అనామకంగా ఉండిపోతారు. వైఫల్యాలకు కారణాలు వెతుక్కుంటారు. అయితే, అలాంటి వారికి పూర్తి భిన్నం అనా విక్టోరియా ఎస్పినో డి సాంటియా. పుట్టుకతోనే డౌన్ సిండ్రోమ్ లేదా డౌన్స్ సిండ్రోమ్ వ్యాధి సోకడంతో ఆమె మానసిక ఎదుగుల నెమ్మదించింది. ఇది ఒక జన్యు సంబంధమైన వ్యాధి. ఈ వ్యాధిగ్రస్తులలో క్రోమోజోము 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడుగా వుంటాయి. అందుకే దీనిని ట్రైసోమీ 21 అని కూడా పిలుస్తారు. దీనిమూలంగా పిల్లలలో భౌతికమైన పెరుగుదల మందగిస్తుంది. వీరి ముఖంలోని మార్పుల ఆధారంగా గుర్తించవచ్చును. వీరికి తెలివితేటలు చాలా తక్కువగా వుంటాయి. సాధారణ ఐక్యూ స్థాయి 100కాగా, వీరి ఐక్యూ స్థాయి 50కి మించదు. ఇలాంటి బాధాకరమైన పరిస్థితుల్లోనూ అనా విక్టోరియాకు చిన్నతనం నుంచి న్యాయవాది కావాలనే ఆశ ఉండేది. ఆమె తడబడుతూ, అతి కష్టం మీద పదాలు కూడపలుక్కొని ఈ మాటలు చెప్పినప్పుడు చాలా మంది విమర్శించారు. హేళన చేశారు. అసాధ్యం కాబట్టి ఆ ఆలోచన మానుకోవాలని ఉచితసలహాలు ఇచ ఇచాచరు. 'నీకు డౌన్ సిండ్రోమ్ ఉంది. కాబట్టి, న్యాయవాది కావడం నీకు అసాధ్యం' అని తేల్చిచెప్పారు. కానీ, సమాజం చిన్నచూపు చూసినా, అవమానించినా, నిరుత్సాహపరచినా అనా విక్టోరియా పట్టుదల వీడలేదు. 'నేను సాధించి చూపిస్తాను' అనే ఒక్క సంకల్పమే ఆమెను ముందుకు నడిపించింది. ఆమె తన పరిస్థితిని బలహీనతగా కాకుండా, బలంగా మార్చుకుంది. చదువులో ఎన్నో కష్టాలను ఎదుర్కొంది, సమాజపు విమర్శలను తట్టుకుంది. నిద్రలేని రాత్రులు, అనేక పరీక్షలు, నిరంతర ప్రయత్నాలు.. ఇవన్నీ ఆమెకు అడ్డంకులు కాకుండా మెట్లుగా మారాయి. చివరికి, ఆమె కృషి చరిత్రను సృష్టించింది. ప్రపంచంలోనే డౌన్ సిండ్రోమ్‌తో ప్రాక్టీస్ చేసే తొలి లాయర్‌గా ఆమె తన పేరును చెరగని బంగారు అక్షరాలతో లిఖించుకుంది. ఇప్పుడు ఆనా విక్టోరియా కోర్టులో వాదిస్తూ న్యాయం కోసం పోరాడుతోంది. కాని ఆమె ప్రయాణం ప్రభావం అక్కడితో ఆగిపోలేదు. కోర్టు గోడల బయట కూడా, ఆమె మనుషుల మనసులను మార్చే ప్రయత్నం చేస్తున్నది. సమాజం అసాధ్యమని వేసే ముద్రలకు విలువలేదని నిరూపిస్తున్నది. 'ఆత్మవిశ్వాసం తగ్గడమే అసలైన వైకల్యం' అంటున్న అనా విక్టోరియా జీవితం మనకు ఒక శక్తివంతమైన పాఠాన్ని నేర్పుతుంది. నిజమైన వైకల్యం శరీరంలో ఉండదని, అది మన మనసులో అంతర్లీనంగా ఉంటుందని స్పష్టం చేస్తుంది. మన మీద మనకున్న విశ్వాసం ఎప్పుడూ తగ్గకూడదని, మన కలలు ఎంత పెద్దవైనా, వాటి కోసం పోరాడే ధైర్యం ఉంటే వాటిని సాకారం చేసే శక్తి మనలోనే ఉంటుందని అనా విక్టోరియా నిరూపిస్తున్నది. ఆమె ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఒక ఓ వెలుగుదీపం.





# కేరళ ఆదర్శం..

మహిళలకు ప్రత్యేకంగా వెల్‌సెన్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా కేరళ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను గుర్తించి, దేశంలోనే తొలిసారిగా, రాష్ట్రంలోని 5,415 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మహిళల కోసం ప్రత్యేక వెల్‌నెస్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నది. 'స్ట్రీమింగ్ హర్ టు ఎన్‌పవర్ ఎవ్రివన్' (స్త్రీ) పేరుతో మంగళవారం (ఈనెల 23న) ప్రారంభమైన ఈ క్లినిక్‌లు మహిళల్లో సాధారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందిస్తాయి. ప్రత్యేకించి అలసట, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి చికిత్సలపై దృష్టి సారిస్తాయి. తిరువనంతపురం పల్లితుర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'స్త్రీ' క్లినిక్‌లను కేరళ రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జి ప్రారంభించి, ఒక గొప్ప పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో 5,415 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం పూర్తయింది. పలు చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ఈ సెంటర్లు ప్రజలకు అతి సమీపంలో ఉన్న ఆసుపత్రులుగా మారుతున్నాయి. మహిళలు, పిల్లల కోసం పక్కనే ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో స్క్రీనింగ్ శిబిరాలు, నిపుణుల వైద్యసేవలు అందించడమే ఈ వెల్‌నెస్ క్లినిక్‌ల ముఖ్య ఉద్దేశం. మహిళలు తప్పనిసరిగా హెల్త్ చెకప్‌లు చేయించుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలన్న కేరళ ప్రభు త్వం పిలుపునిస్తోంది. ఈ విధంగా మహిళా వెల్‌నెస్ సెంటర్లు దేశంలోని మిగతా రాష్ట్రాల్లోనూ మొదలైతే, ఎన్నో రకాల అనారోగ్య సమస్యల నుంచి వారు బయటపడతారు.

## సిజేరియన్ తర్వాత కూడా సహజ ప్రసవాలు సాధ్యం!

సిజేరియన్ ప్రసవాలు పెరుగుతున్న నేపథ్యంలో, ఒకసారి సిజేరియన్ అయిన తర్వాత కూడా మహిళలు సహజ ప్రసవాలు సాధ్యమన్న వార్త ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కానీ, ఇది వాస్తవం. వైద్యపరంగా దీనిని 'వెజినల్ బర్త్ ఆఫ్టర్ సిజేరియన్' (వీబ్యాక్) అంటారు. గర్భిణుల్లో దీని గురించిన అవగాహన పెరగడం అత్యవసరం. సిజేరియన్ తర్వాత సహజ ప్రసవాలు అసాధ్యమన్న అభిప్రాయాన్ని బలంగా నమ్ముతున్న వారు తప్పకుండా అంబాలాకు చెందిన స్తుతి జైన్ గురించి తెలుసుకోవాలి. ఆమె మొదటి సంతానం సిజేరియన్ ద్వారా పుట్టగా, రెండో బిడ్డను సహజ ప్రసవం ద్వారా కనడం 'వీబ్యాక్' అసాధారణం కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఇలాంటి మరో స్ఫూర్తిదాయకమైన కథ ఢిల్లీ వసంత్‌కుంజ్‌కు చెందిన అకాంక్ష లాల్‌ది. ఈ జూన్‌లో ఆమె మూడోసారి తల్లిగా మారారు. 2017లో ఆమె మొదటి సంతానం సిజేరియన్ ద్వారా పుట్టగా, తర్వాతి ఇద్దరు పిల్లలను సహజ ప్రసవం ద్వారా కనడం విశేషం. ఒక ప్రముఖ బహుళజాతి సంస్థలో మార్కెటింగ్ డైరెక్టర్‌గా ఉన్న అకాంక్ష మాట్లాడుతూ, ప్రసవ సమయంలో ఆసుపత్రి అందించిన సహకారం తనకు ఎంతో బలాన్నిచ్చిందని అన్నారు. 2024 జనవరిలో రెండో కూతురికి, ఈ ఏడాది జూన్‌లో కుమారుడికి జన్మనిచ్చినట్టు పేర్కొంది. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన వ్యాయామం, ముఖ్యంగా తల్లి ఉత్సాహం విజయవంతమైన సహజ ప్రసవానికి కీలకమని వైద్య నిపుణులు అంటున్నారు.



నిజామాబాద్..

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటు



సంస్థాన్‌నారాయణపురం..

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ

### సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ సాయుధ వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పనిహారం రంగాచారి విగ్రహానికి ఘననివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 4 వేల మంది తమ ప్రాణాలను అర్పించారని లక్షలాది ఎకరాల భూమిని నిరుపేదలకుకమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పంపిణీ చేశామన్నారు.నిజాంకు వ్యతిరేకంగా పోరాటంలో బీజేపీపాత్ర ఏమి లేదని పైగా పోరాటాన్ని హిందూ ముస్లిం, మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించి ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, కంజర భూమన్న,దశరథ్,బాలరాజు,రాజమణి, దేవయ్య, ఈశ్వర్,బాల్‌రాజ్, సాయగౌడ్, హన్మా ఒడ్లు, సాయిలు, రాజిరెడ్డి, లక్ష్మ ణ్, ప్రవీన్, రాజశేఖర్, సంపత్, రాములు, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

### తెలంగాణ సాయుధ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులే

**నాగర్‌కర్నూల్:** వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికివారసులు కమ్యూనిస్టులేనని భారతకమ్యూనిస్టుపార్టీ సిపిఐ శ్రేణులు సాగించిన మట్టిమనుషుల మహావిప్లవం సాయధపోరాటమని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా, సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యాలయం లక్ష్మ ణా చారిభవనంలో తెలంగాణ రైతాంగసాయుధపోరాటవారోత్సవాలముగింపు సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్. ఆనంద్‌జి, కేశవులు గౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు నర్సింహ్మా, ఈర్లచంద్రమౌళి, కొమ్ముభరత్, శివశంకర్, బిజ్జశ్రీనివాస్, బండిలక్ష్మి పతి, ప్రేమ్‌కుమార్, మల్లయ్య, బాల మురళి, మర్యాదవెంకటయ్య, కొత్తరామస్వామి, గోపాల్, మధుగౌడ్, ఖాజామైనుద్దిన్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాటం ఎర్ర జెండా నీడలోనే జరిగిందని, పోరా ట చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ మండిపడ్డారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్ ఆవిష్కరించారు.ముఖ్యఅతిథిగా కలవేణి శంకర్, సిపిఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ మాట్లాడారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, పిడుగు శంకర్,రాయిల్లా నర్సయ్య, కోదురుపాక మహేష్, బావునే వికాస్, వర్కోల్ రాకేష్, నాయిని వెంకటేష్, అజయ్, రాజశేఖర్, వి.శ్రీకాంత్, జె. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్:**తెలంగాణరైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి వైఖరిని తిప్పికొట్టాలనిసిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ విలాస్ అన్నారు. సిపిఐ తాంసి మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 79వ వార్షికొత్సవాన్ని తాంసి మండలం ఈదుల్ల సవర్గం, గోట్కూరిలలో జరుపుకున్నారు. అమరవీరుల స్థూపాల వద్ద, పార్టీ దిమ్మెల వద్ద నివాళులర్పించి ఎర్ర జెండాను ఎగుర వేశారు. ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ విలాస్ మాట్లాడారు.సిపిఐ జిల్లా కా ర్యవర్గ సభ్యులు చిలుక దేవిదాస్, మెస్రం బాస్కర్, జిల్లా నాయకులు గెడం కేశవ్, గజంగుల రాజు, సీనియర్ నాయకులు, అరుణ్‌కుమార్, సత్యజి, నర్సింగరావు, శ్రీనివాస్, శంకర్, అశోక్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

**రామడుగు:**తెలంగాణ సాయుధ పోరాట చరిత్రనుపాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని గుండి గ్రామం లో రైతాంగ సాయుధ పోరాట అమరులు గుండి దామోదర్‌రావుచిత్రపటానికినివాళులర్పించారు. పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. సిపిఐ మండల కార్యదర్శి ఉమ్మెంతుల రవీందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, సిపిఐ సీనియర్‌నాయకులు గంటె రాజేశం, గుండి గ్రామమాజీఉపసర్పంచ్‌మేడి శ్రీనివాస్, ముంజాల ప్రవీణ్ గౌడ్, మేకల నాగరాజు, దీకొండ కుమారస్వామి, మచ్చ నరసయ్య, ఎగుర్ల మల్లేశం, మచ్చ హరీష్, ఎండి అజీమ్, మహబూబ్ ఉన్నారు.

**సంగారెడ్డి:**విలీనోత్సవమే వీరులకు వీర దండలని, రాచరికంరద్దుకైపోరాటమనిసంగారెడ్డిజిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. జహిరాబాద్ పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. సిపిఐ డివిజన్ కార్యదర్శి నర్సింలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సయ్యద్ జలాలుద్దీన్‌ప్రసంగించారు.రాజు, సెంట్రింగ్ మేస్త్రీ యూనియన్ డివిజన్ అధ్యక్షులు సుదాకర్, తమునిమ్ ఏఇన్సఫ్ జిల్లా అధ్యక్షులు అశ్వక్, ఊస్సేన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆఫ్జల్, అజారోద్దీన్,పార్టీ నాయకులు విశ్వనాథ్ పూజ,కళావతి,ఆమృతమ్మ, అణితమ్మ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** తెలంగాణ సాయధ పోరాట చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని,ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో సభ సిపిఐ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుమార్కపురి సూర్య, సిపిఐ జిల్లా సమి తి సభ్యులు పూసాల రమేష్ ,ఆరెపల్లి మానస్, కల్లేపల్లినవీన్,చంద్రగిరి ఉదయ్, తిరుమల్, కే శంకర్, ఎల్లయ్య, రాకేష్, పెద్ద ఒక రాయ మల్లు, శివ, రాము పార్టీ ప్రజాసంఘాల నాయకులు మాచర్ల అంజి,బండారి సదానందం పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** ప్రజా పోరాటలతోనే నిరు పేదలకు న్యాయం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని పెన్షన్ భవనంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. సిపిఐ రాష్ట సమితి సభ్యుడు పానుగంటిపర్వతాలు, బుద్దుల జంగయ్య, ఎండి షకీల్, గోవింద్, వెంకటేష్, లింగం నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ పాల్గొన్నారు.

**సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంమండల కేం ద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవా లు సందర్భంగా అమరవీరుల స్ఫూర్తిని శాసనమండలి సభ్యుడు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డిస్మరించుకున్నారు. మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య, బొమ్మగాని ధర్మ భిక్షం విగ్రహాలకు సిపిఐ సీనియర్ నాయకుడు సాయుధ పోరాట మిలిటెంట్ ఎడ్ల ఆశాలు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటం కేవలం భూస్వాములకు అణిచివేతకు వ్యతిరేకంగానే కాకుండా స్వాతంత్రం తర్వాత కూడా నిజమైన ప్రజాస్వామ్యం కోసం సాగిన సహాసోపేతమైన అధ్యాయమన్నారు.యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతు కూలీల దౌర్జన్యాలకు దోపిడికి వ్యతిరేకంగా జరిగిన ఈ మహా పోరాటం చరిత్రలోనే ప్రజా ఉద్యమంగా మిగిలిందన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజా నాట్యమండలిరాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, మంచాలసైదులు,పొట్ట శంకరయ్య, మంచాల జంగయ్య, సుర్వి నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు దేశిడి నరేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, దుబ్బాక సంజీవ, వీరమల్ల యాదయ్య, పందుల యాదగిరి ఉన్నారు.

**చింతలపాలెం:**తెలంగాణ స్వాతంత్ర్య పోరాట దినోత్సవంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మల్లారెడ్డిగూడెం మండల కేంద్రంలోఅమరవీరుల స్తూపం వద్దసిపిఐ ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు.గన్న చంద్రశేఖర్ నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడారు.అనంతరంరైతాంగ సాయుధ పోరాటయోధుడు ఉస్తేల వీరారెడ్డి సతీమణి రాములమ్మ వర్ధంతినిర్వహించారు. వీరారెడ్డి,రాములమ్మ చిత్రపటాలకు నివాళుల్పి ంచారు.మహిళసమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్య దర్శిచింతిరాలరవి,కోటమ్మ,గంధం మంగయ్య,షేక్‌జియాఉద్దీన్,తాళ్లూరి సత్యం, షేక్ అబ్దుల్ బాషా, పాపిరెడ్డి,భీమిశెట్టిసత్యం, తాళ్లురిశ్రీను, తోకల సైదులు, చిత్తలూరి ధనలక్ష్మి , తేరేజ, యేసు ఉన్నారు.



ఆదిలాబాద్..



నాగర్‌కర్నూలు..



సంగారెడ్డి..



కరీంనగర్..



పెద్దపల్లి..



ఆసిఫాబాద్..



షాద్‌నగర్ (రంగారెడ్డి)



మునగాల.. (సూర్యాపేట)



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్


## సమీకృత భవనల ఏర్పాటుకు మంత్రి వినతి



**ప్రజాపక్షం/కృష్ణ :** నూతనంగా ఏర్పడిన కృష్ణ మండల తహసీల్దార్ ,ఎంపీడీఓ ఇతర ప్రభుత్వ మండల సమీకృతి భవరాలను నిర్మించుటకు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక మత్స్యశాఖ డైరీ డెవలప్మెంట్ క్రీడా, యువజన శాఖ మంత్రివర్యులు డా.వాకిటి శ్రీహరి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రాజప్ప గౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రధానంగా రోడ్ల డ్రైనేజీ, త్రాగునీటి సమస్య ఉందని విన్నవించగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజప్ప గౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజు, కాంగ్రెస్ నాయకులు సంతోష్ పాటిల్, సుదర్శన్ పాల్గొన్నారు.

## పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు త్యాగాలకు సిద్ధం కావాలి : యెన్నం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాజకీయాల కంటే విద్యార్థుల భవిష్యత్తే తనకు ప్రధానం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత శాతం కార్యక్రమానికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు, ఐదు సంవత్సరాలు మీ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లి దండ్రులకు సూచించారు. మీ సొంత పనుల్లో పడి పిల్లలను పట్టించుకోకపోతే పిల్లలు తప్పుదారి పట్టే అవకాశం ఉంటుందని ఆయన తల్లిదండ్రులను హెచ్చరించారు. కాటికి చేరే వరకు మనం గర్వంగా జీవించేలా మన పిల్లలను మనం తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి రోజు పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత దయచేసి టివిలు, సెల్‌ఫోన్‌లను కట్టిపెట్టాలని ఆయన సూచించారు. మీరు చేసే చిన్న త్యాగమే మీ పిల్లలను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. తల్లిదండ్రుల కృషి లేనిదే ఎవరూ ఉన్నత శిఖరాలకు చేరుకోలేదన్నారు. అందుకు ఉదాహరణ బ్యాట్మింటన్ క్రీడాకారిణి పివి సింధు అని, ఆమె బ్యాట్మింటన్‌లో ప్రపంచ స్థాయిలో రాణించిందంటే వారి తల్లిదండ్రులు చేసిన త్యాగం, కృషి తెర వెనుక ఎంతో ఉందన్నారు. మన పిల్లలు మన పిల్లలు మన మహబూబ్‌నగర్ లోనే చదువుకోవాలనే ఉద్దేశంతో గత 20 నెలలోనే మన మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో కొత్తగా ఇంజనీరింగ్, లా కళాశాల తెచ్చామని, అంతే కాకుండా ఐఐఐటి కళాశాలను సైతం మహబూబ్‌నగర్ కు తీసుకురావడంలో సఫలీకృతం కావడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఫార్మసీ, అగ్రికల్చర్, ఎంబిఎ లాంటి ఎన్నో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలను మన పిల్లల భవిష్యత్తు కోసం తెస్తామన్నారు. మన నియోజకవర్గానికి చెందిన పిల్లలు వందమందికి తక్కువ కాకుండా ఐఐఐటి కళాశాలలో ప్రవేశాలు పొందాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు పనిచేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, సిఎంఒ బాలు యాదవ్, ఎఎంఒ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, రామ కృష్ణ,మఠం నిర్వాహకులు రాజమల్లేశ్, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### టీచర్లకు వారి శ్రమకు తగిన వేతనాలివ్వాలి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హామీ




**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులు ఎక్కువగా ఉంటాయని, అయితే ఆ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు మాత్రం జీతాలు చాలా తక్కువగా ఉంటాయని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని వారి సమస్యలను అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. మార్కులు తక్కువ ఉంటే ఎవరు సిఫార్సు చేసినా ట్రిపుల్ ఐటీలో సీట్లు రావని, అందుకే విద్యార్థులు కష్టపడి చదివి మార్కులు తెచ్చుకోవడం ద్వారా ట్రిపుల్ ఐటీని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. మంగళవారం జడ్చర్ల కేంద్రంలోని చంద్ర గార్డెన్ లో నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు జెఆర్ఎస్‌యంఎ అవార్డు ప్రధానోత్సవ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ గురువే గోవిందుడు ఉపాధ్యాయుడే భవిష్యత్తుకు మార్గదర్శి ఒక వైద్యుడు ఒక్క రోగిని కాపాడుతాడు. ఒక ఇంజనీరు ఒక్క ప్రాజెక్టు నిర్మిస్తాడు కానీ ఉపాధ్యాయుడు ఒక తరాన్ని తీర్చిదిద్దుతాడని కితాబిచ్చారు. టీచర్లు అందిస్తున్న జ్ఞానం వల్లే సమాజం అభివృద్ధి దిశగా సాగుతోందని చెప్పారు. నేటి పిల్లలు భావిభారత పౌరులుగా ఎదగడానికి కారణం గురువులు మాత్రమేనని పేర్కొన్నారు. టీచర్లు ఏడాదిలో 365 రోజులు కూడా పని చేస్తారన్నారు. ఉపాధ్యాయ వృత్తి అంటే కేవలం ఉద్యోగం కాదని, అది ఒక త్యాగం, ఒక సేవ అని నిస్వార్థంగా సమాజం కోసం, విద్యార్థుల కోసం టీచర్లు అందిస్తున్న సేవకు విద్యార్థుల కోసం టీచర్లు అందిస్తున్న సేవకు ఈ అవార్డులు ఒక గుర్తింపు అని చెప్పారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడటంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాత్ర కూడా అపారమైనదనీ అభిప్రాయపడ్డారు. జడ్చర్ల నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలు మరింత పెంచడానికి తాను, తన వంతుగా కృషి చేస్తానని పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేస్తానని, డిజిటల్ ఎడ్యుకేషన్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, స్థానిక కౌన్సిలర్ రమేష్, రాజు కాంగ్రెస్ నాయకులు నిత్యానందం బుక్ వెంకటేశ్, జెఆర్ ఎస్ ఎంనేతలు ఆయూబ్, నవీన్ పాల్గొన్నారు.



## ఫొటో ఎక్స్పో పోస్టర్ గోడ పత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మద్దూర్ :** తెలంగాణ జిల్లాలో ఉన్నా ఫోటో వీడియో గ్రాఫర్ల సమస్యలపై ఈ నెల 19 నుంచి 21 తేదీలలో జరగనున్న హైదరాబాద్‌లో జరగనున్న ఫోటో ఎగ్జిబిషన్ సంబంధించిన గోడపత్రికను మంగళవారం రోజు తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేష్ గౌడ్ చేతుల మిదుగా ఆవిష్కరించారు. ఈ కార్యాక్రమంలోమండల ఫొటో గ్రాఫర్ల అసోషియోషన్ నాయకులు సిద్దిలింగప్ప, షఫి,కేశవ్, మహిపాల్, మౌలనా, వెంకటేష్ తదితరులు పాల్గోన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలో నిజాం పాలనలోని హైదరాబాద్ స్టేట్ జిల్లాలో అధికారికంగా నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల ఆత్మకు శాంతి కలగాలంటే విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కావున తెలంగాణ ప్రభుత్వం యావత్తు ప్రజల ఆకాంక్ష మేరకు సెప్టెంబర్ 17 ను ప్రతి సంవత్సరం అధికారికంగా విమోచన ఉత్సవాలు శాఖ నిర్వహించిన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి స్వాతంత్ర్య సమరయోధుల మాదిరిగా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## నేడు తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం

**ప్రజాపక్షం / మద్దూర్ / కొత్తపల్లి :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ను పురస్కరించుకోని నేడు ఉదయం 08:45 గంటలకు మద్దూర్,కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరుపడునని ఎంపిడివోలు రహమతుద్దిన్ , కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పతాక ఆవిష్కరణ కార్యాక్రమానికి అందరు అధికారులు ,ప్రజా ప్రతినిదులు హసరవ్వాలని కోరారు.



## తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులే కీలకం

**ప్రజాపక్షం / అమరచింత :** తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ముందుండి భూస్వాములకు , పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర ఉందని సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని కొంకనివాని పల్లెలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరుల చిత్రపటానికి పూల మాల వేసి ఆయన జోహర్లు అర్పించారు. భూస్వాములకు , రజాకారులకు ఎదురొడ్డి ప్రజలని చైతన్యం చేసి కమ్యూనిస్టులు ముందుండి ఉద్యమాన్ని నడిపించారని తెలిపారు. ఆనాడు భూస్వాముల ఆకృత్యాలకు బలైపోతున్న రైతుల పక్షాన నిలిచి పోరాటాన్ని కమ్యూనిస్టులు నడిపించారని వివరించారు. ఆ పోరాటాల ఫలితంగా సెప్టెంబర్ 17న తెలంగాణను భారతదేశంలో విలీనమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాట అమరుల దినోత్సవాన్ని జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతూబు, సిపిఐ గ్రామ నాయకులు అంజి, వరలక్ష్మి , శ్రీను, రాజు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అచ్చంపేట :** బల్మూరు మండలం చెంచుగూడెం గిరిజన ఆశ్రమపాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థుల విద్యావిధానం , ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులమెనూ పెడుతున్న విధానాన్ని విద్యార్థులతో చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ రాఘవులు, ఎలక్ట్రికల్ ఏడి ఆంజనేయులు పాల్గొన్నారు.

## గండీడ్, హన్వాడ మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

### గండీడ్ మండలంలో బి.సి వసతి గృహం, గిరిజన సంక్షేమ శాఖ మినీ గురుకుల పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృహం అదనపు తరగతి గదులు అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయుటకు అంచనాలు రూపొందించి పంపించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ గండీడ్ మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృహాన్ని, గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల ను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతి గృహంలో వంట గది, స్టోర్ రూమ్, డార్మిటరీ పరిశీలించి సమస్యలు ఉన్నాయా తెలుసుకున్నారు. వసతి గృహం పక్కనే అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు నిర్మించి అసంపూర్తిగా వదిలివేసిన భవనం ను కలెక్టర్ పరిశీలించారు. 2017 సంవత్సరంలో అదనపు తరగతి గదులను నిర్మించి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తికాక అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని బి.సి. అభివృద్ధి అధికారిని వివరించారు. అసంపూర్తి పనులు పూర్తి చేయుటకు అంచనా ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలో గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోర్ రూం ను పరిశీలించారు. వంటగది పరిశీలించారు వంట గదిలో మధ్యాహ్న భోజనం కు వండిన భోజనాన్ని పరిశీలించి పప్పు, చారు ఒకటే లాగా ఉంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం మెనూ ప్రకారం పెట్టారా? అని అడిగారు. మెనూ ప్రకారం ఉదయం ఇడ్లీ కి బదులుగా టామాటా రైస్ పెట్టారని హెడ్ మాస్టర్ వివరించారు. ఇడ్లీ పిండి లేనందున సరఫరా కానందున టమోటా రైస్ పెట్టినట్లు తెలిపారు. పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని ఆహారం వండే సిబ్బంది జాగ్రత్తగా పరిశుభ్రంగా ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐదవ తరగతి గదిలోకి వెళ్ళి పాఠశాలలో బోధన, కల్పిస్తున్న మౌలిక వసతులు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు.

## అదనపు ఎస్పీని అభినందించిన జిల్లా ఎస్పీ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** హైదరాబాదులో జరిగిన 22న ఓపెన్ లోన్ టెన్నిస్ ఛాంపియన్షిన్ నేషనల్ లెవెల్ లో 55 ఏజ్ కేటగిరిలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, మల్టీ జోన్ 1 చంద్రశేఖర్ రెడ్డిలు లాన్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో పోటిపడి ఫైనల్‌లో జూబ్లీ హిల్స్ టీమ్‌పై గెలుపొందడం జరిగింది. ఈ సందర్భంగా నారాయణపేట్ జిల్లా నుండి పాల్గొన్న అదనపు ఎస్పీని, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధుల పట్ల కర్తవ్యం నిబద్ధతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం జిల్లా పోలీసు శాఖకు ఎంతో గర్వకారణం అని అదనపు ఎస్పీ సాధించిన విజయం యువ పోలీసులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఆశ్రమ పాఠశాల వర్కర్ల సమస్యలు తీర్చాలి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** గిరిజన ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను తీర్చాలని మంగళవారం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈసందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ తాము 26 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, గతప్రభుత్వం రూ.15వేలు ఇచ్చిందని, ఇప్పుడు జిఓనెంబర్ 64తెచ్చి వేతనాలు తగ్గించి రూ.13వేలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 12నుంచి తమ హాస్టళ్లముందు ఆందోళనచేశామని ఎవరూ స్పందించకపోవడంతో తాము ఎమ్మెల్యేక్యాంపును ముట్టడించామని తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యలను తీర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని , ఇన్సూరెన్స్, పిఎఫ్‌లాంటి సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## అన్నదాతలు పడుతున్న అవస్థలు ప్రభుత్వానికి పట్టవా?



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** యూరియాకోసం గతకొంతకాలంగా అన్నదాతలు పడుతున్నఅవస్థలు సింగిల్‌విండో కార్యాలయం, గ్రోమోర్ల దుకాణాల వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకు వరుసలో నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న అన్నదాతల అవస్థలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దళితహక్కులపోరాటసమితి అధ్యక్షులు కొమ్ముభరత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ రైతుల అవస్థలనుచూసికూడా ప్రభుత్వంలో చలనంలేకపోవడం దురదృష్టకరమన్నారు. బిజినేపల్లి మండలకేంద్రంలో యూరియాకోసం మహిళారైతు వరుసలో నిలబడితే ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు ఇతర బంగారాన్ని అపహరించినఘటన చోటు చేసుకుందన్నారు. కేంద్రం రాష్ట్రంపై యూరియా విషయంలో ఆరోపణలు చేసుకోవడంతప్పిస్తే యూరియాను తెప్పించి రైతులకు ఇవ్వడంలో పూర్తిగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు. పెద్ద రైతులకు , ధనికరైతులకు 30నుంచి 40బస్తాలు ఇస్తూ పేద రైతులకుమాత్రం ఒకటిరెండుమాత్రమే అదికూడా చివరలో ఇస్తున్నారని అన్నారు. లేకపోతేలేదని చేతులెత్తేస్తున్నారని అన్నారు. సింగిల్‌విండో చైర్మన్లు డైరెక్టర్లువారు వారి గ్రామాల వారికి అనుకూల రైతులకుమాత్రమే ఇస్తున్నారని అన్నారు. పత్తిపంట అంతా అకాలవర్షాలవలన నష్టం జరగడంతో కోలుకోలేని పరిస్థితిలో రైతాంగం ఉందన్నారు. ఇప్పటికైనా యూరియాకొరతను నివారించాలని, ధనిక, పేద అనేభేదంలేకుండా అందరికీ యూరియాను అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పెరుమాళ్లగోపాల్, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు నర్సింహ్మ, మల్లయ్య, డిహెచ్‌పిఎస్ నాయకులు రాములు, బహుగుణ, నిరంజన్ పాల్గొన్నారు.

## మైనింగ్ తవ్వకాలపై రైతుల ఫిర్యాదుతో విచారణ



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామ శివారులో మైనింగ్ పేరిట రైతుల పట్టా భూములలో మైనింగ్ త్రవ్వకాలు చేపట్టారని రేమద్దుల వాల్యానాయక్ తాండరైతులు హైదరాబాద్‌లోని ప్రజా భవన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా అధికారులు మైనింగ్ సర్వే అధికారి విచారణ చేపట్టేందుకు మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. మైనింగ్ త్రవ్వకాలను ప్రభుత్వం లీజుకు ఇచ్చిన సర్వే నంబర్లలోనే మైనింగ్ త్రవ్వకాలను చేపట్టడం జరిగిందని మైనింగ్ నిర్వాహకులు అధికారులకు తెలిపారు. సర్వే నంబర్ 230, 232, 233, 234, 235, 251, 252 తదితర సర్వే నంబర్లలో మొత్తం 12.16 ఎకరాలు మైనింగ్ త్రవ్వకాలకు ప్రభుత్వం 2005 నుండి అనుమతులు ఇవ్వడం జరిగిందని , సర్వే నంబర్లలోని మైనింగ్ త్రవ్వకాలను చేపట్టడం జరిగిందని మైనింగ్ సూపర్వైజర్ తెలిపారు. వాల్యానాయక్ తాండకు చెందిన ఫిర్యాదుదారులు మాట్లాడుతూ ప్రభుత్వం మైనింగ్ కు ఇచ్చిన ప్రదేశంలో కాకుండా 243, 245 సర్వే నంబర్లు కూడా మైనింగ్ త్రవ్వకాలను చేపట్టాలని గతంలో కూడా మైనింగ్ త్రవ్వకాలను చేపడితే 2016వ సంవత్సరంలో నిర్వాహకులకు పెనాల్టీని వేశారని, నిర్వాహకులు పెనాల్టీ డబ్బులు ప్రభుత్వానికి చెల్లించడం జరిగిందన్నారు. తదనంతరం కూడా మరోసారి 243, 245 సర్వే నంబర్లలో మైనింగ్ త్రవ్వకాలను చేపడుతున్నారని దీంతో గొల్లకుంట పూర్తిగా దెబ్బతిన్నదని ఫిర్యాదుదారులైన తాండ రైతులు అధికారులకు తెలిపారు. మండల సర్వేయర్ సర్వేకు రాకపోవడంతో సర్వే చేయడం లేదని అధికారులు తెలిపారు. మైనింగ్ నిర్వాహకులకు ఫిర్యాదుదారులకు మరోసారి తేదీని ప్రకటించి పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. లీజుకు ఇచ్చిన సర్వే నంబర్లలో కాకుండా ఇతర పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని అక్రమణకు గురికాకుంటే ప్రభుత్వం నిర్వాహకులకు ఇచ్చిన సర్వే నంబర్లలో మైనింగ్ పనులు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్టీ ఇన్స్పెక్టర్ సురేఖ, మైనింగ్ సర్వేయర్ సుజాత, ఆర్ఐ మహేష్ , జిపిఓ బాబు, వీఆర్ఏ మల్లేష్ , గ్రామస్తులు ఉన్నారు.



## ఎస్‌టి హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఎస్‌టిహాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యు విద్యార్థిసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ డిమాండ్‌చేశారు. కల్వకుర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలముందు తమ సమస్యలు పరిష్కరించాలని వర్కర్లుచేస్తున్న సమ్మెకు పిడిఎస్‌యు విద్యార్థిసంఘం మద్దతు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమపాఠశాలల్లో హాస్టల్ వర్కర్లకు 8నెలలనుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని, టైంస్కేల్ ఇవ్వాలని, వర్కర్లను పర్మినెంట్ చేయాలని జిల్లాకలెక్టర్ గెజిట్‌ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వర్కర్లుచేసే ఏపోరాటానికైనా పిడిఎస్‌యు విద్యార్థిసంఘంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినాయకులు అనిల్, అరవింద్, కార్తీక్ పాల్గొన్నారు.

## ఘనంగా రైతాంగ సాయుధపోరాట వారోత్సవాలు




**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** తెలంగాణ రైతాంగ సాయుధపోరాటచరిత్రను వక్రీకరించి, ప్రజలమధ్య చీలికలుతెస్తున్న బిజెపి విధానాలను తిప్పికొడతామని సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జీ పులిజాల పరుషరాములు ఊర్కొండ మండల కార్యదర్శి దారదాసులు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వారోత్సవాల్లోభాగంగా మంగళవారం మధ్యాహ్నం ఊర్కొండ మండలకేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలోవెట్టిచాకిరి, భావ వ్యక్తికరణపై ఆంక్షలు, తెలుగుభాషపై అణచివేత, నిరంకుశధోరణులు కొనసాగాయని తెలిపారు. తెలుగుభాషా సంస్కృతులను రక్షించేందుకు ఏర్పాటైన ఆంధ్ర మహాసభ నిజాంనవాబ్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసిందన్నారు. 1946నుంచి 1951వరకు రైతులు, ప్రజలు నైజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కమ్యూనిస్టులనాయకత్వంలో సాగిన ఈపోరాటంలో పదిలక్షల ఎకరాలభూమి ప్రజలకు పంచినట్లు తెలిపారు.

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తెలంగాణ రైతాంగ సాయుధపోరాటస్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బాలయ్య, వెంకటయ్య, రామస్వామి, నర్సింహ్మా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేటపరిధిలోని బల్మూరు ప్రాజెక్టులో నిర్వహిస్తున్న అంగన్‌వాడి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులను, నవజాతశిశువులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించి బలోపేతంచేసేందుకు కృషిచేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సమస్యలు ఏమైన ఉంటే తమవద్దకుతేవాలని, వృత్తిరీత్యా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ సిడిపిఓ దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బల్మూరు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## మోను ప్రకారం విద్యార్థులకు భోజనం

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి మంగళవారం తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డితో కలిసి పట్టణంలోని ఎస్టీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలోని స్టోర్‌రూం, వంటగదిని పరిశీలించారు. విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, వసతి గృహ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వార్డెన్‌కు సూచించారు.పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను సందర్శించి స్టాక్ వివరాలను పరిశీలించారు.







## కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలి

రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో 2025/26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థినిలు చాలా మంది పేదరికం నుండి, గిరిజన ప్రాంతాల నుండి, వ్యవసాయ కూలీల కుటుంబాల నుండి వచ్చి ఇక్కడ విద్యనభ్యసించడం ఆనందంగా ఉందన్నారు. కుటుంబ పరిస్థితులను అధిగమించి డిగ్రీ వరకు చదివేందుకు రావడం అభినందనీయమన్నారు. డిగ్రీతోనే ఆపకుండా మరొక అడుగు ముందుకు వేయగలిగితే జీవితంలో అద్భుతమైన అవకాశాలు దక్కుతాయన్నారు. మీరు కూడా కష్టపడి చదివితే గ్రూప్ 1, 2, సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించడం పెద్ద విషయం కాదన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. అనారోగ్యం పాలైన విద్యార్థినిల కోసం హాస్టల్లో గీజర్లు, 15 ఫ్యాన్లు, 15 ట్యూబ్‌లైట్లు నాలుగు, ఐదు రోజుల్లో ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు పట్టణ పురప్రముఖులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూరు** : క్రీడాకారులకు ప్రభుత్వంతో పాటు బీర్ల ఫౌండేషన్ అండగా ఉంటుందని, క్రీడాకారులు తమలోని నైపుణ్యాలను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నత పథకాలు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి జీవితంలో స్థిరపడాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి కోకో క్రీడలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి ఇవ్వడం వల్ల ముగ్గురు ఎస్ఐలు అయినట్లు తెలిపారు. భవిష్యత్తు కాలంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులు క్రీడా సామాగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సత్యానారాయణ, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, డైరెక్టర్ తండ రంగయ్య గౌడ్, ఎంపీడీవో ఇందిర, తాసిల్దార్ నాగ దివ్య, ఎంఈఓ రఘురాం రెడ్డి, ఎస్సై అశోక్, మోటకొండూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్ పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు చెల్లించాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : గౌరెల్లి నుండి భద్రాద్రి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి 930 కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ రేటు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భూములు కోల్పోతున్న పోచంపల్లి వలిగొండ మండలాలకు చెందిన రైతులు యాదాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించారు. పోచంపల్లి వలిగొండ మండలాలకు సంబంధించి 15 గ్రామాలలో 455 ఎకరాలు భూసేకరణ చేసి 42 కిలోమీటర్ల పొడవున మన జిల్లా గుండా రహదారి నిర్మాణం కానున్నదని ఆయన అన్నారు. బహిరంగ మార్కెట్లో ఎకరం ఒక్కటికి ఒక కోటి నుండి మూడు కోట్ల వరకు ధర పలుకుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం ఎకరాకు 24 లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పడం సమంజసం కాదని దీన్ని పున పరిశీలన చేయాలని కలెక్టర్ని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, రైతులు గూడూరు బుచ్చి రెడ్డి, భూపాల్ రెడ్డి, బాణాల ఎల్లారెడ్డి, వారల శేఖర్ రెడ్డి, వారల సుదర్శన్ రెడ్డి, రవీందర్, కంటే లింగ స్వామి, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు,హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/చండూరు:** ప్రభుత్వ పాఠశాలలో భవనాలు శిథిలావస్థలో చేరి కూలిపోతున్నాయని, వెంటనే సొంత భవనాలు నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చండూరు ఆర్‌డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేవని నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులకు వెంటనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ హాస్టల్స్ లలో అద్దె భవనాలలో ఉంటున్నటువంటి వాటికి సొంత భవనాలు నిర్మించాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం తలుపులు,కిటికీలు రిపేరు చేయాలని, పెండింగ్‌లో ఉన్నటువంటి మెస్ చార్జీలు,కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సంఘం మండల నాయకులు పల్లె రాజు, చరణ్, మహేష్, కిరణ్, మనీషా, సరిత, కల్పనా పాల్గొన్నారు.

# శివన్నగూడెం రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తి

రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌పై సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయాలి

రిజర్వాయర్ పనుల సమీక్షలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మునుగోడు నియోజకవర్గం లోని మర్రిగూడ మండలం శివన్నగూడ రిజర్వాయర్ పనులపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శివన్నగూడెం రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయినప్పటికీ రిజర్వాయర్ కింద డిస్టిబ్యూషన్ నెట్వర్క్ పనులు మొదలుకాలేదని వెంటనే రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ పై సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు.శివన్న గూడెం రిజర్వాయర్ ని నిర్మిస్తున్నప్పటికీ ఆ రిజర్వాయర్ లోకి ఎక్కడినుండి నీటిని తరలించాలని ఆలోచన గత ప్రభుత్వం చేయలేదని గుర్తు చేశారు. తాను చొరవ తీసుకొని సంబంధిత మంత్రి, నీటి పారుదల శాఖ ఉన్నత స్థాయి అధికారుల తో చర్చించి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎదుల్ల రిజర్వాయర్ నుండి శివన్నగూడ రిజర్వాయర్‌కు నీటిని తరలించేలా రూ.1800 కోట్లతో పరిపాలన అనుమతులు తీసుకొచ్చామన్నారు. వర్షాకాలంలో మూసీ నదిలోకి వృధాగా వెళుతున్న జలాలను ఒడిసిపట్టి వాటిని చౌటుప్పల్ మండల సాగునీటి అవసరాల కోసం వాడుకోవడానికి చిన్న మూసి నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కోసం సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు. చిన్న మూసి వాగు నుండి మూసి నదిలోకి వృధాగా వెళ్తున్న వర్షపు నీరును లిఫ్ట్ చేసినట్లయితే చౌటుప్పల్ మండలం లోని కొన్ని గ్రామాలు సస్యశ్యామలమయ్యే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజనీర్లు ఫోరం సభ్యులు ఎమ్మెల్యేకు తెలపడంతో వెంటనే పనులు మొదలు పెట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో మాల్ ఎస్ఈ. శ్రీనివాసరెడ్డి, మర్రిగూడ ఈఈ రాములు, చండూరు డిఈ కాశీం లతో పాటు తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులు శ్యాం ప్రసాద్ రెడ్డి, సత్తిరెడ్డి,ఇంద్రసేనారెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులలో జాప్యం చేయొద్దు

సాగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పి

**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు, స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు.100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాత నేరస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా సమస్యత్మక ప్రదేశాలను తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటు పై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎస్‌పి వెంట మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు, సిఐ శ్రీను నాయక్ ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

## సాగర్ 14 గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు శ్రీశైలం నుంచి వరద ప్రవాహం గంట గంటకు హెచ్చుతగ్గులతో కొనసాగుతూఉంది గత శుక్రవారం 2లక్షల 50 వేల క్యూసెక్కులకు పైగా వరద కొనసాగుతూ ఉండటంతో రిజర్వాయర్ నీటిమట్టాన్ని నిలకడగా ఉంచుతూ ఆదివారం రాత్రి వరకు 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగించారు. ఆ తరువాత సోమవారం వరద ప్రవాహం క్రమంగా తగ్గుతూ ఉండటంతో గేట్ల సంఖ్యను కూడా తగ్గించారు. అయితే గంట వ్యవధిలో వరద 50 వేల క్యూసెక్కులకు పడిపోవడంతో సోమవారం మధ్యాహ్నం మొత్తం రిజర్వాయర్ గేట్లను మూసివేశారు. అయితే మంగళవారం మధ్యాహ్నం మళ్ళీ అకస్మాత్తుగా వరద ప్రవాహం 1,50,000 క్యూసెక్కుల దాటడంతో మొదట 6 గేట్లను, ఆ తర్వాత 10, సాయంత్రానికి 14 గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 111048 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఈ సీజన్లో మూసివేసిన క్రస్ట్ గేట్లను తెరవడం ఇది ఐదవ సారి కావటం గమనార్హం. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను మంగళవారం సాయంత్రానికి 588.40 అడుగులుగా ఉన్నది అయితే ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా 162318 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉండగా అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

## మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో నిందితుడికి 23 ఏళ్ల జైలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :10 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో నిందితునికి 23 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమాన జరినామా విధించడం జరిగిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ మండలం అన్నపర్తి గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య నాల్గవ తరగతి చదువుతున్న 10 ఏళ్ల మైనర్ అమ్మాయిపై ఇంట్లో ఎవరు లేని సమయంలో బాలికపై అత్యాచారనికి పాల్పడి, ఎవరికైనా చెప్పితే చంపుతానని బెదిరించగా బాధిత బాలిక జరిగిన విషయంపై తన తల్లికి చెప్పడం జరిగింది. ఈ ఘటనపై 2023, మర్చి29న నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితుడి పై పోక్స్ యాక్ట్ 2012 క్రింద కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా మంగళవారం ఏ డి జె టు కమ్ ఎస్సీ, ఎస్టీ కోర్టు అత్యాచారం పోక్సో కేసుల కోర్ట్ నిందితున్ని దోషిగా నిర్ధారించిందని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు 25 వేల జరిమానా, అదేవిధంగా సెక్షన్ 448 ఐపీసీ ప్రకారం1 సంవత్సరం జైలు రూ.5వేల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.సెక్షన్.506 ఐపీసీ ప్రకారం1 సంవత్సరం జైలు రూ.5వేల జరిమానా సెక్షన్ 342 ఐపీసీ ప్రకారం1 సంవత్సరం జైలు రూ.5వేల జరిమానామొత్తం కలిపి 23 సంవత్సరాల జైలు శిక్ష 40 వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందన్నారు.బాధితురాలికి రూ.10 లక్షల రూపాయల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించిందని తెలిపారు.ఈ కేసులో సరి అయిన సాక్ష్యదారలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డిఎస్‌పి నరసింహ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి,అలాగే ప్రాసెక్యూషన్ కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,రూరల్ సిఐ రాఘవ రావు, ఎస్ఐ సైదా బాబు,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్, సిడిఓ దుర్గ రాజు,లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె.కల్పన,లైజన్ అధికారులు పి.నరేందర్,మల్లికార్జున్ లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## ప్రజల భద్రతకు 'మై ఆటో ఇస్ సేఫ్' కార్యక్రమం

400 మంది ఆటోవాలాలకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పంపిణీ : జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజల రక్షణ, మహిళల, విద్యార్థినిల రక్షణ, ప్రయాణ సమయంలో మెరుగైన భద్రత కల్పించడంలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మై ఆటో ఇస్ సేఫ్ అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమంలో భాగంగా ఆటోకు క్యూఆర్ కోడ్ ఇవ్వడం, అలాగే 400 మంది డ్రైవర్లకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ మై ఆటో ఇసే సేఫ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఉన్న అన్ని ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన రక్షణ సర్టిఫైడ్ కాపిని అందించడం జరుగుతుందన్నారు. దీనిని ఆటోలో అంటించి పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని అందులో భాగంగా ఈ కార్యక్రమం అని వివరించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎమర్జెన్సీ బటన్ నొక్కినట్లయితే క్యూఆర్ కోడ్ ప్రొవైడర్ ద్వారా సంబంధిత పోలీసు వారికి సమాచారం చేరి పోలీసు వారు అలర్ట్ అయి రక్షణ కల్పిస్తారని చెప్పారు. ఆటో డ్రైవర్ల సంక్షేమంలో భాగంగా సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం చాలా ఉపయోగవంతమైందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సబ్‌డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, ఇంచార్జి ఆర్‌టిఓ యంవిఐ జయప్రకాష్‌రెడ్డి, మై ఆటో సేఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు బంగారం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సూర్యాపేట నియోజకవర్గస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు టోర్నమెంట్, సెలక్షన్ కార్యక్రమాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే తమ భవిష్యత్తుకు బంగారు బాట అవుతుందన్నారు. చాలా మంది క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించి పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ నాయుడు, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్‌రెడ్డి, నాయకులు

# సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి



**ప్రజాపక్షం/చందంపేట :** నైజాంను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా, స్వాంతంత్ర్యాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్‌లు ఆరోపించారు. ఈనెల 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ చందంపేట మండల సమితి ఆధ్వర్యంలో చందంపేట మండలంలోని ముదుదండ్ల, గన్నేర్లపల్లి, గుంటిపల్లి, పోలేపల్లిలో సిపిఐ ప్రజా పోరాటంలో భాగస్వాములైన అమరవీరుల స్మారక స్తూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి వెంకటయ్య, సహాయ కార్యదర్శి వెంగలయ్య, మండల కార్యవర్గ సభ్యులు శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బీబీనగర్ :** భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో కుమ్మిడి కోదండరాం రెడ్డి (పెద్దన్న), స్వాతంత్ర సమర యోధులు కొలను శివారెడ్డి విగ్రహాలకు, రాఘవపురం గ్రామంలోని జంగా ఎల్లయ్య, వంగరి సీతయ్య స్తూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కాశపాక దయాకర్, సహాయ కార్యదర్శి సార కృష్ణ, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయి వెంకటేష్, ఉప్పునుతల నర్సింహా, చీరే అంజయ్య, కడెం బీరప్ప, వడ్డె సాయిలు, చేరే కిష్టయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** తెలంగాణ సాయుధ పోరాటంలో పదిలక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీదే అని జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి ఎనగల రాజప్ప, మండల కార్యవర్గ సభ్యులు బుడుమ సంధ్యారాణి, కైరం కొండ ఆనంద్, వల్లపు మల్లేష్, విట్టల్ నాయక్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా మండలంలోని కూరెళ్ళ పల్లెర్ల పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో తెలంగాణ రైతంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి, కామ్రేడ్ చాకలి (చిట్యాల)ఐలమ్మ కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జల్ది రాములు, జక్క దయాకర్ రెడ్డి, గుర్రం రాజమణి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యాస బుచ్చిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ :** భూస్వాములకు దోపిడి దారులకు నైజం సర్కారు అండగా ఉండటం వల్లనే నైజాం సర్కారుపై సాయుధ పోరాటానికి సిపిఐ పిలుపునిచ్చిందని నాటి పోరాటంలో నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని తెలంగాణలో గ్రామ గ్రామాన నాటి నెత్తుటి ఆనవాళ్ళు ఉన్నాయని సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు. కనగల్ మండలంలోని చర్లగౌరారంలో అమరజీవి చిలకరాజు మరయ్య, అనచరుడు చింతల అంజయ్య గౌడ్‌ల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్గూరి నర్సింహలు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట రాచరికం భూస్వామి వ్యవస్థ మతోన్మాదంపై ఏకకాలంలో సాగిన ఉమ్మడి సమరమది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి,మండల సహాయ కార్యదర్శి దోటి పాండరి, వి.లెనిన్, ఎం .నందం,బి.వెంకటయ్య, కె.నారాయణ, ఆర్ఎస్ రాములు,అమరజీవి చిలకరాజు మారయ్యావారసులు కొమరరాజు చంద్రమౌళి, రవి,శ్రవణ్ పాల్గొన్నారు.









## రీల్



# నవంబర్ 7న 'జటాధర' విడుదల


సుధీర్ బాబు, బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధా న పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ ద్విభా షా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ గా వైరల్ అయ్యింది. మూవీ మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. జటాధర సినిమాను నవంబర్ 7న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సుధీర్ బా బు, సోనాక్షి సిన్హా తో పాటు దివ్యా ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్ లాంటి అద్భుత తారాగణం స్క్రీన్‌పై కను విందు చేయనున్నారు. ప్రేరణ అరోరా మాట్ల డుతూ రుస్తమ్ తర్వాత జీ స్టూడియోస్‌తో మరో సారి కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా గ్లోబల్ లెవెల్‌లో ప్రజెంట్ చేస్తున్నాం. ఇది ఎమోషనల్‌గా , విజువల్‌గా రేర్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది అన్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరో రా ప్రెజెంట్ చేస్తున్న జటాధరను ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా ప్రొడ్యూస్ చేస్తున్నారు. అకాష్ కేజ్రీవాల్, కుస్సుం అరోరా కో ప్రొడ్యూసర్స్. దివ్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూ సర్, భావిని గోస్వామి సూపర్‌వైజింగ్ ప్రొడ్యూస ర్‌గా వర్క్ చేస్తున్నారు




# చిరంజీవిని కలిసిన రాంగోపాల్ నాయుడు

కీర్తి చక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు చిరంజీవిని కలిశారు. ఆయన అసాధారణ ధైర్యసాహసాలకు రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. ఆయన తన ఆనందాన్ని, మేజర్ ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు ఆశీర్వాదాలను చిరంజీవి అందించారు.

# ఓజీ' గీతం 'గన్స్ ఎన్ రోజెస్' విడుదల



పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఓజీ సినిమా నుంచి తాజాగా మరో పాటను విడుదల చేశారు. 'గన్స్ ఎన్ రోజెస్' అనే పాటను జన ముందుకు తీసుకువచ్చారు. థమన్ సంగీతం అందించారు. గ్యాంగ్ స్టార్ మాఫియా నేపథ్యంలో తెరెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ ను త్వరలోనే విడుదల చేయనున్నారు. సుజిత్ దర్శకత్వం వహి స్తున్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సర సన ప్రియాంక అరుళ్ మోహన్ హీరో యిన్ గా నటిస్తోంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు కేవలం పదిరోజుల సమయం మాత్రమే ఉండటంతో ఆఘమే ఘాల మీద పోస్ట్ ప్రొడక్షన్ పనులు నిర్వహిస్తు న్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తు న్నారు. 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హాష్మీ, ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి తదితరులు నటిస్తున్నారు. రవి కె చంద్రన్ , మనోజ్ పరమహంస అద్భుత మైన విజువల్స్, నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు.



ప్రియాంక అరుళ్ మోహన్

# ఖాళీ సమయంలో పవన్ కళ్యాణ్ బుక్స్ గురించే మాట్లాడతారు

పవన్ కళ్యాణ్ సరసన ఓజీ సినిమాలో ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా విడుదలకు సిద్ధమవు తున్న నేపథ్యంలో కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్ పాత్రికేయు లతో ముచ్చటించింది. ఓజీతో దాదాపు రెండున్నరేళ్ల ప్రయాణం నాది. ఈ ప్రయాణాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. పవన్ కళ్యాణ్ తో కలిసి నటించే అవ కాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఓజీ సినిమాలో కణ్మని పాత్ర చేయడం మరింత అదృష్టంగా భావిస్తున్నాను. ఇప్పటిదాకా నేను చేసిన పాత్ర ల్లో కణ్మని నాకు చాలా ఇష్టమైన పాత్ర. ఈ పాత్రకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానముంటుంది. పవన్ కళ్యాణ్ తో పని చేయడం అనేది ప్రతిరోజూ అదృష్టమే. ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నాను. పవన్ కళ్యాణ్ జెంటిల్ మేన్. అందరినీ సమానంగా చూస్తారు. ఆన్ స్క్రీన్ లో ఆఫ్ స్క్రీన్ లో ఆయన రియల్ హీరో. మూవీ అనౌన్స్ మెంట్ అయిన తర్వాత డైరెక్టర్ నాకు ఈ కథ వినిపిం చారు. కథ నాకు చాలా నచ్చింది. వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకరించా ను. ఇది 198090లలో జరిగే కథ. పాత్రను మలిచిన తీరు కానీ, ఆహార్యం కానీ అప్పటికి తగ్గట్టుగానే ఉంటుంది. కణ్మని ఒక ఇన్నోసెంట్ స్వీట్ గర్ల్. గంభీర పాత్రతో గాఢమైన ప్రేమలో ఉంటుంది. గంభీర జీవితాన్ని మలుపు తిప్పే పాత్ర కణ్మని. 'సువ్వి సువ్వి'నే. ఈ పాటను అందరికీ వినిపించాలని ఎంతగానో ఎదురుచూశాను. విడుదల తర్వాత అందరికీ సాంగ్ నచ్చడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ ఖాళీ సమయంలో ఎక్కువగా పుస్తకాల గురించి మాట్లాడతారు. ఆయన చదివిన కథలు, నవలల గురించి చెప్తారు. చరిత్ర గురించి మాట్లాడతారు. అప్పుడప్పుడు సినిమాలు, రాజకీయాల గురించి కూడా మాట్లాడుతుంటారు. ముఖ్యంగా ప్రజల గురించి ఎక్కువ మాట్లాడతారు. సన్నివేశం షూట్ చేయడానికి ముందు దర్శకుడు, నటీనటులతో పవన్ కళ్యాణ్ చర్చిస్తారు. సినిమాకి ఉపయోగ పడే పలు గొప్ప సూచనలు ఇస్తుంటారు. నటుడిగా కూడా ఆయన తన పాత్రను చాలా సులభంగా చేస్తుంటారు. పవన్ గారి నుంచి చాలా విషయాలు నేర్చుకో వచ్చు. సినిమాలో యాక్షన్ అనేది ఒక భాగం మాత్రమే. బలమైన కథ ఉంది. ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది.సీన్ ఎలా తీయాలి, నటీనటుల నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలి.. ఇలా ప్రతి విషయంపై ఆయనకు స్పష్టత ఉంది. నా క్యారెక్టర్, లుక్ బాగున్నాయంటే దానికి కారణం సుజీత్ గారే.

# కీరవాణితో పోల్చడం ఆనందాన్నిచ్చింది

మిరాయ్ సంగీత దర్శకుడు హరిగౌర



మిరాయ్ సినిమా సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో ప్రధానంగా సంగీతానికి, రీ రికార్డింగ్‌కు మంచి పేరు వచ్చింది. ఈ తరుణంలో సంగీత దర్శకుడు హరి గౌర విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. హనుమాన్ తరువాత మిరాయ్ రెండు బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా హిట్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సక్సెస్ వచ్చినప్పుడు సినిమా కోసం పడ్డ కష్టం మర్చి పోతాం. మా నిర్మాత, దర్శకుడు, హీరో, టీమ్ అందరం చాలా హ్యాపీగా ఉన్నాం.కార్తీక్ చాలా అద్భుతమైన పిక్చర్ తీశారు. ఆ పిక్చర్ నన్ను మ్యూజిక్ ఇవ్వడానికి ఇన్‌స్పైర్ చేసింది. సినిమా చూస్తున్నప్పుడే ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కి దగ్గరగా ఉందనిపించింది.చాలా కాంప్లిమెంట్స్ వచ్చాయి. ఫోన్ కంటిన్యూగా రింగ్ అవుతూనే ఉంది. అందరికీ మ్యూజిక్ చాలా నచ్చింది. ఆడియన్స్ థియేటర్‌లో గ్రేట్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.ప్రతి పాత్రకి వెయిటేజ్ ఉం ది. ప్రతి పాత్ర గొప్ప మ్యూజిక్ ఇవ్వడానికి ఇన్‌స్పైర్ చేసింది. ఇందులో మిరాయ్ ఆయుధానికి లార్డ్ శివ్ బ్యాక్‌గ్రౌండ మ్యూజిక్ (బిజి) ఉపయోగించడం జరి గింది. శ్రీ రాములవారి ఆయుధం అయినప్పటికీ దానికి పినాక అనే పేరు ఉంది. ఆస్ఫూర్తితో బ్యాక్ గ్రౌండ మ్యూజిక్ చేయడం జరిగింది.స్టోరీని దృష్టిలో పెట్టుకుని మ్యూజిక్ స్కోర్ కూడా రాయడం జరి గింది. ఈ సినిమా రాములవారి పోర్షన్ చేయడా నికి దాదాపు 10 డేస్ పట్టింది. అందు లో చాలా ఎలిమెంట్స్ ఉంటాయి. అవన్నీ కూడా పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేయడానికి టైమ్ పట్టింది. ఈ సినిమా కోసం రకరకాల జానర్స్‌ని వాడడం జరిగింది. ఇంటర్వల్ బ్యాంగ్‌లో నాలుగు జానర్స్‌లో సౌండ్‌ని మిక్స్ చేసి ప్రెజెంట్ చేసే అవకాశం రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. వైబ్ వుంది సాంగ్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.. అది సినిమాలో లేకపో వడం అంటే అంతా టీమ్ డెసిషన్. సినిమాకి ఏది అవసరమో అది చేయడమే కరెక్ట్. మేమందరం కలిసి తీసుకున్న నిర్ణయం అది. కీరవాణి లాంటి లెజెండరీ కంపోజర్‌తో పోల్చడం నాకు ఒక భయాన్ని తీసుకొస్తుంది. భవిష్యత్తులో తెలిసో తెలి యక ఏదో ఒక చిన్న తప్పు చేసిన అది నాకు పెద్ద అపవాదాన్ని తీసుకొచ్చి పెడుతుంది. ఆయనతో పోల్చడం ఆనందాన్ని ఇచ్చినప్పటికీ అదే సమ యంలో భయాన్ని కూడా ఇస్తుంది. కన్నడలో చార్మినార్‌తో మంచి హిట్ వచ్చింది. అయితే తెలు గులో ప్రూవ్ చేసుకోవడానికి ఇక్కడికి వచ్చాను. తుంగభద్ర, డియర్ మేఘ, గాలివాన అలాంటి సినిమాలు చేశాను.ప్రశాంత్ వర్మ హనుమాన్ సినిమాకి పనిచేసే అవకాశం వచ్చింది. ఫస్ట్ పూలమ్మె పిల్ల సాంగ్ ఇచ్చాను. ఆయనకి నచ్చింది. తర్వాత ఆయన సినిమా చూపించారు. నేను చేసిన స్కోర్ చాలా నచ్చింది. ఆ సినిమా విజయం గొప్ప నమ్మ కాన్ని ఇచ్చింది.తేజ మళ్లీ మిరాయ్ సినిమా చేసే అవ కాశం ఇచ్చారు. ఈ మొత్తం జర్నీలో మెల్లమెల్లగా నమ్మ కాన్ని బిల్డ్ చేసుకుని రావడం ఆనందాన్ని ఇచ్చింది.పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోనే నాలుగు ప్రాజెక్ట్స్ చేస్తు న్నాను.

## అంతర్గత స్థానిక తాత్కాలిక బదిలీలకు అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్గత స్థానిక తాత్కాలిక బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆ మోదించింది. ఖాళీగా ఉన్న పోస్టుల్లోనే తా త్కాలిక బదిలీలు చేపట్టనుంది. డిప్యూటేషన్ పద్ధతిపైన రెండు సంవత్సరాలు, ఆ తర్వాత మరో ఏడాది పొడిగించాలని ప్రభుత్వం నిర్ణ యించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. జిఒ 317, జిఒ 46 అంశాలపైన మంత్రివర్గ ఉప సం ఘం పలు దఫలు సమావేశాలను నిర్వహిం చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు, శాఖాధిపతులతో పలు దఫలు చర్చించారు. మంత్రివర్గ ఉప సం ఘం నివేదిక, సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభు త్వం తాత్కాలిక అంతర్గత స్థానిక బదిలీలకు అనుమతినిచ్చింది. ఈ బదిలీలను శాశ్వత బదిలీలుగా పరిగణించరాదని, కాలపరిమి తి ముగిసిన వెంటనే తిరిగి స్వస్థల కేడర్‌కు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయి తే ఒక ఉద్యోగి ఒక సారి తాత్కాలిక బదిలీ సౌకర్యాన్ని పొందితే మళ్లీ బదిలీలకు దరఖా స్తు చేసుకునే అర్హత ఉండబోదు. పదోన్నతి పొందినవారితో పాటు ఇతర శిక్ష కాలాన్ని ఎదుర్కొన్న వారు కూడా తాత్కాలిక బదిలీల కు అర్హులు కాదని ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

# సూక్ష్మ బీర్ల తయారీ యూనిట్ ఏర్పాటు నోటిఫికేషన్ రద్దు చేయాలి

ఎఐవైఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : మైక్రో బ్రేవరీల (సూక్ష్మ బీర్ల తయారీ యూనిట్) ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం డ్రగ్స్ ను కట్టడి చేస్తానంటూనేఇంటి వద్దకే డ్రాఫ్ట్ బీర్ పాలసీ నిర్ణయం తీసుకోవడం సిగ్గు చేటాన్నారు. మైక్రో బ్రేవ రీల ఏర్పాటును నోటిఫియేకేషన్ రద్దు చేయాలని డిమాం డ్ చేస్తూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళ వారం నాంపల్లిలోని ఆబ్కారీ కార్యాలయంలో రాష్ట్ర ప్రొ హిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్రలు మాట్లాడుతూరాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రజల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధి లేద ని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టిసియూఆర్)తోపాటు కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ , ఆదిలాబాద్, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధి.....టిసియూఆర్ పరిధిలోని జిహెచ్‌ఎంసితో పాటు బోడుప్పల్, జవహర్ నగర్, ఫీర్జాదిగూడ, నిజాంపేట, బడంగ్ పేట, బండ్లగూ డ జాగీర్, మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్లలో ఎక్సైజ్ శా ఖ ద్వారా మైక్రో బ్రేవరీల ఏర్పాటు నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.మైక్రో బ్రేవరీల ఏర్పా టు వల్ల విద్యార్థులు, యువతపై సామాజిక ప్రభావం, మద్యం అధిక వినియోగం, హింస, అశాంతి, నియంత్ర ణ లేకపోవడం, ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమౌ తాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికే రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు ఉన్నా యని, మైక్రో బ్రేవరీలు కార్పొరేషన్ స్థాయిలో ఏర్పాటు అయితే ఇప్పటికే గల్లీకో వైన్ షాప్, వందలాది బెల్ట్ షా పులు ఉన్న పరిస్థితుల్లో ఈ బీర్ల తయారీ వల్ల చిన్న చిన్న కిరాణా షాపుల్లో సైతం బీర్ల అమ్మకాలు జరపడంతో పాటు దుకాణాదార్లు అత్యాశకు పోయి బీర్లను కల్తీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఈ లీజు దార్లు సిండికేట్‌గా మారి ఆయా ప్రాంతాల్లో వీళ్ల తయా రు చేసే బీర్లనే అమ్మే విధంగా అక్రమ రిటైల్ షాప్ లను నడిపే అవకాశాలు ఉన్నాయని,దీంతో తెలంగాణలో మ ద్యం ఏరులై పారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. . ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రెవెన్యూ కోసం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టే ఈ మైక్రో బ్రేవరీల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్య క్షుడు టి. సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు ఆర్. బాల కృష్ణ,శివకుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, కళ్యాణ్,మధుకర్, వెంకటేష్, రాజ్ కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయి ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, జెన్‌కో సిఎండి హరీష్, సింగరేణి సిఎండి ఎన్.బలరాం, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్, ఎన్‌పిడి సిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, రెడ్‌కో చైర్మన్ శరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్‌తో పాటు మరో కొత్త డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదనల నేపథ్యంలో ప్రాథమిక ప్రణాళికను ఇంధన శాఖ సిద్ధం చేసింది. కొత్త డిస్కం ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికను సిఎంకు అధికారులు వివరించారు. వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సర ఫరా, జిహెచ్‌ఎంసి పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియో గాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అధి కారులు వివరించారు. ఇందుకు సిఎం స్పందిస్తూ ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను మూడు డిస్కంలుగా పునర్విభజన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## ఆలోచించండి

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీలు వేస్తున్నారని, ఈ అంశంపై రెవెన్యూ , ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా నాగార్జున సాగర్ శాసనసభ నియోజకవర్గం లోని తిరుమల గిరి ( సాగర్) మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించామని, ఈ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేశామని, మొత్తం 23వేల ఎకరాలో సర్వే నిర్వహించగా, అందులో 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామని వివ రించారు. ఇందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూల ంగా ఉండగా, 4 వేల ఎకరాలు పాసు పుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎ కరాలకు సంబంధించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి, వారి పాసు పుస్తకాలను రద్దు చేశామని, అలాగే వీరికి రైతు భరోసా, రైతు భీమా కూడా రద్దు చేశామని తెలిపారు. సర్వేలో భాగంగా 7వేల ఎకరాలు అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఆదిలాబాద్ నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు మేర కు కాంగ్రెస్ నాయకుల ఘర్ వాపసి షురూవైంది. మంగళ వారం హైదరాబాద్‌లో ప లువురు ఆదిలాబాద్ జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆది లాబాద్ మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖా న్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ సంజీ వరెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ వా రికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆ హ్వానించారు. తెలంగాణ విలీన దినోత్సవేడు కలను జరుపుకోవడం కాంగ్రెస్ పార్టీ గర్వప డుతుందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కు మార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎప్పటీ మాదిరిగానే గాంధీభవన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో విలీన దినో త్సవ వేడుకలను నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. . విలీనదినోత్సవంపై బిజెపి ప్రజలను అయోమయానికి గురి చేసి రాజకీయ లబ్ది పొందేందుకు యత్నిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడింది కాంగ్రెస్ పార్టీ అని ఆనాడు బిజెపిలు, బిఆర్‌ఎస్‌లు ఎక్కడ ఉన్నా యని, వాళ్లకు మాట్లాడే అధికారం ఎక్కడిది అని ప్రశ్నించారు. నెహ్రూ సారథ్యంలో పటేల్ ఆపరేషన్ పోలో నిర్వహించి తెలంగాణ ను భారతదేశలో కలిపారన్నారు. బిజెపి బిఆర్‌ఎ స్‌లు ప్రతి దానిలో రాజకీయ లబ్ధి పొందాల నుకునే పనిలో ఉన్నాయని, వారు ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజలు నమ్మరనిమహేశ్ కుమార్ పేర్కొన్నారు.

## త్వరలో కిశోర బాలికా సంఘాలు : మంత్రి సీతక్క





ప్రజాపక్షం/హైదరాబాద్: మహిళా స్వయం సహాయక బృందా ల తరహాలోనే త్వరలోనే 'కిశోర బాలిక' సంఘాలను ఏర్పాటు చే స్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటిం చారు. కౌమార బాలిక సంఘాల ఏర్పాటుతో ఎన్నో సామాజిక రుగ్మతలను రూపుమాపవచ్చన్నారు. 14 నుంచి 18 సంవత్సరా ల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ దశలో సరైన మార్గదర్శకం చేస్తే కౌమార బాలికలు సమాజానికి దారిదీ పమవుతారన్నారు. హైదరాబాద్‌లోని జ్యోతి రావు పూలే ప్రజా భవన్‌లో ' కౌమార బాలికల భద్రత, ఆరోగ్యం, పోషణ, సాధికా రత అంశాల'పై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అవగాహన కార్య క్రమాన్ని మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. సర్ప్, మహిళాశిశు అభివృద్ధి శాఖ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో డిఆర్‌డిఒ లు, అదనపు డిఆర్‌డిఒలు, డిడబ్ల్యుఒల కోసం ఈ కార్యక్రమా న్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాల్యవివాహాలు, చదువు మానేయడం,రక్తహీన త, పోషక లోపం, వేధింపులు వంటి అనేక సవాళ్లను కౌమార దశలో బాలికలు ఎదుర్కొంటున్నారని ఆవేనద వ్యక్తం చేశారు. ప్రతి బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని స్పష్టం చేశారు. డిఆర్‌డిఒలు, డిడబ్ల్యుఒలు ఈ సంఘాల ఏ ర్పాటులో భాగస్వాములు కావాలని, ఇలాంటి సంఘాల ద్వారా బాలికల సమస్యలను గుర్తించి, అవగాహన కార్యక్రమాలు చేప ట్టే అవకాశం ఉంటుందన్నారు. పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాం తాల బాలికల సమస్యలు వేర్వేరుగా ఉంటాయని, వాటి స్వభా వానుసారం నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. గ్రామాల వారీగా అధికారులు ఈ సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఈ కార్య క్రమంలో సర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, అదనపు సిఇఒ కాత్యా యని, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచం ద్రన్, డైరెక్టర్ జి.సృజన, యూనిసెఫ్ చైల్డ్ ప్రొటెక్షన్, కౌమార,యువజన అభివృద్ధి అధికారి ఎం. మురళీకృష్ణ, తరుణి సంస్థ చైర్‌పర్సన్ మమత రఘువీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5.15 లక్షల మంది కౌమార దశ బాలికలను గుర్తించారు.

## పోరాటంగా చిత్రీకరణ

(మొదటి పేజీ తరువాయి)

మారలేదని విమర్శించారు. మానవ సంబంధాలు విధ్వంసం అవుతుండడం ఆందో ళనకారమన్నారు. పాశం యాదగిరి మాట్లాడుతూ హోం మంత్రి అమిత్ షాకు తెలంగాణ పోరాట చరిత్ర తెలియదన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ.. భూస్వాములు, నిజాం అరాచకాల పైన బడుగువర్గాలు జరిపిన పోరాటం మరువలేనిదన్నారు. శ్రమ దోపిడీపైన అసమాన పోరాటం జరిపారని గుర్తు చేశారు. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైద్రాబాద్ పై నిష్పక్షపాతమైన చరిత్రను రాయాల్సి ఉందని, బందగీ చరిత్రను వెలుగులోకి తీసుకురావాల్సిన అవ సరం ఉందన్నారు. ప్రొఫెసర్ కందుకూరి రమేష్ మాట్లాడుతూ మరుగున పడుతున్న చరిత్రను యువతకు అందించేందుకు ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం పునః సమీక్ష పేరిట సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆక్టివిస్ట్ అచ్యుత సునీత మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్ర అత్యంత కీలక మని గుర్తు చేశారు. అంతకు ముందు సంగిశెట్టి శ్రీనివాస్ రాసిన ' సింగార వేలు ' పుస్తకాన్ని వారు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కొండా నాగేశ్వర్ రావు, ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్, ఎఐఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, రైతు స్వరాజ నాయకులు కన్నె గంటి రవి, వివిధ విద్యార్థి సంఘాల నేతలు ఆర్.ఎన్. శంకర్, కాంపల్లి శ్రీనివాస్, ఆర్.ఎల్. మూర్తి, ఎస్. నాగేశ్వర్ రావు, బట్టు వెంకటేశ్వర్లు, తాళ్ల అజయ్, కలకోటి ఉదయ్, ఎన్ సుమంత్, నామ సైదులు, వేదాంత్, అశ్వన్, ఆన్సర్, రాకేష్, మొగిలి పాక నవీన్, పరిశోధక విద్యార్థులు సునీల్, చరణ్, వినోద్, దుబ్బ రంజిత్, బండి శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్, నిఖిల్, వెంకటేష్, విద్యార్థులు సుశాంత్, నెల్లి శివ, జీల మహేష్, భాను, కార్తీక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com